ఆంధ్రగాథాలహరి

(హాలుని ప్రాకృత ‘గాథాసప్తశతి’లోని కొన్ని గాథలకు స్వేచ్ఛానువాదం)

ఆంధ్రభూమి దినపత్రికలో ధారావాహికంగా
ప్రచురింపబడిన రచన

డి.వి.ఎం. సత్యనారాయణ

ఆంధ్రగాథాలహరి

(హాలుని ప్రాకృత 'గాథాసప్తశతి'లోని కొన్ని గాథలకు స్వేచ్ఛానువాదం)

ప్రథమ ముద్రణ - జనవరి' 2019

ప్రతులు : 1000

వెల : 100/-

ప్రతులకు :

డి. సుమమాల,

W/o డి.వి.ఎం.సత్యనారాయణ,

32-99-4, విశ్వభారతి స్కూలు వద్ద,

అద్దంకి - 523 201,

ప్రకాశం జిల్లా.

సెల్ : 9885846949.

డి.టి.పి. & డిజైన్ : శివాని గ్రాఫిక్స్, అద్దంకి.

ముద్రణ : పూర్ణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (పూర్ణ), అద్దంకి. 9989157457.

<u>అభినందనలు</u>

జ్ఞానపథముదెలుపు జానపదులమాట
మాటమాట యందు మార్మికతయె
వెక్కిరింపులందు వేదాంత విషయాలు
నవ్వులాటలందె నీతిబోధ॥

ఆంధ్రభూమి కొరకు ఆంధ్రగాథాలహరి
అందజేసి పాఠకాదరణతొ
పుస్తకంబుదెచ్చు పుణ్యమూర్తికి నేడు
వాక్కులలరజేతు వందనములు॥

శ్రీ డి.వి.ఎం. సత్యనారాయణ గారికి అభినందనలతో...

ముళ్ళపూడి సదాశివశర్మ
రెసిడెంట్ ఎడిటర్, ఆంధ్రభూమి.

డా॥ కాసల నాగభూషణం (చెన్నై) గారి

అక్షరాభినందన

దొడ్డవరము భాషకు తాను దొడ్డవరము
సత్యనారాయణ సృజన సమ్మతముగ
ధారధారణమెరయ పద్యములు పలుకు
నవనవమ్ము గాథల సుగంధమ్ము చిలుకు.

అల్లప్రాకృతమున హాలుండు వ్రాసిన
గాథలందు కొన్ని కథనములుగ
ఠీవి మెరయగూర్చు డీవియమ్మెస్ గారి
మాటనేర్పుకొలది ఆటవెలది॥

నా మాట

ఆ.వె॥ దొడ్డవరమువాడ! దొడ్డవంశమునందు
ప్రభవమందినాడ! ప్రాజ్ఞులార!
నన్నుజనులు, సత్యనారాయణుండంద్రు
సుబ్బరామయాఖ్యసుతుడనేను॥

ఉ॥ చిక్కని భావజాలములు చేతన గూర్చెదు లోకవృత్తముల్
మక్కువమీరగా నరసి మంజుల శబ్దములేర్చికూర్చియున్
అక్కజమైన రీతి సకలాంధ్ర జనావళి మోదమందగన్
చెక్కితి పద్యశిల్పముల చిత్తమునందున చింతసేయుచున్॥

– 'గాథాసప్తశతి' క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన సంకలన గ్రంథం. సంకలనకర్త హాలుడు. హాలుడు కూడా కొన్ని గాథలను స్వయంగా వ్రాశాడు. ఇతడు శాతవాహన చక్రవర్తి. శాతవాహనులు తెలుగురాజులు.

హాలుడినే శాతవాహనుడు లేదా శాలివాహనుడు అని కూడా అంటారు. శాలివాహనశకం ఈతని పేరు మీదనే ప్రారంభమైంది. ఈతని ఆస్థానంలో అనేక మంది కవులుండే వారని ప్రతీతి.

'గాథాసప్తశతి' మహారాష్ట్రీప్రాకృత భాషలో రచింపబడిన గ్రంథం. 'వెబర్' వంటి పాశ్చాత్య పండితులను సైతం ఈ గ్రంథం ఎంతగానో ఆకర్షించింది. దీనికి కారణం – రెండు వేల ఏళ్ళనాటి జనజీవనం ఈ గాథలలో ప్రతిఫలిస్తుండడమే. క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటికి లోకంలో ప్రాచుర్యంలో ఉన్న కోటిగాథల నుంచి ఏడు వందల గాథలను ఎన్నుకున్నానని హాలుడు స్వయంగా చెప్పాడు. అమాయకులైన పల్లెజనుల మనోహరవ్యవహారములు, మనోవ్యాపారములూ ఎలాంటి అరమరికలు లేకుండా ఇందులో వర్ణించబడ్డాయి.

మనకు తెలిసినంతవరకు తొలిసారిగా శ్రీనాథుడు 'శాలివాహన సప్తశతి' పేరుతో ఈ గాథలను తెలుగులోకి అనువదించాడు. అయితే రెండు, మూడు పద్యాలు తప్ప పూర్తి గ్రంథం అలభ్యం. ఆధునికులలో శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

గారు, శ్రీ వాసిరెడ్డి వెంకటసుబ్బయ్యగారు, అత్యాధునికులలో శ్రీ నరాల రామారెడ్డి గారు, డా॥ కోడూరి ప్రభాకరరెడ్డి గారు మొదలైన పెద్దలు తెలుగులోకి అనువదించారు. 'గాథాసప్తశతి' లోని శ్లోకాలు, వాటిలోని చమత్కారాలు నన్ను అమితంగా ఆకర్షించాయి. నేను కూడా ఒక ప్రయత్నం చేద్దామనే తలంపుతో ఇప్పటి సమాజానికి నప్పని, ఒప్పుకోలుగాని గాథలను మినహాయించి, కొన్ని గాథలను సరళమైన పద్యాలరూపంలో అనువదించే ప్రయత్నం చేశాను. ఇది యథాతథానువాదం మాత్రం కాదు. స్వేచ్ఛానువాదం మాత్రమే. మూలంలోని భావాన్ని అనువాదాల సహకారంతో గ్రహించి నా సొంతమాటల్లో చెప్పే ప్రయత్నం చేశాను. కేవలం సామాన్యుల కోసం చేసిన ప్రయత్నమే ఇది. కారణం నేనూ సామాన్యుణ్ణే. పండితుణ్ణి కాదు. ఈ ప్రయత్నాన్ని 'ఆంధ్రగాథాలహరి' గా అందమైన బొమ్మలతో సహా ప్రచురించి వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రభూమి' దినపత్రికకు ధన్యవాదములు. ఇప్పుడు పుస్తకరూపంలో వెలువడుతున్న ఈ ఆంధ్రగాథాలహరిని చదివి, ఆనందించి, ఆదరించి, ఆశీర్వదించవలసినదిగా అభ్యర్థిస్తున్నాను. సవినయ నమస్సులతో...

భవదీయ

– డి.వి.ఎం. సత్యనారాయణ

కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు శ్రీమతి లలితాకుమారి, శ్రీ డి.వి.సుబ్బరామయ్య గార్లకు,

ఆంధ్రగాథాలహరిని ధారావాహికంగా ప్రచురించి, అభినందనలు పలికిన ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకావతంసులు శ్రీయుత ముళ్ళపూడి సదాశివశర్మగారికి, అక్షరాభినందనలు పలికిన డా॥ కాసల నాగభూషణం గారికి,

నా సాహిత్యవ్యవసాయానికి అమేయ సహకారమందిస్తున్న నా అర్ధాంగికి మేనమామ, నాకు పితృతుల్యులు శ్రీ టంగుటూరి శ్రీరామ్ గారికి,

నా పురోభివృద్ధిని కాంక్షించే సహృదయసాహితీ సమారాధకులు శ్రీ యం.వి.యస్. ప్రసాద్ (AIR), డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు, డా॥ ధీరం సుందరరావు, డా॥ యు. దేవపాలన, శ్రీ బి.హనుమారెడ్డి (ప్ర.ర.సం. అధ్యక్షులు), శ్రీమతి తేళ్ళ అరుణ, శ్రీ జి.యస్.యస్. దివాకరదత్, శ్రీ పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శతావధాని శ్రీ నారాయణం బాలసుబ్రహ్మణ్యం, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, శ్రీ అన్నమనేని వెంకటరావు, శ్రీ మౌలాలి గురుస్వామి, శ్రీ పంతంగి ఆంజనేయులు గార్లు మరియు సృజన కవిమిత్రులందరికీ,

నన్ను, నా కవిత్వాన్ని అభిమానించే అవధాని శ్రీ సురభి శంకరశర్మ, శ్రీ నూనె అంకమ్మరావు, శ్రీ ఆర్.వి.రాఘవరావు, శ్రీ చందలూరి నారాయణరావు, శ్రీ మన్నం త్రిమూర్తులు, శ్రీ యం.వి.యస్.శాస్త్రి, శ్రీ పొన్నూరు వేంకటశ్రీనివాసులు, శ్రీ భువనగిరి పురుషోత్తం, శ్రీ అన్నా పంతుల జగన్నాథరావు, శ్రీ కుర్రా ప్రసాద్ బాబు, శ్రీ జ్వాలా మొదలగు సాహితీ మిత్రులందరికీ,

మా భారతీయ జీవిత బీమాసంస్థ, అద్దంకిశాఖ సహోద్యోగులందరికీ,

ఈ పుస్తకాన్ని శ్రద్ధగా డి.టి.పి. చేసిన శ్రీమతి శివపార్వతి (శివాని) గారికి, అందంగా ముద్రించి ఇచ్చిన పూర్ణఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికీ,

ఈ పుస్తకం వెలుగుచూడడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

- డి.వి.ఎం. సత్యనారాయణ

ఓం
శ్రీరామ



శ్రీ ఉమాధవుండు చిత్తజుదమనుండు
నందివాహనుండు నందకరుడు
విఘ్నపతిని, గుహుని ప్రేమతో ముద్దాడు
శంకరుండు మనకు శర్మమొసగు॥

– గణపతినీ, కుమారస్వామినీ ముద్దాడుతూ సపరివారంగా పరివేష్ఠించి ఉన్న ఉమాపతియైన పరమశివుడు మనకందరకూ సుఖసౌఖ్యములనిచ్చుగాక!

నిశ్చలంగా నిలచిన కొంగ

తే.గీ॥ స్వచ్ఛ మరకతస్థితమైన శంఖమట్లు
మధుర జలధర కాసార మధ్యమందు
నిశ్చలతపస్సమాధి వినిష్ఠితగతి
జలజపత్రంబుపై కొంగ నిలచె చూడు॥



– ఒక అందమైన, నిర్మానుష్యమైన కొలనులో తామరాకు మీద కదలకుండా నిలచి ఉన్న కొంగను చూపిస్తూ నాయిక "చూడూ! ఆ కొంగ పచ్చలపాత్ర (పళ్ళెం) పై నిలచి ఉన్న తెల్లని శంఖంలా లేదూ!'' అని కవితాత్మకంగా చెప్పింది.

ప్రాకృతమూలం:

ఉ అ ణి చ్చలణిప్పందా భిసిణీపత్తమ్మిరేహ ఇబలా అ।
ణిమ్మల మరగ అభాఅణ పరిట్ఠిఆసంకసుత్తి వ్వ॥ (వోదిసుడు) (1-4)

సంస్కృతచ్ఛాయ:

పశ్య నిశ్చల నిష్పందా బిసినీ పత్రే రాజతే బలాకా।
నిర్మల మరకత భాజన పరిస్థితా శంఖసుక్తిరివ॥

దోహదం

ఎప్పుడూ తోటపనిలోనే నిమగ్నమై, తన్ను పట్టించుకోని పతిని గూర్చి కొత్తగా పెళ్ళైన భార్య ఇలా అనుకుంటోంది.

తే.గీ॥ **అతివ తోడ తరులకు దోహదము చేసి**
కాయలుబ్బగ కాయింప కష్టపడును
గాని, నిజదార కడుపున కాయకొరకు
యత్న మొనరింపదేమి? ఆ హాలికుండు॥



– "ఎంతసేపూ ఆ చెట్టును కౌగిలించుకో, ఈ చెట్టును కౌగిలించుకో! అంటాడే గానీ నా కడుపున ఒక కాయ కాసే మార్గం గురించి ఆలోచించదేమిటి? ఈ వెఱ్ఱిబాగులమగడు'' అనుకుంటూ ప్రక్కకు తిరిగి మునిమునిగా నవ్వుకొంటోంది.

ప్రాకృతమూలం:

ణోహలి అమప్పణో కింణ మగ్గసే కురవ అస్స।
ఏ అంతుహసుహగ ఇస ఇ వలి అణణ పంక అంజా ఆ॥

(మయరందసేనుడు) (1–6)

సంస్కృతచ్ఛాయ:

దోహదమాత్మనః కిం న మృగయసే కురవకస్య।
ఏవంతవ సుభగ హసతి వలి తానన పంకజం జాయా॥

ఎదుగుతున్న జనపచేను

తే.గీ॥ **పంటకోతకు వచ్చియు వాలినట్టి**
వరిపొలముఁగాంచి హృదికలవరము చెందు
సఖియనూరడించుచు ప్రియసఖియబలికె
"కనుమదె ఎదుగుచున్నది జనపచేను"!

– ఆమె ప్రియుణ్ణి రోజూ కలుసుకునే సంకేతస్థలం ఆ వరిపొలం. వరిపంట కోతకు వచ్చినందువల్ల క్రమంగా అది వాలిపోతోంది. 'సంకేతస్థలం కనుమరుగవుతోందే!' అని మనసులో బాధపడుతూ, ఆ పొలం వంక దీనంగా చూస్తున్న చెలిని ఓదారుస్తూ ఆమె ఇష్టసఖి "ఎందుకే బాధపడతావ్! ప్రక్కనున్న జనపచేను చూడు ఎలా ఎదిగి వస్తోందో!" అంటూ నీకు మరో సంకేతస్థలం సిద్ధమవుతోందని ఊరడించింది.



ప్రాకృతమూలం:

కిం రు అసి ఓణ అముహీ ధవలా అంతేసు సాలిచ్ఛేత్తేసు।
హరి ఆలమండి అముహీ ణడి వ్వసణవాడి ఆ జా ఆ॥ (మహేంద్రుడు) (1–9)

సంస్కృతచ్ఛాయ:

కిం రోదిష్యవనతముఖీ ధవళాయ మానేషు శాలిక్షేత్రేషు।
హరితాల మండిత ముఖీనటీవ శణవాటికా జాతా॥

నీ మోము చంద్రబింబమే!

ఆ.వె॥ **చేతికంటిన మసి చెక్కిలిపై చేర**
వంటసేయుచున్న ఇంటిదాని
వదనగరిమ గాంచి పతినవ్వుచు బలికె
'చంద్రబింబమిపుడు సాటినీకు'

– ఇల్లాలు వంట ఇంట్లో వంట చేసుకుంటోంది అప్పుడు వచ్చిన పతి ఆమెను చూచి 'నీ ముఖం ఇప్పుడు కదా! చంద్రబింబంతో సాటి అన్నాడు'. 'ఎందుకు?' అందామె. 'మసి చుక్క నీ బుగ్గకు అంటుకోవడం వల్ల చంద్రబింబంలో ఉన్న మచ్చ కూడా నీ ముఖానికిప్పుడు సమకూరింది. అందువల్ల ఇప్పుడు నీ ముఖం నిజంగా చంద్రబింబమే!' అన్నాడు పతిదేవుడు. ఆమె కిలకిలా నవ్వింది.



ప్రాకృతమూలం:

ధరిణీ ఏం మహాణస కమ్మలగ్గ మసిమలిఇ ఏణ హత్థేణ।
ఛిత్తం ముహం హసిజ్జ ఇ చందావత్థం గ అంపఇణా॥ (హాలుడు) (1–13)

సంస్కృతచ్ఛాయ:

గృహిణ్యా మహానసకర్మలగ్న మషీమలినితేన హస్తేన।
స్పృష్టం ముఖం హస్యతే చంద్రావస్థాంగతం పత్యా॥

అగ్నిదేవుడు రసహృదయుడే!

తే.గీ॥ **పొయ్యిమండక ముసురుకు పొగలునిండ**
ఊది ఊది ఆమె పెదవులుబ్బిపోవ
మగడు జూచి ఈరీతి చమత్కరించె
"అగ్ని త్రావుచుండెను నీదు అధరసుధలు"

– అసలే వానాకాలం, ముసురుపట్టింది. కట్టెలు మండక పొయ్యంతా పొగలతో నిండిపోయింది. ఊదీ ఊదీ పాపం ఆ ఇల్లాలి పెదవులుబ్బిపోయాయి. అప్పుడే వచ్చిన పతిదేవుడు ఆ దృశ్యాన్ని చూసి "అగ్ని నీ అధరసుధలను తాగాలనుకుంటున్నాడో ఏమో! అందుకే సరిగా మండడం లేదు" అన్నాడు.



వివరణ : 'ఇంటా బయటా జంటకవులవలె అంటుకు తిరగాలోయ్!' అంటాడో సినీకవి. భార్యాభర్తలు జంటకవుల్లా, గళాలు రెండైనా హృదయం ఒక్కటిగా జీవించాలని అతని అభిమతం. అలా కవితాత్మకంగా జీవించిన ఓ జంట కథే ఈ గాథ. వర్షం, కట్టెలు మండక పోవడం, వంట ఆలస్యం అవడంవంటి ఎన్ని కష్టాలున్నా చిరచిరలాడకుండా కవితాత్మకంగా స్పందించిన పతిదేవుడే మనకు ఆదర్శం.

ప్రాకృతమూలం :

రంధణ కమ్మణి ఉణిఏ మాజూరసు రత్తపాడల సు అంధం!
ముహమారు అం పి అంతో ధూమా ఇ సీహిణ పజ్జల ఇ॥ (భీమస్వామి) (1–14)

సంస్కృతచ్ఛాయ :

రంధకర్మనిపుణికే। మాక్రుధ్యస్వ రక్తపాటల సుగంధమ్।
ముఖమారుతం పిబం ధూమాయ తే శిఖీ న ప్రజ్వలతి॥

నువ్వేచాలు

ఆ.వె॥ **తోయజాక్షి యొకతె తొలిచూలుదాల్చంగ**
'అడుగుమేదివలయు?' ననగ చెలులు
మగని ముఖమువంక మధురంబుగా జూచి
సిగ్గుతోడనామె శిరమువంచె॥

– ఒక యువతి తొలిసారిగా గర్భం ధరించింది. అమ్మలక్కలంతా చుట్టూ చేరారు. "గర్భంతో ఉన్నవాళ్ళకు ఏవేవో కోరికలుంటాయి కదా! నీకేంకావాలో అడుగు?" అన్నారు. దానికి ఆమె మగని వంక మధురంగా ఒకచూపు చూసి సిగ్గుతో తలవంచుకుంది. అంటే 'నా మొగుడే నాకు సర్వస్వం అతని ప్రేమ తప్ప నాకింకేమీ అక్కర్లేదని' ఆమె చెప్పకనే చెప్పిందన్నమాట.



వివరణ:

సహజంగా ఆడవాళ్ళు గర్భవతిగా ఉన్నప్పుడు ఏవేవో కోరికలు కోరడం వాటిని భర్తలు ఇష్టంగా తీర్చడం మన సంప్రదాయం. కానీ ఇక్కడ భర్త పేదవాడు. అందువల్ల ఆమె ఏమి కోరినా అతడు తీర్చలేక నలుగురిలో పలుచనైపోతాడు. అందుకే ఇంటిగుట్టు కాపాడడానికి ఆమె ఏమీ కోరకుండా మధురంగా నవ్వి ఊరుకుందన్నాడు గాథాకారుడు. ఇలా గుప్తంగా భర్తల మానప్రాణాలను కాపాడుతున్న భారతీయ మహిళామూర్తులెందరో!

ప్రాకృతమూలం:

కిం కిం దే పడిహాసఇ సహీహిం ఇ అ పుచ్ఛి ఆ ఏం ముద్ధా ఏ।
పఢ ముగ్గ అదోహణ ఏం ణవరం ద ఇ అంగ ఆదిట్ఠీ ॥ (గజసింహుదు) (1–15)

సంస్కృతచ్ఛాయ:

కిం కిం తే ప్రతిభాసతే సఖీభిరితి పృష్టయా ముగ్ధయాః ।
ప్రథమోద్గత దోహదిన్యాః కేవలం దయితం గతాదృష్టః॥

అదే చల్లదనం నాకు కూడా!

తే.గీ॥ నా మనోహరుని మదికి నయము గూర్చు
సాంద్ర శీతమయూఖ సుస్పర్శ నాకు
సైతము, కలుగ జేయుము శతమయూఖ!
అమృతమయ! యామినీ వదనాబ్జతిలక॥

– చిరకాలం పతికి దూరంగా ఉండడం వల్ల విరహంతో బాధపడుతున్న నాయిక "నా ప్రియుణ్ణి ఏ చల్లని కిరణాలతోనైతే స్పర్శించి ఆనందం కలుగజేస్తావో, అవే కిరణాల స్పర్శతో నాకు సైతం ఆనందం కలిగించమని" అమృతమయుడైన చంద్రుణ్ణి వేడుకొంటున్నది. అమృతం అందరినీ బ్రతికించే దివ్యపదార్థం కదా!



వివరణ:

ఈ గాథలో నాయిక చంద్రుణ్ణి అనేక విధాలుగా సంబోధిస్తోంది. 'అమృతమయు' అంటే అమృతము కలవాడని అర్థం. చంద్రుడు ప్రసరించే కిరణాలే కదా! దేవతలకు ఆహారం. చల్లని పండు వెన్నెల్లోనే కదా! యువక హృదయాలకు వినోదాలూ, విహారాలూ. ఇంకో సంబోధన 'యామినీవద నాబ్జతిలక'! అంటే రాత్రి అనే స్త్రీ నుదుటి మీద బొట్టువంటి వాడా! అని. ఎంత అందమైన ఊహ. చంద్రుడు గుండ్రంగా బొట్టులా ఉంటాడు. నల్లని ఆకాశంలో రాత్రికన్యకు అందమైన బొట్టులా చందురుడు చక్కగా సరిపోతాడు. మన పూర్వీకులు ప్రకృతితో ఎంత మమేకమయ్యారో తెలిపేందుకీ గాథ ప్రత్యక్ష సాక్ష్యం. నేడు ఇరుకు అపార్‌మెంట్ల కీకారణ్యంలో మనకు చంద్రుడు అందంగా కనిపించే భాగ్యం ఉ ందా!

ప్రాకృతమూలం:

అమ అమ అగ అణసేహర! ర అణీ ముహతిలహ! చందేదే ఛివసు।
ఛిత్తో జోహింపి అఅమోమమంపి తేహిం విఅకరేహిం॥ (హాలుడు) (1–16)

సంస్కృతచ్ఛాయ:

అమృతమయ గగనశేఖర। రజనీముఖ తిలక। చంద్రహీస్పృశ।
స్పృష్టోయైః ప్రియతమో మామపి తైరేవకరైః॥

ఇకనైనా వదలండి

దారినపోతున్న బాటసారికి ఒక ఇంటిముందు ఆరవేసి ఉన్న చివికి చిరుగులు పడ్డ దుప్పటి ఒకటి కనిపించింది. అతనికిలా అనిపించింది.

తే.గీ॥ **పేదరాలుతికి బయట వేసినట్టి**
చివికి చిరిగిన దుప్పటి చివర నుండి
జారిపడు నీటి బొట్టుల తీరు జూడ
'అలసిసొలసితి మేనిలో బలములేదు
విడువుడికనైన నన్నని' వేడుకొనుచు
కార్చు కన్నీటిబొట్లుగా కానిపించు ॥



– ఆరవేసిన దుప్పటి కొసల నుండి బొట్లు బొట్లుగా నీరు కారుతోంది. 'చాలా ఏళ్ళ నుంచి మీకు సేవచేస్తూనే ఉన్నాను. ఇకనైనా నన్ను వదిలిపెట్టండి' అని దుప్పటి కన్నీరు కారుస్తూ ఆ కుటుంబాన్ని వేడుకుంటోందా! అన్నట్టుగా ఉందట ఆ దృశ్యం.

ప్రాకృత మూలం:

దుగ్గఅకుటుంబా అట్ఠీ కహంణు మేఏధోఇఏణసోఢవ్వా
దసిఓసరంత సలిలేణ ఉ అహరుణ్ణం పడ ఏణ॥ (సిరిధమ్మియుదు) (1–18)

సంస్కృతచ్ఛాయ:

దుర్గతకుటుంబాకృష్టిః కథం ను మయాధౌతేన సోఢవ్యా
దశాపసరత్సలిలేన పశ్యత రుదిత మివ పటకేన॥

అలకల కులుకులు

తే.గీ॥ **ఆలసించిన కతమున, అలిగినపతి**
బుగ్గపై, ప్రేమతో సతిముద్దిడంగ
పులకలాతని మేనిపై పొడమజూచి
'చాలునిక దొంగ నిద్దుర' జరుగుమనియె॥

– ఆమె ఆలస్యంగా పడకగదిని చేరింది. మగడు నిద్రలో ఉన్నట్టుగమనించి అతని బుగ్గపై ఒక ముద్దును ముద్రించి అతని మేనిపై పులకలు రావడం గమనించిన ఆమె అతనిది దొంగ నిద్దుర అని గ్రహించి 'ఇక ముందు ఇలా జరగదులే! దొంగ నిద్దుర చాలించి జరిగి నాక్కొంచెం చోటివ్వు' అని గారంగా అడిగింది.



వివరణ:

భార్యాభర్తల అలకలు, ఆగ్రహాలు పడకగది బయటే ఉండాలని నిర్దేసిస్తుందీగాథ. అన్యోన్య దాంపత్యం ఇందులో వర్ణితం. అలకలు చిలికి చిలికి గాలివానలు కాకుండా, మూడోమనిషి ప్రమేయం లేకుండా భార్యాభర్తలు ఒకరితో ఒకరు ఎలా ఒద్దికగా ఉండాలో తెలుపుతుందీ గాథ.

ప్రాకృతమూలం:

అలిఅపసుత్త అ వినిమీలిఅచ్ఛ దే సుహఅ! మజ్ఝఓ ఆసం।
గండపరిఉంవణాపులిఅంగం ణ పుణే చిరఇస్సం॥ (చంద్రస్వామి) (1-20)

సంస్కృతచ్ఛాయ:

అలీకప్రసుప్తక వినిమీలితాక్ష హేసుభగ! మమావకాశమ్।
గండపరిచుంబనా పులకితాంగంన పునశ్చరయిష్యామి ॥

ఊరికి సుఖనిద్ర – కలికికి కలతనిద్ర

తే.గీ॥ **కరకుయుద్ధాల తగిలిన కత్తిపోట్లు**
ఎగుడుదిగుడు చేసెను వాని ఎదను మిగుల
నిద్దరోయెను ఊరెల్ల నిర్భయముగ
నిజసతికి మాత్రము కలతనిద్ర మిగిలె॥

– అది ఒక పల్లెటూరు. ఆ ఊళ్ళోనో అనేక యుద్ధాల్లో పాల్గొన్న మహాయోధుడున్నాడు. యుద్ధాల్లో తగిలిన కత్తిపోట్ల గాట్ల వల్ల అతని ఎద ఎగుడు దిగుడుగా మారింది. అంతటి వీరుడు ఊళ్ళో ఉన్నాడని ఊరంతా నిర్భయంగా నిద్రపోతోంది. కానీ, ఆ వీరుడి భార్య మాత్రం అతని ఎగుడు దిగుడు ఎద మీద సరిగా నిద్రపోలేకపోతోందట.



వివరణ:

ఊర్లో ఒక గొప్ప యోధుడు ఉన్నాడంటే అందరికీ అభయమే కదా! దొంగల నుంచి, శత్రువుల దాడుల నుంచి అతడు రక్షిస్తాడని ఊరివారందరికీ ఒక నమ్మకం. కానీ యోధుడి భార్యకు మాత్రం కలత నిద్రే మిగిలిందంటున్నాడు గాథాకారుడు. సమర్థులు, యోధులైన వాళ్ళ ఇళ్ళల్లో ఎప్పుడు ఎవరు వచ్చి సాయం అర్థిస్తారోననే శంక వెంటాడుతూనే ఉంటుంది. అదే విషయాన్ని ధ్వని పూర్వకంగా తెలుపుతున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం:

పహరవణమగ్గవిసమే జా ఆ కిచ్ఛేణలహఇ సేణద్ధం ।
గామణి ఉత్తస్స ఉరేపల్లీ ఉణసా సుహంసువ ఈ॥ (అంగరాజు) (1–31)

సంస్కృతచ్ఛాయ:

ప్రహారవ్రణమార్గ విషమే జాయా కృచ్ఛేణ లభతే తస్యనిద్రామ్।
గ్రామణీపుత్రస్యోరపి పల్లీ పునః సా సుఖం స్వాపితి॥

వీపు కూడా కాలుస్తున్నావా!

తే.గీ॥ కల్లలాడినావు, హృదిని కాల్చినావు
వలదు వలదని నేనటువైపు తిరుగ
వదలకను కాల్చుచుంటివి వన్నెకాడ!
విరహనిశ్వాసములతోడ వీపు కూడ॥

ప్రియుడు ఆమె హృదయాన్ని గాయపరిచాడు. ఆమె పడకపై అటువైపు తిరిగి పడుకుంది. అతని వేడి నిట్టూర్పులు ఆమె వీపును తాకుతున్నాయి. అప్పుడామె "మోసం చేసి హృదయాన్ని కాల్చడమే కాకుండా వేడి నిట్టూర్పులతో నా వీపును సైతం కాలుస్తున్నావా!" అంది.



వివరణ:

భార్యాభర్తల మధ్య నమ్మకం ప్రధానం. మాట మీద నిలబడడం ప్రధానం. ఈ రెండు విషయాల్లో ఎక్కడ తేడా వచ్చినా పడకగదిలో ఎడమొగమూ, పెడమొగమే. అలా మాటమీద నిలబడనివాళ్ళతో ఎప్పుడూ జగడమే. అలాంటి జంట ఉదంతమే ఈ గాథ.

ప్రాకృతమూలం:

ఉహ్ణఇంణీససంతో కింతి మహపరమ్ముహీ ఏం సఅణద్ధే ।
మి అ అం పలీవిఅవి అణుస ఏణ పుఠ్ఠింపలివేసి॥ (అనంగుడు) (1–33)

సంస్కృతచ్ఛాయ:

ఉష్ణానినిః శ్వసన్ కిమితిమమ పరాన్ముఖ్యాంశయనార్ధే ।
హృదయం ప్రదీప్యాప్యానశయేన పృష్ఠప్రదీపయసి ॥ (అనంగుడు)

చిత్తం మార్చే చిత్రం

అదో ఉమ్మడికుటుంబం. అత్తమామలు, భర్త ఇంటలేరు. పెళ్ళికాని మరిది ఒక్కడే తోడుగా ఉన్నాడు. అతని చూపులు అదోరకంగా ఉండి ఆమెను ఇబ్బందిపెడుతున్నాయి. ఏమన్నా ప్రమాదం జరుగుతుందేమో!నని మనసు కీడు శంకిస్తోంది. అప్పుడా ఇల్లాలు ఏం చేసిందో చూడండి.

ఆ.వె॥ **మరది కళ్ళలోని మదనతాపము జూచి**
వచ్చుసేగితోచి వదిన అనియె
'రామునను గమించు లక్ష్మణుచిత్రంబు
చూడుమయ్య! ఎంత సుందరంబొ!'

– ఆమె ఆ మాట ఈ మాట మాట్లాడుతూ 'గోడమీద ఉన్న సీతారామ లక్ష్మణుల చిత్రం చూడు ఎంత అందంగా ఉందో! లక్ష్మణుడు చూడు రాముణ్ణి ఎలా అనుసరిస్తున్నాడో! సీతమ్మను తల్లిలా ఎలా పూజిస్తున్నాడో!'' అని అంది. నేను నీకు తల్లిలాంటిదాన్ని అని సున్నితంగా మరిదికి బుద్ధి చెప్పిన గాథ ఇది.



ప్రాకృతమూలం:

డి అరస్స అసుద్ధమనస్స కులవహూణి అఅ కుడ్డ లిహి ఆ ఇం।
ది అహం కహేఇ రామాణులగ్గ సోమిత్తి చరి ఆ ఇం॥ (హాలుడు) (1–35)

సంస్కృతచ్ఛాయ:

దేవరస్యాశుద్ధమనసః కులవధూర్నిజకుడ్యలిఖితాని।
దివసం కథయతి రామానులగ్న సౌమిత్రి చరితాని॥

కష్టేఫలి

ఆ.వె॥ **కష్టపడినయంత, కలుగు విజయలక్ష్మి**
కాలగతిని, మృతియు కలుగవచ్చు
పాటుపడక, ఎట్టి పనిపాటలేకున్న
మరణమెట్లు తప్పు? మాన్యతెట్లు?

– పనీపాట లేకుండా సోమరిపోతుగా మారినవాడికి నీతి చెబుతున్న గాథ ఇది. కష్టపడితే విజయం వరిస్తుంది. మరణమనేది ఎలాగూ కాలంతోపాటు వస్తుంది. అసలు కష్టపడకుండా ఊరకే కూచున్నా మరణం రాకుండా ఉండదు. పైగా సమాజంలో గౌరవం కూడా ఉండదు. అందువల్ల కష్టపడి పనిచేసి గౌరవంగా బ్రతకమని సలహా ఇస్తున్నాడు గాథాకారుడు.



వివరణ:

'కష్టేఫలి', 'శ్రమయేవ జయతే' ఇత్యాదులు మన భారతీయ ఆలోచనాధారలో అనాదిగా ఉన్నవే. మరణానికి భయపడి ఊరకే కూర్చుంటే అది రాకుండా ఉండదు. అలాగని దాని కోసమే ఎదురు చూస్తూ మనిషి బ్రతకకూడదు. మనిషి బ్రతికినన్నాళ్ళూ చైతన్యవంతంగా, తన్నుతాను అన్నివిధాలా ఉన్నతంగా మలచుకునే విధంగా బ్రతకాలని ఈ గాథ అంతరార్థం.

ప్రాకృతమూలం:

ఆరంభం తస్స ధు అం లచ్ఛీ మరణం విహోఇ పురిసస్స
తం మరణ మణారంభే విహోఇ లచ్ఛీ ఉణణ హోఇ॥ (1-42)

సంస్కృచ్ఛాయ:

ఆరభమాణస్య ధ్రువం లక్ష్మీ ర్మరణం వాభవతి పురుషస్య
తన్మరణ మనారంభేపి భవతి లక్ష్మీః పునర్నభవతి ॥

ఓ రాత్రీ, తెల్లవారనీకు

తే.గీ॥ నన్ను విరహాంధకారమున బడవేయు
ధవుని పయనమ్ము, రేపని, చెవినిబడియె
రేలతాంగి! నీ వత్యంత వృద్ధిచెంది
భానుడుదయింపలేనట్లు పరచుకొమ్మ!

– భర్త తెల్లవారితే దూరదేశానికి వెళ్తున్నాడని ఆమెకు తెలిసింది. ఆమె రాత్రి కన్యను ఈ విధంగా అమాయకంగా వేడుకొంటోంది. "ఓ నిశీధి కన్యకా! రేపు తెల్లవారలేనంతగా నీవు వృద్ధి చెందు!"



వివరణ:

భర్తను విడిచి ఉండలేని ఒక దీనురాలి గాథ ఇది. అందుకే ఆమె రాత్రిని 'నీవు చాలా పెరిగిపోయి తెల్లవారకుండా చేయి' అని అమాయకంగా అడుగుతోంది. తెల్లవారితే భర్త మరణిస్తాడని తెలిసి సూర్యుడు ఉదయించకుండా ఆపేసిన సుమతి వంటి మహాపతివ్రతలు పురాణాలలో మనకు దర్శనమిస్తారు. ఈమె కూడా సుమతి కథ విందో! ఏమో! రాత్రినిలా ప్రార్థిస్తోంది.

ప్రాకృతమూలం:

కల్లం కిర ఖరహి అ ఓ పవసి ఇ హి పి ఓత్తి సుణ్ణ ఇ జణమ్మి ।
తవ వడ్డ భఅవ ఇణిసే జహసే కల్లం విఅణహెూణ ॥ (నిప్పటుడు) (1-46)

సంస్కృతచ్ఛాయ:

కల్యం కిల ఖరహృదయః ప్రవత్స్యతి ఇతిశ్రూయతే జనే।
తథా వర్థస్వ భగవతినిశే। యథాతస్యకల్యమేవ నభవతి॥

రహస్యం

తే.గీ॥ **పతి విదేశంబునకు నేగు భయదవేళ**
ప్రాణరక్షా రహస్యమ్ము పడతితెలియ
నిబిడ విరహాగ్నులను గెల్చి నిల్చినట్టి
తరుణుల కొరకు నిల్లిల్లు తిరుగుచుండె॥

– తన పతి త్వరలో దూరదేశాలకు వెళుతున్నాడని తెలిసింది. వీడ్కోలు సమయంలో ప్రాణాలు నిల్పుకునే రహస్యాన్ని తెలుసుకోవడానికి గతంలో విరహాన్ని ఓర్చుకొని బ్రతికిన వనితల కోసం ఇల్లిల్లూ గాలిస్తూ తిరుగుతోంది ఒక పతి ప్రేమానురక్తయైన సతి.



వివరణ:

అనుభవమున్న వాళ్ళనడిగితే అన్నీ తెలుస్తాయనుకునే అమాయక ప్రాణి ఈ గాథలోని స్త్రీ. పతి విదేశానికి వెళ్ళటాన్ని చూచి తట్టుకోగలనా! లేదా! అని అపనమ్మకం ఆమెకు. అందుకే ఆమె ఈ అనుభవం గల వాళ్ళకోసం విస్తృతంగా వెతుకుతోంది. పతిమీదగా ప్రేమాభిమానాలు గలిగిన స్త్రీ చరిత ఈ గాథలో ఉదాహృతం.

ప్రాకృతమూలం:

హెూంత పహిఅస్స జాఆ ఆఉచ్ఛణజీ అధారణ రహస్సమ్।
పుచ్ఛంతీ భమఇ ఘరంఘరేణ పి అవిరహస హిరీఓ ॥ (సింహుడు) (1–47)

సంస్కృతచ్ఛాయ:

భవిష్యత్పథికస్య జాయా ఆపృచ్ఛన జీవధారణ రహస్యం।
పృచ్ఛంతీ భ్రమతి గృహం గృహేణ ప్రియవిరహసహనశీలాః॥

అదిగో వస్తున్నాడు.

తే.గీ॥ **అలఘు ఘనధనుష్టంకార మాలకించి**
విభునిదేయని, మదినెంచి, వీరపత్ని
ఘోర చోరాధమశ్రేణి బారి నుండి
కాచునని తోటి బందీల కనులు తుడిచె ॥

– ఒక దొంగల గుంపు కొంతమంది స్త్రీలను అటవీ మధ్యంలో బంధించింది. దూరంగా పిడుగుపాటు వంటి ఒక గొప్ప ధనుష్టంకారం వారిలో ఒక వీరపత్ని చెవినిపడింది. వచ్చేది తన భర్తే అని భావించి, అతడు ఈ దొంగల బారి నుండి తామందరినీ రక్షిస్తాడని చెబుతూ ప్రక్కన ఉన్న చెలుల కన్నుల నీరు తుడిచి వారిని ఊరడించింది.

వివరణ:

రెండువేల ఏళ్ళనాటి సామాజిక చిత్రం ఈ గాథలో చిత్రించబడింది. దొంగలు గుంపులు గుంపులుగా ఊళ్ళ మీద పడి దోచుకుని, దొరికిన ఆడవాళ్ళను ఎత్తుకెళ్ళి అడవుల్లో దాచడం నాటి దుస్థితి. అట్టి పరిస్థితులలో చిక్కుకున్న స్త్రీలలో ఒక యోధుడి భార్య కూడా ఉంది. ఆమెకు వింటి మ్రోతలాగా పెద్దశబ్దం ఒకటి వినవచ్చింది. ఆ వింటి మ్రోత విని ఊరడిల్లి, తోటి స్త్రీలతో 'అదిగో, నా భర్త వచ్చేస్తున్నాడు. మిమ్మందర్నీ విడిపిస్తాడు' అని ధైర్యంగా చెబుతోంది. దీనికి దొంగల గుంపు నాయకుని సమాధానం బహుచమత్కార భరితం. అనూహ్యం. దాని తరువాతి గాథలో చూద్దాం.

ప్రాకృతమూలం:

వజ్జ పడనా ఇరిక్కం పఇణో సో ఊ ణ సింజినీ ఘోసమ్ ।
పుసి ఆ ఇం కరిమరి ఏం సరిసవందీణం పిణ అణాఇం ॥ (కర్ణుడు) (1–54)

సంస్కృతచ్ఛాయ:

వజ్రపతనారిక్తం పత్యుః శ్రుత్వాశిం జినీఘోషమ్।
ప్రోంఛితాని బంద్యా సదృశబందీనామసి నయనాని॥

అది అది కాదు

తే.గీ॥ **అమ్మహారవమో! బంది! అతని వింటి**
మ్రోతయేకాదు, పులకించి పోకు మీవు
గగన సీమా వినిర్గతమగు, అకాల
భయద మేఘ గర్జనకది ప్రతిరవమ్ము॥

– అది తనపతి ధనుష్టంకారమేనని ఆనందపడుతూన్న బందీ యైన వనితతో దొంగల నాయకుడు "అది నీ మగని వింటిమ్రోత అనుకొని పొంగిపోతూ పులకించి పోతున్నావేమో! అదికానే కాదు. అది కాలంగాని కాలంలో జరిగే మేఘగర్జనకు ప్రతిధ్వని మాత్రమే! మిమ్మల్ని మా బారి నుండి ఎవ్వరూ రక్షించలేరు''. అని మరింత భయపెట్టాడు.



వివరణ:

ముందటి గాథకు కొనసాగింపు ఇది. "ఆయనొస్తాడు, పొడిచేస్తాడు' అని అందరికీ చెపుతున్నావు. అది అసలు వింటిమ్రోతే కాదు. వర్షాకాలం కాకుండా ఇతర సమయాల్లో వచ్చే ఉరుములు మెరుపులు భయంకరంగా ఉంటాయి కదా! అలాంటి ఉరుము యొక్క ప్రతిధ్వని మాత్రమే ఆ భయంకరమైన శబ్దం. మీ ఆయనే కాదు కదా! ఎవరి ఆయనలూ గుర్తుపట్టలేని ప్రదేశంలో మిమ్మల్ని దాచామని" దొంగల నాయకుడు వికటాట్టహాసం చేశాడు.

ప్రాకృతమూలం:

కరిమరి అఆలగజ్జిరజల ఆసణిపడినపడిరవో ఏసో।
పఇణో ధణురవకంఖరి రోమంచ కిం ముహావహసి ॥ (మకరందుడు) (1–57)

సంస్కృతచ్ఛాయ:

బంది! అకాలగర్జన శీల జలదాశని పతనప్రతిరవః ఏషః।
పత్యుః ధనూరవ కాంక్షణశీలే రోమాంచం కిం ముధా వహసి॥

పరిహాసమా! పరితాపమా!

తే.గీ॥ **మగడు పరకాంత చింతనామగ్నుడవగ**
బయటపడలేక కుసుమాంగి వగచుచుండి
శూన్యమున కలహింపగా జూచి, చెలులు
పరిహసించుటకు బదులు, బాధపడిరి॥

– పరకాంతా వ్యామోహంలో పడిన భర్తను తలచుకొని బాధపడుతూ గాలిలో పోట్లాడుతున్న సఖిని చూచి చెలులు పరిహసించడానికి బదులు బాధపడ్డారట. అంటే ఆమె దుఃఖం వారినీ కదిలించిందన్నమాట.



వివరణ:

మనచుట్టూ ఉండేవాళ్ళు మన కష్టాలను చూచి నవ్వేవాళ్ళు, మన కన్నీళ్ళను కాలక్షేపపు కథలుగా ప్రచారం చేసేవాళ్ళై ఉండకూడదనేదే ఈ గాథలోని నీతి. మనకు ఆనందం కలిగినప్పుడు, మనతో పాటు మనస్ఫూర్తిగా నవ్వేవాళ్ళు, మనల్ని విజయం వరించినప్పుడు దానిని మనసారా ఆస్వాదించేవాళ్ళు మనకు స్నేహితులై ఉండాలి. అలాంటివారి సాంగత్యాన్నే మనం కోరుకోవాలి. మనకు అండగా ఉన్నట్టు నటించి, మన గుట్టు మట్లు తెలుసుకొని, నలుగురికీ వినోదంగా ఆ విషయాలను వివరించేవాళ్ళు లోకంలో ఎప్పుడూ ఉంటారు. వారిని ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిది.

ప్రాకృతమూలం:

చిత్తాణి అదఇ అసమాగమమ్మి కఅమణ్ణు ఆఇం భరిఉణ।
సుణ్ణం కలహా అంతీ సహీహిరుణ్ణా ణ ఓ హసి అ॥ (మందాధిపుడు) (1–60)

సంస్కృతచ్ఛాయ:

చిత్తానీ తదయిత సమాగమే కృతమంన్యకాని స్మృత్వా।
శూన్యం కలహాయమానా సఖీభీరుదితా నోపహసితా॥

అంతరాత్మయే సాక్షి

తే.గీ॥ మగడు దేశాంతరస్థుడౌ మగువ యొకతె
పగలు నిద్రించుచుండుట, పరులుగాంచి
చిలువపలువలు గల్పించి చెవులు గొరుక
అత్త గమనించి యడుగగా అనియెనిట్లు
'అన్యులేమన్ననేమి? నా కాత్మసాక్షి' ॥

– రాత్రి పూట మగని ఆలోచనలతో సతమతమవుతూ పగలు నిద్రపోయే పడతిని గూర్చి లోకులు పలు రకాలుగా అనుకోవడం అత్త విన్నది. "అమ్మాయీ! అందరూ అలా అనుకుంటున్నారేమిటి?" అని ఆమెను అడిగింది. అందుకామె "ఎవ్వరేమనుకొన్నా, నేను స్వచ్ఛంగానే ఉన్నాను. అందుకు నా అంతరాత్మయే నాకు సాక్షి" అన్నది.

వివరణ:



ఎవరికైనా అంతరాత్మే అసలైన సాక్షి. అంతరంగంలో స్వచ్ఛంగా, నిజాయితీగా ఉన్నంతవరకూ ఎవరికీ భయపడనవసరం లేదు. అలాగని లోకానికి అనుమానం కలిగే విధంగా కూడా ప్రవర్తించకూడదు. ఇది నేటి సమాజంలో ఆడా, మగా స్నేహాల్లో విస్తృతంగా చర్చకు వస్తున్న అంశం. అందువల్ల ముఖ్యంగా నేటి యువతీయువకులు అత్యంత జాగరూకతతో మసలుకోవలసిన సందర్భం ఇది.

ప్రాకృతమూలం:

హేమంతి ఆసు అఇ దీహరాసు రాఈసు తంసి అవిణద్దా ।
చిర అరప ఉత్థవ ఇఏణ సుందరం జదిఆ సువసి ॥ (కంతేశ్వరుడు) (1–66)

సంస్కృతచ్ఛాయ:

హైమంతికాస్వతిదీర్ఘాసు రాత్రిషు త్వమస్యవినిద్రా।
చిరతర పోషిత ప్రతికే నసుందరం యద్దివా స్వపిషి ॥

కారుమబ్బులు కావా?

తే.గీ॥ **ధవుని రాకకై తపియించు తరళనయన ।**
కనగ వింధ్యాచలము మీది కారుమబ్బు
వార్షుకముగాదు, మదిలోన భయము వలదు.
దుస్సహదవానలోద్భూత ధూమమదియె॥

– దూరదేశానవున్న మగడు వర్షాకాలం వచ్చేటప్పటికి వస్తానన్నాడు. వింధ్యపర్వతం మీద అలముకొని ఉన్న కారుమబ్బును చూసి పతి ఇంకా రాలేదేమని భయపడుతూన్న చెలిని ఊరడిస్తూ ప్రియసఖి "వింధ్యపర్వతం మీది కారుమబ్బులు వర్షమేఘాలు కావు, గ్రీష్మంలో జనించే కార్చిచ్చువల్ల కలిగిన నల్లని పొగలు" అని చెప్పింది.



వివరణ:

అయినవాళ్ళు చెప్పిన సమయానికి రాకపోతే కలిగే ఆవేదనే ఈ గాథలో వర్ణించబడింది. టైముకు బడి నుండి పిల్లలు ఇంటికిరాకపోతేనే మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తుంది. దూరదేశానికి వెళ్ళిన మగని రాకకై వేచి ఉన్న చెలికి ఎంత ఆందోళన, ఎంత ఆవేదన ఉంటుందో! ఆ సమయంలో నచ్చచెప్పి ధైర్యవచనాలు పలికేవాళ్ళు చెంత ఉంటే చింతేలేదు.

ప్రాకృతమూలం:

గిహ్మే దవగ్గిమసి మలిఆ ఇం దీసంతి విజ్ఝసింహరా ఇం।
ఆనసు పఉత్థవ ఇఏణ హెూంతిణవపా ఉసచ్చా ఇం॥ (బద్ధవాహుడు) (1–70)

సంస్కృతచ్ఛాయ:

గ్రీష్మేదవాగ్ని మషీమలినితాని దృశ్యంతే వింధ్య శిఖరాణి।
ఆశ్వసిహిప్రోషితపతికే నభవంతినవ ప్రావృధభ్రాణి॥

చూపు

ఆ.వె॥ **హృదయగతుని చూపు, ఇంపు గూర్చు చెలికి**
చలువరేని గన్న కలువయట్లు
ఆకలిగల చూపు అత్తిపత్తిని జేయు
హరిని జూచి వణకు హరిణమట్లు॥

– ఇష్టమైన మనసుదోచిన చెలికాని చూపు అతివకు చంద్రుణ్ణి చూచిన కలువలా ఆనందాన్ని కలిగిస్తుంది. అదే ఆకలి చూపులు, ఆబగా ఒంటిని తడుముతూంటే శరీరం కుంచించుకుపోతోంది. పైగా సింహాన్ని చూచిన లేడిపిల్లకు వలె భయం కలుగుతుంది. ఈ పద్యంలో 'హరి' అనే పదం సింహం అనే అర్థంలో ప్రయోగించబడింది.



వివరణ:

లోకంలో చూపులు రకరకాలు. ఆకలిచూపులు, మమకారపు చూపులు, అహంకారపు చూపులు, నిలువునా తినేసేచూపులు. ఒకటా, రెండా ఎన్నో. ప్రధానంగా ఈ రకరకాల చూపుల్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి బహిరంగ ప్రదేశాలలో చూడవచ్చు. పాపం ఆడవాళ్ళు కొన్నికొన్ని చూపులకు ఎంత ఇబ్బంది పడుతుంటారో! ఇదే విషయాన్ని ఆనాడే ఈ గాథలో ప్రస్తావించడం జరిగింది. వంకర చూపులను ఆపేసి, సక్రమంగా ఆడవాళ్ళవంక చూడమంటోందీ గాథ.

ప్రాకృతమూలం:

జంజంసో ణిజ్ఝా అఇ అంగో ఆసం మహం అణిమిసచ్ఛో
పచ్ఛాఏమి అతం తం ఇచ్ఛామి అతేణ దీసంతం ॥ (వసంతకుడు) (1–73)

సంస్కృతచ్ఛాయ:

యద్యత్సనిర్ధ్యాయత్యం గావకాశం మమానిమిషాక్షః
ప్రచ్ఛాదయామి చతం తమిచ్ఛా మిచతేన దృశ్యమానమ్॥

గగనాంగి కంఠహారం

తే.గీ॥ **గగనతలము నుండి భువికి దిగు శుకముల**
పంక్తి జూడంగ, కెంపులు పచ్చలుగల
కనకహారమ్ము, గగనాంగి కంఠసీమ
నుండి, జారెడు రీతిగా నొప్పుచుండె॥

– 'ఆకుపచ్చని శరీరాలు, ఎర్రని ముక్కులు గల చిలుకల వరుస భూమిమీదకు వాలుతూంటే, గగన సుందరి కంఠసీమ నుండి కెంపులు, పచ్చలు పొదిగిన హారం భూమి మీదకు జారుతాన్నట్లుగా ఉంది' అని ప్రేయసితో ప్రియుడు వర్ణిస్తున్నాడు.



వివరణ:

ఇది ఒక రమణీయమైన ప్రకృతిదృశ్యం. ఆకాశంలో హాయిగా ఎగిరే తెల్లని కొంగలబారులు, గుంపులు గుంపులుగా ఎగిరే చిలుకలూ మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా చిలుకలు భూమ్మీద వాలేటప్పుడు చూడాలి ఆ అందమే వేరు. ఆ అందాన్ని చూచి మనసులో అనుభూతి చెంది చెప్పిన గాథ ఇది. కెంపులు ఎర్రగా ఉంటాయి. పచ్చలు ఆకుపచ్చగా ఉంటాయి. ఈ రెండు రంగులూ చిలుకలో ఉంటాయి. చిలుక శరీరం ఆకుపచ్చగా, ముక్కు ఎర్రగా ఉంటుంది. అందుకే చిలుకలు భూమి మీద వాలుతూంటే ఆకాశమనే స్త్రీ కంఠసీమ నుంచి జారిపడుతున్న పచ్చలు, కెంపులు పొదిగిన హారంలా ఉందంటున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం:

ఉ అ పోమ్మరా అమరగ అసంవలిఆణహ అలాఓఓఅరఇ।
ణహసిరి కంఠ బ్భట్ఠవ్వ కంఠిఆ కీరం రింఛోలీ॥ (వాసుదేవుడు) (1–75)

సంస్కృతచ్ఛాయ:

పశ్య పద్మరాగ మరకతసంవలితానభస్తలాదవతరతి ।
నభశ్రీ కంఠభ్రష్టేవ కంఠికా కీరపంక్తిః ॥

తుమ్మెదలా ?

తే.గీ॥ సుదతి నీలాలకంబుల సొగసు గాంచి
పరమ భావుకుడౌ పతి పలికెనిట్లు
'నీ ముఖము వికసిత నవనీరజమ్ము
వేగ మకరందమును గ్రోల మూగినట్టి
భ్రమరకములు నీదు కురులు, రాజవదన'!

– అసలే భావుకుడు. ఆపైన భార్యతలస్నానం చేసి కురులారబెట్టుకోవడం గమనించాడు. అప్పుడు "ఓ చంద్రవదనా! నీ ముఖం వికసించిన పద్మం, నీ కురులు పద్మంలోని మకరందాన్ని గ్రోలడానికి మూగిన తుమ్మెదల గుంపు" అని వర్ణించాడు.



వివరణ:

వారిదో అందమైన జంట. ఆమె జగదేక సౌందర్యరాశి. అతడు పరమభావుకుడు. వారు కవితాత్మకంగా, ఆనందంగా జీవనం సాగిస్తున్న వేళ – ఒకానొకరోజు ఎర్రని పద్మం లాంటి ఆమె ముఖం మీద ముసురుకున్న నల్లని ముంగురులను గమనించి, అవి నల్లని తుమ్మెదల గుంపులా ఉన్నాయని చమత్కరించాడు. పైగా స్త్రీల కురులను నల్లని తుమ్మెదలతో పోల్చడం కవి సమయం కదా! 'పతులు మెచ్చని చెలువు నిష్ఫలముగాదె' అని కావ్యోక్తి. ఆమె సౌందర్యం అలా సఫలమైందన్నమాట.

ప్రాకృతమూలం:

భరిమోసే గహ ఆహరధుఅసీసపహోలిరాలఆఉలిఅమ్
వఅణం పరిమల తరలిఅభమరాలిపఇణ్ణకమలం వ॥ (ముక్తాధరుడు) (1-78)

సంస్కృతచ్ఛాయ:

స్మరామస్తస్యాగృహీతాధర ధుతశీర్ష ప్రఘూర్ణనశీలాకాకులితమ్॥
వదనమ్ పరిమళ తరళిత భ్రమరాళిప్రకీర్ణకమలమివ॥

చెలీ! నొచ్చెనా!

తే.గీ॥ ప్రణయ కలహాన నొకచేత వానిగొట్ట
'నొచ్చెనా!' యని నాచేతి నూదుచుండ
డెందమానంద సందోహమంద, వాని
కౌగిలించితి, నవ్వుచు గళముపట్టి ॥

– ప్రణయ కలహంలో ప్రేయసి ప్రియుణ్ణి ఒక చేత్తో గట్టిగా కొట్టింది. అంత అతడు 'చెలీ! నీ చేయి నొచ్చిందా? అంటూ నోటితో ఊదసాగాడు. ఆమె మనసు కరిగింది. ప్రియుణ్ణి మనసారా మరొక చేత్తో మెడపట్టి కౌగిలించుకుంది.

(ఇది చదువుతూంటే నంది తిమ్మన 'పారిజాతావహరణం' కావ్యంలోని 'నను భవదీయదాసుని...' పద్యం గుర్తుకు రావడం లేదూ!)



వివరణ:

ప్రణయ కలహాన్ని సరిగా 'డీల్' చేయలేకపోతే అది ప్రళయానికి దారితీయవచ్చు. అలా కాకుండా చక్కగా అందంగా డీల్ చేసిన వాడిగాథే ఇది. మరి పదహారువేల మందితో నెగ్గుకొచ్చాడంటే కృష్ణపరమాత్మ ఎంత ఓర్పుతో, సహనంతో ఉన్నాడో కదా! ఆవిధంగా కూడా శ్రీకృష్ణుడు జగద్గురువే!

ప్రాకృతమూలం:

ఏక్కం పహరువ్విణ్ణం హత్థం ముహమారుఏణ వీఅంతో।
సోవి హసంతీ ఏమయే గహిఓ వీఏణ కంఠమ్మి ॥ (పృథివి) (1–86)

సంస్కృతచ్ఛాయ:

ఏకం ప్రహారోద్విగ్నం హస్తం ముఖమారుతేనవీజయన్।
సోపిహసంత్యా మయాగృహీతో ద్వితీయేన కంఠే॥

రాధాకృష్ణులు

ఆ.వె॥ **గోపబాల! నీవు గోధూళివేళలో**
రాధకంటిలోని, రజమునెల్ల
ఊదివైచినంత, ఊసరంబైపోయె
సర్వగోపికాళి గర్వచయము॥ (1-89)

– "కృష్ణుడికి 'మేము దగ్గరంటే', 'మేము దగ్గర' అని గోపికలంతా ఎవరికి వారు భావిస్తూ ఉంటారు. కానీ, కృష్ణా! రాధ కంటిలో పడిన గోధూళిని నీవెప్పుడైతే నోటితో ఊది తీసివేసినావో అప్పుడే ఇతర గోపికల గర్వమంతా తీసి వేయబడింది"



వివరణ:

వాక్కుకు అర్థం ఎంత దగ్గరో, చంద్రునికి వెన్నెల ఎంత దగ్గరో, పూవుకు సువాసన ఎంత దగ్గరో రాధకు కృష్ణుడు అంత దగ్గర. పాపం అమాయకులైన గోపికలు తాము దగ్గరంటే తాము దగ్గరని దెబ్బలాడుకోవడం వృథా! అని ఈ గాథ వల్ల తేలిపోయింది. పైగా గోధూళికి గోవిందునికి విడదీయరాని అనుబంధం. 'గోధూళి ధూసరిత కోమల గోపవేషం' అంటాడు లీలా శుకుడు కృష్ణకర్ణామృతంలో. ఆయన ఒంటినిండా పవిత్రమైన గోధూళి అలముకొని ఉంటుందని లీలాశుకుని భావన.

ప్రాకృతమూలం:

ముహమారు ఏణ తం కహ్ణ గోర అం రాహి ఆఏ అవణేంతో।
ఏతాణ వల్లవీణం అణ్ణాణ విగోరఅంహరసి॥ (పొట్టిసూడు) (1-89)

సంస్కృతచ్ఛాయ:

ముఖమారుతేన త్వం కృష్ణ గోరజోరాధికాయా అపనయన్।
ఏతాసాం వల్లవీనా మన్యాసామపి గౌవరం హరసి॥

అలిగినవేళనే చూడాలి

ఆ.వె॥ **దాస్యవృత్తిచేత తన యలుకనుదీర్చు**
మగని ప్రియుడని మది మగువ దలచు
అట్లు కానివారి, ఆయింటి యజమాని
గానె, పరిగణింత్రు, కాంతలెపుడు॥

– భార్య అలిగినవేళలో, సేవలు చేసి ప్రసన్నం చేసుకునే వారినే భార్యలు అమితంగా ప్రేమిస్తారు. ప్రియులుగా భావిస్తారు. తక్కినవారిని కేవలం ఇంటి యజమానులు గానే పరిగణిస్తారు.



వివరణ:

సమయానికి కావాల్సిన సరుకులు తెచ్చిపడేసే వాళ్ళను భార్యలు ఇంటి యజమానిగానే పరిగణిస్తారు కానీ, భర్తగా పరిగణించబోరని గాథాకారుని తీర్పు. అవును అది నిజమే! భార్య మనసెరిగి ప్రేమగా మసలుకొమ్మని కర్తవ్య బోధ చేస్తున్నాడు. అన్యోన్య దాంపత్యానికి అవసరమైన 'ఫార్ములా'ను నాడే రూపొందించి ఇచ్చిన గాథాకారునికి నమస్కరించకుండా ఉండలేం.

ప్రాకృతమూలం:

ణూమేంతి జేపహుత్తం కువి అందాసావ్వ జేపసాఅంతి।
తేవ్వి అమహిలాణం పిఆ సేనాసామివ్విఅ వరాఆ ॥ (మాధవుడు) (1–91)

సంస్కృతచ్ఛాయ:

గోపాయంతియేప్రభుత్వం కుపితాం దాసా ఇవమే ప్రసాదయంతి।
తవ ఏవ మహిలానాం ప్రియాః శేషాః స్వామినఏవవరాకాః॥

ఉత్తముడు

ఆ.వె॥ **ఉత్తమాత్ముడొకడు, ఊరిని వీడంగ**
బోసిపోవు, ఊరి వాసిపోవు
వెట్టిగాలివాన మట్టిని గూల్చంగ
మొక్కలెట్లు లోటు పూడ్చగలవు.

– ఊరిలోంచి ఒక ఉత్తముడు వెళ్ళిపోతే ఊరే బోసిపోయినట్లుంటుంది. ఒక పెద్ద మట్టి చెట్టుపడిపోతే ఎన్ని మొక్కలు మొలిచినా ఆ లోటును, వెలితిని పూరించలేవు కదా! ఒక పెద్ద మట్టి చెట్టును ఆధారంగా చేసుకొని పూర్వకాలంలో ఎన్నో సంసారాలుండడం కూడా మనకు తెలిసిందే కదా!



వివరణ:

గాంధీగారు పుట్టినందువల్ల పోరుబందరుకూ, నెహ్రూ గారు పుట్టినందువల్ల అలహాబాదుకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయి. అలాగే గొప్పవారు ఊరు వదలివెళ్ళినా అంతే! 'వారిప్పుడిక్కడ ఉండడంలేదు' – అంటారు. ఆ ఊరి పేరూ కొంతమసక బారుతుంది. అది ఎంతమంది సామాన్యుల వల్లా పూడ్చగలిగేది కాదు. అందువల్ల ఉత్తములు మేధావులైన వారిని, ఊరివారంతా గుర్తించి గౌరవించి నిలుపుకోవాలని ఈ గాథలోని నీతి.

ప్రాకృతమూలం:

సుఅణో జం దేస మలంకరేఇతంవిఅకరేఇపవసంతో
గామాసణ్ణుమ్మూలి అమహావడట్ఠాణసారి చ్ఛం॥ (హరకుంతుడు) (1–94)

సంస్కృతచ్ఛాయ:

సుజనోయం దేశమలంకరోతి తమేవ కరోతి ప్రవసన్।
గ్రామాసన్నోన్మూలిత మహావట స్థాన సదృశం॥

క్రొత్త కోడలి కినుక

తే.గీ॥ **మందమలయానిలమ్ములు మలయుచుండ**
కిసలయాస్వాద మత్తకోకిలలు కూయ
భ్రమరఝంకార రవములే, భగ్న ప్రణయ
విరహగీతమ్ములనిదోప, వెనుదిరుగడు
పనులె ముఖ్యమనితలచి పయనమౌను॥

– “అసలే మధుమాసం. చల్లని మలయానిలం ఒంటికి తగులుతూంది. లేత మామిడి చివుళ్ళు తిన్న కోయిలల కిలకిలారావాలు చెవిని పడుతూన్నాయి. తుమ్మెదల ఝంకారాలు విరహగీతాలుగా అనిపించేట్లు వినిపిస్తున్నాయి. అయినా నీ కొడుకేమిటి? అత్తా! అలా పనులే ముఖ్యమని వెళుతున్నాడు” అని గునుస్తోంది క్రొత్తకోడలు.



వివరణ:

కర్తవ్యపరాయణతా ముఖ్యమే, కానీ సమయం సందర్భం చూచుకోవాలి. ఇల్లాలిని చలికాలపు వేళలో విడిచివెళ్ళడం ఆమెకు విరహం కన్నా వైరాగ్యాన్ని ఎక్కువగా కలిగించిందంటున్నాడు గాథాకారుడు. ‘ఎవరు పతి, ఎవరు సతి’ అని ఆమె నిరాశగా నిట్టూర్చిందట. ఇల్లాలికి అంత నిరాశను కలిగించడం మంచిది కాదు.

ప్రాకృతమూలం:

దిట్ఠా చూఆ ఆగ్ఘాఇఅ సురా దక్షిణానిలో సహి ఓ
కజ్జాఇం వ్విఅ గరుఆఇ మామికోవల్లహౌకస్స॥ (కొంతకురుదు) (1-97)

సంస్కృతచ్ఛాయ:

దృష్టాశ్చూతా ఆఘ్రాతా సురాదక్షిణానిలస్సోఢః
కార్యాణ్యేవ గురుకాణి మాతులాని కోవల్లభః కస్య॥

దాహం తీరుతుందా?

ఆ.వె॥ **క్షణములోనె ప్రియుడు కనిపించి మరుగాయె**
తనివి తీరదాయె, తాపమాయె
కమ్మనైన జలము కలలోన ద్రావంగ
దాహమెట్లుతీరు దేహమునకు॥

– ఆమె ప్రియుణ్ణి ఉత్సవంలో క్షణకాలం మాత్రమే చూడగలిగింది. ఆమెకు తనివితీరలేదు. తృప్తికలుగలేదు. అందుకే చెంతనే ఉన్న మేనత్తతో "కలలో ద్రావిన నీటితో దప్పిక తీరుతుందా! అత్తా!" అని అంటోంది.



వివరణ:

కలలో త్రాగిన నీటితో దాహము, ఊహల్లో తిన్న అన్నంతో ఆకలి తీరబోవు. ప్రేయసీ ప్రియులెప్పుడూ కలల్లో విహరిస్తూ ఉంటారు. కల నిజం చేసుకునేందుకు నాయిక పడుతున్న తాపత్రయం గమనించదగింది.

ప్రాకృతమూలం:

అవి అహ్ణ పేక్షణి జ్జేకా తక్ఖణం మామి! తేన ది ట్ఠేణ।
సివిణ అపీ ఏణ వపాణీ ఏణ తహ్ణావ్విఅణఫిట్టా॥ (వజ్జుడు) (1–93)

సంస్కృతచ్ఛాయ:

అవితృష్ణ ప్రేక్షణీయేన తక్షణం మాతులాని తేన దృష్టేన ।
స్వప్న పీ తేనేవ పానియేన తృష్ణైవ నభ్రష్టా॥

చిల్లులుపడ్డ హృదయం

ఆ.వె॥ **పంచశరు శరముల ప్రహరణమువలన**
చిత్తమందు చెలికి, చిల్లులవగ
చెలులు సేయు నట్టి, పలు ఉపదేశముల్
నిలువకుండె మదిని నీరమట్లు॥

– చెలులు చేసే నీతిబోధలేవీ ఆమె చెవికెక్కడం లేదు. అందుకు చెలులు 'మన్మధుని బాణాల వల్ల ఆమె మనస్సుకు చిల్లులు పడ్డాయి. మనం చెప్పే బోధలన్నీ జల్లెడమీద పడ్డ నీటిలాగా జారిపోతున్నాయి" అంటూ చమత్కరించారు.



వివరణ :

మన్మధుని బాణాలూ ఊహే. ఆమె హృదయానికి చిల్లులు పడడమూ ఊహే. పరధ్యానంగా ఉన్నవారికి ఏం చెప్పినా చెవికెక్కదనేది లోక విదితమైన విషయం. దాన్నే గాథాకారుడు ఇలా ధ్వని గర్భితంగా చెప్పాడు.

ప్రాకృతమూలం :

ధరిఓ ధరిఓ వి అలఇ ఉఅఏసో పిహసహీహిదిజ్జంతో।
మఅరద్ధ అబాణపహార జజ్జరే తీఏ హి అ అమ్మి॥ (మానుడు) (2-1)

సంస్కృతచ్ఛాయ :

ధృతో ధృతో విగలత్యుపదేశః ప్రియసఖీ భిర్దీయమానంః।
మకరధ్వజబాణ ప్రహారజర్జరే తస్యాహృదయే॥

పదునెక్కిన ఎఱ్ఱదనం

ఆ.వె॥ **పల్లవాధరములు తెల్లనైపోయెను**
రేయి గడచుసరికి ప్రియుని వలన
ఆ అరుణిమ లెల్ల, అతివ సపత్నుల
క్రోధభరిత నయనగుహల జేరె॥

– బహుపత్నీవ్రతుడైన నాయకుడు ప్రేయసితో రాత్రంతా గడిపాడు. ఆమె పెదవులు ఎఱ్ఱదనం కోల్పోయి తెల్లగా అయినాయి. ఆమె పెదవుల ఎఱ్ఱదనం, సపత్నుల రోషప్రపూరితిములై, గుంటలు పడ్డ కన్నులలో ప్రతిఫలించిందట. అంటే ఆమెపై వారు అంతగా ఈర్ష్యపడ్డారన్నమాట.



వివరణ:

గాథా సప్తశతిలోని ఈ 'ధ్వని' తరువాతికాలంలో అనేక తెలుగు కావ్యాలలో ప్రతిధ్వనించింది. శ్రీనాథుని శృంగార నైషధ కావ్యంలో నలుని పరాక్రమాన్ని వర్ణిస్తూ 'అతివర్షములాశ్రయించె తత్పరనాథయూథవనితాజనతా నయనోత్పలంబులన్' అన్నాడు. అంటే నలుని రాజ్యంలో అతివృష్టిలేదట, అది వెళ్ళి శత్రురాజుల భార్యల కళ్ళల్లో నెలకొందట. ఎంతలోతైన ఊహోచూడండి. అంటే నలుడు ఎంతో మంది శత్రురాజులను నిర్జించాడని 'ధ్వని'.

ప్రాకృతమూలం:

జోతీ ఏం అహరరా ఓ రత్తిం అవ్వాసి ఓపిఅఅమేణ ।
సోవ్విఅ దీసఇగోసే సవత్తిణ అణేసు సంకంతో ॥ (దామోదరుడు) (2–6)

సంస్కృతచ్ఛాయ:

యస్తస్యా అధరరాగో రాత్రావుద్వాసితః ప్రియతమేన।
స ఏవ దృశ్యతే ప్రాతః సపత్నీ నయనేషు సంక్రాంతః ॥

మన ఊరి చెరువు

తే.గీ॥ **పద్మరాగము లననొప్పు పద్మచయము**
హాయిగా విహరించు రాయంచతతుల
చెలగుచున్నట్టి మనయూరి చెరువుజూడ
ఆకసమును దించి, పరచినట్టులుండె॥

– ఒక యువతి తన మేనత్తతో ఇలా అంటోంది. 'పద్మరాగాల వంటి పద్మాలు, తెల్లని రాయంచలను మన ఊరి చెరువులో చూస్తుంటే, తెల్లని మేఘాలు గల ఎఱ్ఱబారిన ఆకాశాన్ని దించి వెల్లకిలా చెరువులో నిలిపినట్లుంది కదా! అత్తా!' అని కవితాత్మకంగా వర్ణించింది. తెల్లని మేఘాలు రాయంచలలాగ పద్మాలు ఎఱ్ఱబారిన ఆకాశంలాగా ఉన్నాయని గాథాకారుని భావం.



వివరణ:

ఇరవై నాలుగు గంటల ఛానల్స్, సోషల్ మీడియా లేని రోజుల్లో ప్రకృతే వారికి వినోదం. విజ్ఞానం. హాయిగా ప్రకృతిని పరిశీలించి, పరవశించారు నాటి జనం. ప్రకృతి దేవుడిచ్చిన వరం. దాన్ని కాపాడుకోవడం అత్యవసరం. మంచినీటి చెరువుల్ని కాలుష్య కాసారాలుగా మార్చకుంటే నేడూ మనం చెరువుల్లో అందమైన పద్మాలను చూడవచ్చు. హాయిగా తిరిగే చేపలనూ వీక్షించవచ్చు.

ప్రాకృతమూలం:

కమలా అరాణ మలిఅ హంసా ఉడ్డావి ఆణ అపిఉచ్ఛా।
కేణాపి గామతడా ఏ అబ్భం ఉత్తాణ అం వ్యూఢమ్॥ (మృగాంకుడు) (2–10)

సంస్కృతచ్ఛాయ:

కమలాకరా నమృదితా హంసా ఉడ్డాయితానచపితృష్వసః।
కేనాపి గ్రామతడాగే అభ్రముత్తానితం క్షిప్తమ్॥

చిన్నికన్నయ్య

ఆ.వె॥ **"మాతృమమతతప్ప మరియేమి ఎరుగని**
చిన్ని కృష్ణుడెంత చిన్నవాడొ!"
అని యశోదపలుక, ఆగోపకాంతల
ముఖముమీద నవ్వుముసురుకొనియె॥

– గోపకాంతలు యశోదమ్మ చుట్టూ చేరారు. 'మా చిన్ని కన్నయ్యకు నేను తప్ప వేరే లోకం లేదని' యశోదమ్మ మురిసిపోతూ చెపుతూంటే గోపాలకృష్ణుని చిలిపి పనులు తమ తలపునకు రాగా గోపికలు ముసి ముసిగా నవ్వుకున్నారట.



వివరణ:

'ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే' అన్నది పి.వి.గారి నేటి నానుడి నాడు ఎందరు ఎన్నివిధాలుగా చిన్ని కృష్ణుని మీద చాడీలు చెప్పినా యశోదమ్మ నమ్మలేదన్నది నిర్వివాదాంశం. వీరు చెప్పే చాడీలను చిద్విలాసంగా యశోదమ్మ ఒడిలోనే కూర్చొని కన్నయ్య వీక్షించాడని భాగవతం చెపుతుంది. పైగా నన్ను కొట్టించడానికే వీరిలా చెపుతున్నారని యశోదమ్మకు నమ్మకంగా చెప్పిన వెన్నదొంగ మన నల్లనయ్య. ఆ గోపాలబాలుని లీలను స్మరించి ఆనందిద్దాం. ఆస్వాదిద్దాం.

ప్రాకృతమూలం:

అ జ్జవి బాలో దామోదరో త్తి ఇఅ జంపిఏ జసోఆఏ।
కహ్ణముహపేసి అచ్ఛం ణిహుఅం హసిఅం వ అహూహిం॥ (2-12)

సంస్కృతచ్ఛాయ:

అద్యాపి బాలో దామోదర ఇతిఇతి జల్పితేయశోదయా।
కృష్ణముఖప్రేషితాక్షం నిభృతం హసితం వ్రజవధూభిః ॥

గోపాంగన

తే.గీ॥ **నర్తనముసేయు గోపాంగనాప్రతిభను**
మెచ్చునెపమున, వేరొక మీననయన
గోపికా కపోలస్థిత గోపబాలు
ముగ్ధమోహన బింబమున్ ముద్దులాడె ॥

– ఒక గోపిక అందంగా నృత్యం చేస్తోంది. ఆమె బుగ్గలపై కృష్ణుని ప్రతిబింబం ప్రతిఫలిస్తోంది. అది గమనించిన వేరొక గోపిక ఆమెను మెచ్చుకునే నెపంతో ఆమె బుగ్గపైనున్న కృష్ణుని రూపాన్ని ముద్దులాడింది.



వివరణ:

'కర్షతి చిత్తమితి కృష్ణః' అని అమరం. కృష్ణవర్ణం మనసును ఆకర్షిస్తుందని భావం. కృష్ణుడు కూడా ఆబాల గోపాలాన్ని ఆకర్షిస్తాడు. అదే ఈ గాథలో వర్ణితం. కృష్ణుడు గోపిక యొక్క చెక్కిళ్ళ పైబింబంగా ఉన్నా కూడా మరో గోపికను అమితంగా ఆకర్షించాడట ఎంత మనోహరమైన ఊహ.

ప్రాకృతమూలం:

ణచ్చణసలాహణణిహేణ పాసపరిసంఠి ఆణిఉణగోవీ।
సరిసగోవి ఆణం చుంబఇకవోలపడిమాగఅం కణ్హమ్॥ (2-14)

సంస్కృతచ్ఛాయ:

నర్తనశ్లాఘన నిభేన పార్శ్వపరిసంస్థితా నిపుణగోపీ ।
సదృశం గోపీనాం చుంబతి కపోలప్రతిమాగతం కృష్ణమ్॥

కరిమబ్బులు

తే.గీ॥ **ప్రకట వింధ్యా చలము మీద, పరుగులిడెడు**
కారుమబ్బుల గములను, గాంచినంత
కడుపునిండ జలముద్రావి, గంతులిడుచు,
కదలిపోయెదు, గజముల కరణిదోచు॥

– వింధ్యపర్వతం మీద కదలిపోతున్న కారుమబ్బుల గుంపులను చూస్తుంటే, కడుపునిండా నీళ్ళను త్రాగి నెమ్మదిగా కదలిపోయే నల్లని ఏనుగుల్లా ఉన్నాయట.



వివరణ:

ఏనుగు రంగూ, కరి (నల్లని) మేఘం రంగూ ఒకటే. భూమి మీద ఏనుగు పెద్దది. ఆకాశంలో మేఘం పెద్దది. పైగా గాథాకారుడు ఆ మేఘాల్లో నీళ్ళున్నాయని సూచించేందుకు, అవి తృప్తిగా నీళ్ళు త్రాగి వెళుతున్న ఏనుగు గుంపుల్లా ఉన్నాయనడం అర్థవంతంగా ఉంది.

ప్రాకృతమూలం:

ఆలోఅంతి పుళిందా పవ్వ అసిహరట్ఠిఆ ధణుణిసణ్ణా।
హత్థిఉ లేహివ విఝుం పూరిజ్జంతం ణవ బ్భేహిం॥ (హాలియుదు) (2–16)

సంస్కృతచ్ఛాయ:

ఆలోకయంతి పులిందాః పర్వతశిఖరస్థితా ధనుర్నిషణ్ణాః ।
హస్తికులైరివ వింధ్యం పూర్యమాణం నవాభ్రైః ॥

భారంగా సాగుతూ...

తే.గీ॥ క్రొత్త పెండ్లాము మోజులో కూరుకొనియు
వేట మరచియు నిదురించు భిల్లుడొకడు
భుజముపై విల్లుఁగిరివోలె మోసికొనుచు
వెడలుచుండె భారంబుగా, వేటకొరకు॥



– క్రొత్త పెళ్ళాం మోజులో పడి వేటకు వెళ్ళడంలేదొక వేటగాడు. తల్లిదండ్రులు మందలించడంతో గత్యంతరం లేక తేలికైన విల్లును కూడా ఏదో ఒక పెద్ద కొండను మోస్తున్నట్టుగా మోసుకుంటూ భారంగా వెళుతున్నాడట ఆ వేటగాడు.

వివరణ:

ఇష్టమైనప్పుడు కొండంతపని కూడా దూదిపింజలా కనిపిస్తుంది. అదే ఇష్టంలేకుండా చేసేపని చిన్నదైనా చాలా భారంగా అనిపిస్తుంది. కొత్తపెళ్ళాం మోజులో ఉన్నవాడికి వృత్తిభారంగా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. వృత్తి లేకుండా భుక్తి లేదు. అందువల్ల వృత్తినీ, సంసారాన్నీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ప్రబోధిస్తూందీ గాథ. ఆఫీసును ఇంటికి తేకూడదు. ఇంటిని ఆఫీసుకు మోసుకెళ్ళకూడదు. (మనస్సులో).

ప్రాకృతమూలం:

ణవవహూ పేమ్మ తణుఇఓ పణఅం పఢమఘరిణీ అరక్ఖంతో
ఆలిహ అదుప్పరిల్లంపి ణేఇ రణ్ణం ధణుంవాహొ॥ (కణ్ణవుత్తుదు) (2-22)

సంస్కృతచ్ఛాయ:

నవవధూ ప్రేమతనూకృతః ప్రణయం ప్రథమం గృహిణ్యారక్షన్
తనూకృత దురాకర్షమపి నయ త్యరణ్యం ధనుర్వ్యాధః॥

వియోగమా! అదెక్కడ!

తే.గీ॥ **కన్నులందు నతనిరూపు, కదలుచుండ**
వీనులాతని ఊసులే, వినుచునుండ
హృదయమాతని, హృదితోడ ఏకమౌట
ఇక వియోగమెక్కడ? అతనికినినాకు॥

– పతి చిరకాలం దూరదేశంలో ఉన్న ఒక యువతిని చూచి జాలిపడుతన్న చెలులతో "అతడు నా కళ్ళల్లో నిలిచి ఉన్నాడు. నా చెవుల్లో అతని మధుర భాషణలు వినపడుతూనే ఉన్నాయి. అతడు నాతో ఎప్పుడూ ఉన్నట్టే ఉంటోంది. అతని హృదయంతో నా హృదయం మమేకమైపోయింది. ఇక మా మధ్య వియోగానికి ఆస్కారమెక్కడ?'' అని ధైర్యంగా వారితో పలికింది.



వివరణ:

దూరంగా ఉన్నా మనసుకు దగ్గరగా ఉంటే చెంతనే ఉన్నట్టు. మనసులు దూరంగా ఉన్నప్పుడు ఒకే కప్పు క్రింద ఉన్నా వేల మైళ్ళ దూరంలో ఉన్నట్టే లెక్క. అదే విషయాన్ని నాయిక 'నా పతి ఎక్కడో లేడు నా మనసులోనే ఉన్నాడు' అని ఆత్మస్థైర్యంతో చెపుతోంది. ఇంతటి ఆత్మస్థైర్యం గల ఆడవాళ్ళకు మగడు అమెరికాలో ఉన్నా అమీర్‌పేటలో ఉన్నట్టే లెక్క!

ప్రాకృతమూలం:

రూ అం అచ్ఛీసు ఠిఅంఫరిసో అంగేసు జంపిఅంకణ్ణే।
హిఅఅం హిఅఏ ణిహి అంవిఓ ఇఅం కిత్థ దేవ్వేణ॥ (బ్రహ్మగతి) (2–32)

సంస్కృతచ్ఛాయ:

రూపమక్ష్ణోః స్థితం స్మర్శోంగేషు జల్పితం కర్ణే
హృదయం హృదయే నిహితం వియోజితం కి మత్ర దైవేన॥

దుష్టబుద్ధి

ఆ.వె॥ ఇంట నూనెద్రావి, ఇచ్చువెల్గులె గాక
పొగలనింపు దీపపుంతెరగున
పంచభక్ష్యతతుల, పరవశుడౌగాక।
చెడ్డఅతిథి విడడు, చెడుతలంపు॥

– తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టటమంటారే! అలాంటి విషయాన్నే ఈ గాథలో చెపుతున్నాడు. ఆతిథ్యం ఇచ్చిన వాడి ఇల్లాలినే అతిథి అదోరకంగా చూచాడట. దీపం ఇంటిలోని నూనెతోనే వెలుగుతూ కూడా ఇంటినిండా పొగలు నింపినట్లు, దుష్టుడైన అతిథిని ఎంత బాగా చూచినా, అతడు తన దుష్టబుద్ధిని మాత్రం విడనాడలేదు – అనేదే ఈ గాథసారాంశం.



వివరణ:

'బొగ్గు పాలకడుగ పోవునా మలినంబు' అంటాడు వేమన. అందుకే మనం ఎవరినైనా ఆహ్వానించేటప్పుడు వారి గుణగణాలను తెలిసికొని ఆహ్వానించడం మంచిది. మరీ తెలియని వాళ్ళను, తాత్కాలికంగా రైళ్ళల్లో, బస్సుల్లో పరిచయమైన వాళ్ళను ఆహ్వానించకపోవడం ఉత్తమం. దుష్టుడైన ఒక అతిథిని ఆహ్వానించి భంగపడినవాడి గాథే ఇది.

ప్రాకృతమూలం:

వసఇ జహించేఅఖలో పోసిజ్జంతో సిణేహదాణేహిం।
తం చేఅఆలఅందీ అఓవ్వ అఇరేణ మఇ లేఇ॥ (కీర్తిరాజు) (2–35)

సంస్కృతచ్ఛాయ:

వసతి యత్రైవఖలః పోష్యమాణః స్నేహదానైః।
తమేవాలయం దీపక ఇవాచిరేణ మలినయతి॥

లోభత్వం

తే.గీ॥ **కనకగిరులు కలిగియున్నగాని, లోభి**
తృప్తిదీరగ తినలేడదెటులయన్న
మండుటెండను పాంధుడు, మాడువేళ
అతని కుపకరింపగబోదు, నతని ఛాయ.

– అనంతమైన సంపదలు మూలుగుతున్నప్పటికీ కూడా లోభి వాటిని అనుభవించలేడు. అదెట్లా అంటే మండుటెండలో బాటసారికి అతని నీడ అతనికి ఉపయోగపడదుకదా! ఉన్న సంపదలను హాయిగా అనుభవించమని ఉద్బోధిస్తున్న గాథ ఇది.

వివరణ:

'ఇచ్ఛతి శతీసహస్రం, సహస్రీ లక్షమీహతి
లక్షాధిపస్తథారాజ్యం, రాజ్యస్తస్స్వర్గమీహతే'। అని ఆర్యోక్తి. వంద ఉన్నవాడు వెయ్యి కావాలనుకుంటాడు. వెయ్యి కలవాడు లక్ష కావాలనుకుంటాడు. లక్ష కలిగినవాడు రాజ్యం కావాలనుకుంటాడు. రాజ్యం కలవాడు స్వర్గమే నాపరమైతే బాగుంటుందనుకుంటాడు. ఆశకు అంతెక్కడ. అందుకే దురాశకూడదు. 'తృప్తింజెందని మనుజుడు సప్తద్వీపములనైన చక్కంబడునే' అంటాడు పోతన భాగవతంలో. 'తృప్తిగా అనుభవించలేనివాడికి బంగారు కొండలున్నా ఏమిటి? ఉపయోగం' అంటున్నాడు గాథాకారుడు.



ప్రాకృతమూలం:

హొంతీ విణిప్ఫలచ్చి అధణరిద్ధీహొూఇ కివిణపురిసస్స ।
గిహ్మే అవసంతతస్సణి అఅ ఛాహివ్వ పహి అస్స॥ (కుందపుత్రుడు) (2–36)

సంస్కృతచ్ఛాయ:

భవంత్యపి నిష్ఫలైవ ధనబుద్ధిర్భవతి కృపణపురుషస్య
గ్రీష్మాతప సంతప్తస్యనిజకచ్ఛాయేవ పధికస్య॥

కృతజ్ఞత

తే.గీ॥ **వామనయనమా! ఇపుడు నీవదురుకతన**
నా ప్రియుడు వేగమే వచ్చి నయముగూర్ప
నీ మహోపకారంబును, నిన్ను ందలచి
కాంతు వానినెపుడు, కుడికన్ను మూసి॥

– నాయికకు ఎడమకన్ను అదురుతోంది. ఆడవాళ్ళకు ఎడమకన్ను అదరడం శుభసూచకమంటారు కదా! అందుకు "ఇప్పుడే కనుక నా ప్రియుడు వచ్చినట్లయితే నేను కుడికన్ను మూసి, ఎడమకన్నుతోనే వాణ్ణి ఎప్పుడూ చూస్తాను" అని శపథం చేసింది ఆమె.



వివరణ:

శుభశకునాల వంటి నమ్మకాలు నాటి సమాజంలో కూడా ఉండేవని ఈ గాథవల్ల తెలుస్తుంది. ఏ కన్ను అదరడం వల్ల నాకుమేలు జరిగిందో, అదే కంటితో – రెండో కంటినిమూసి మరీ చూస్తాననటం కృతజ్ఞతకు పరాకాష్ఠ.

ప్రాకృతమూలం:

ఫురిఏ వామచ్ఛి తుఏ జఇఏహి ఇసోపి ఓజ్జతాసుఇరమ్।
సంమీలిఅ దాహిణ అం తుఇ అవిఏహంపలోఇస్సమ్॥ (శక్తిహస్తి) (2–37)

సంస్కృతచ్ఛాయ:

స్ఫురితే వామాక్షి! త్వయి యద్యేష్యతి సప్రియోద్య తత్సుచిరమ్।
సంమీల్య దక్షిణం త్వయైవైతం ప్రేక్షిష్యే॥

హద్దు

తే.గీ॥ ఏడ్చి ఏడ్చి, కనుల నీరమింకిపోయె
దేహమంతయు శుష్కించె, తిండిలేక
శ్వాసయొక్కటే మిగిలె నీవలపు కొరకు
ఇంక ఏమి సేయగలదు? ఇంతకన్న॥

– ప్రణయ కలహంవల్ల ప్రియుడామెతో మాట్లాడడం మానివేశాడు. దిగులుతో ఆమెనిద్రాహారాలు మాని శుష్కించిపోతోంది. అది గమనించిన ఆమెసఖి అతనితో "కేవల శరీరమాత్రమైయున్న ఆమె నీ కోసం ఇంతకన్నా ఏం చేయగలదు, ఆమెను క్షమించి ఏలుకో!' అని ప్రాధేయపడింది.



వివరణ:

అలుక అయినా, సాధింపు అయినా ఒక పరిమితి వరకే. అవతలివారి ప్రాణం పోయేంతవరకు సాగదీయకూడదు. 'నాయిక కేవలం శ్వాసతో మాత్రమే మిగిలి ఉంది. ఇంక చాలు ఆపు!' అని హెచ్చరిస్తోంది సఖి. అవతలి వారే పోయింతర్వాత అలుకకు అర్థం లేదు. ఆమె తిరిగిరాదు.

ప్రాకృతమూలం:

తారుణ్ణం జారువ్వఇతాఛీణం జావ ఛిజ్జిఏఅంగమ్॥
తాణీససి అం వరాఇఅజావ అసాసా పహుప్పంతి॥ (వైరశక్తి) (2–41)

సంస్కృతచ్ఛాయ:

తావద్రుదితం యావద్రుద్యతే తావత్ క్షీణమ్ యావత్ క్షీయతే అంగమ్।
తావన్నిశ్శ్వసితం వరాక్యాయావత్ శ్వాసాఃప్రభవంతి॥

పరిహాసం

తే.గీ॥ **ముదిత! నీ యెద కుంకుమపువ్వు గలదు**
తుడుచుకొనుమంచు సఖియలౌ పడుతులనగ
చెలునిదౌనఖాంకము నామె చెరుపజూడ
పరిహసించిరి వారెల్ల పకపకమని॥

- నాయిక హృదయం మీద నఖక్షతాన్ని గమనించిన చెలులు ఆమెను ఆటపట్టించడానికై "నీ ఎదమీద కుంకుమ పువ్వు అంటింది తుడుచుకో!" అన్నారు. ఆమె కూడా పరధ్యానంగా తుడుచుకునే ప్రయత్నం చేసింది. చెరిపేస్తే చెరిగిపోయే గుర్తా! అది. అందుకే ఆమె సఖులంతా పకపకమని నవ్వారు.



ప్రాకృతమూలం:

సహిఆహిం భణ్ణమాణా థణఏలగ్గం కుసుంభపుప్ఫంత్తి।
ముద్ధబహుఆ హసిజ్జఇ పప్ఫోడంతీణహవ ఆఇం॥ (బాలాదిత్యుడు) (2-45)

సంస్కృతచ్ఛాయ:

సఖీభిర్భణ్యమానాస్తనేలగ్నం కుసుంభపుష్పమితి
ముగ్ధవధూర్హస్యతే ప్రస్ఫోటయంతీ నఖపదాని॥

వాలుకనుల రమణి

ఆ.వె॥ నిదుర మత్తులోన, నీలికన్నులతోడ
మోహవార్ధిముంచు, మురువుతోడ
వాలుకనులరమణి, వలపుచూపులధాటి
కా, యనంగుడైన ఆగగలడె॥



"నిద్దురమత్తులో అరమోడ్పుకన్నులతో, ఆమె చూచే వలపుచూపులను తట్టుకోవడం కామునికైనా సాధ్యమా!'' అంటున్నాడు గాథాకారుడు.

వివరణ:

అసలే అందమైన అమ్మాయి. ఆపై అరమోడ్పు నీలికన్నులు. అంతకన్నా మత్తుచూపు – వీటన్నిటినీ తట్టుకుని నిలబడడం మన్మధునికి కూడా దుస్సాధ్యమని గాథాకారుని భావన.

ప్రాకృతమూలం:

ణిద్దాలసపరిఘుమ్మిరతం సవలంతద్ధతార ఆలోఆ
కామస్స విదువ్విసహా దిట్ఠిణివా ఆ ససిముహీఏ॥ (హాలుడు) (2–48)

సంస్కృతచ్ఛాయ:

నిద్రాలసపరిఘూర్ణనశీల తిర్యగ్వలదర్ధతారకాలోకాః
కామస్యాపి దుర్విషహా దృష్టినిపాతాః శశిముఖ్యాః

కనులు కనులు కలిసెలే!

తే.గీ॥ **చండ చండముగానెండ మండువేళ**
దాహమని పాంథుడొక్కడు తరుణి నడుగ
నీరమాతని దోసిలినింప, వారి
కన్నులు కలిసె, జలధార సన్నబడియె
వ్రేళ్ళు వదులాయె, ప్రవహించె ప్రేమరసము॥

– ఒక నవయువకుడు నడిఎండలో నడుచుకుంటూ వెళుతున్నాడు. అతనికి దాహంవేసి ఒక ఇంటి అరుగుపై కూర్చున్న పెళ్ళికాని యువతిని మంచి నీళ్ళమ్మని అడిగాడు. ఆమె ఇంట్లోంచి చెంబుతో మంచి నీళ్ళు తెచ్చి, అతని దోసిట్లో పోయసాగింది. అతడు త్రాగసాగాడు. అకస్మాత్తుగా ఇద్దరి కళ్ళూ కలిసాయి. ఇంకాసేపు నీరు పోయాలని ఆమె నీటిధారను సన్నబరిచింది. అతడింకొంచెంసేపు త్రాగాలని దోసిలి వ్రేళ్ళ సందుల్ని వదులుచేసి క్రిందకు నీళ్ళను విడువసాగాడు. అలా ఒకర్నొకరు చూసుకుంటూ ఆ యువజంట మైమరచిపోయింది.



ప్రాకృతమూలం:

ఉద్ధచ్ఛోపి అఇ జలం జల జహ విరలంగులీ చిరంవహిఓ।
పావాలిఆ వితహతహ ధారం తుణుఇం పితణుఏఇ॥ (భాండకుడు) (2-61)

సంస్కృతచ్ఛాయ:

ఊర్ధ్వాక్షః పిబతి జలంయథాయథావిరళాంగుళిశ్చిరం పథికః
ప్రపాపాలికాపి తథాతథా ధారాం తనుకామపి తనూకరోతి॥

ఆమె ఊరూ నాకు గొప్పే!

తే.గీ॥ నా మనోహరి, మృదువదనారవింద
దర్శనంబతి ఘనము, ముదావహమ్ము
అంతియేకాదు, ఆమెదౌఅభిజనంపు
మేరయును నాకు, ముదమిచ్చు మేరలేక॥

– "నా ప్రియురాలి ముఖ చంద్రబింబాన్నే కాదు, ఆమె ఊరి పొలిమేరను చూచినా, నాకు అపరిమితమైన ఆనందం కలుగుతుందని'' నాయకుడు తన స్నేహితునితో చెపుతున్నాడు.



వివరణ:

ప్రేయసికి సంబంధించిన వాటన్నింటినీ ప్రేమించడం ప్రేమకు తారాస్థాయి. 'ఆమె ఊరి పొలిమేర కనపడ్డా – ఆమే కనిపించినంత సంతోషం' అనడం – నాయకుని వీరప్రేమను తెలుపుతుంది. ఈ వీరప్రేమ లొక్కక్కమారు వికటించే ప్రమాదం కూడా ఉంది. ప్రేమ అర్థవంతంగా, అవతలివారిని ఇబ్బంది పెట్టనంతవరకూ ఫరవాలేదు.

ప్రాకృతమూలం:

అచ్ఛఉ దావమణహరం పిఆఇ ముహదంసణం అఇమహగ్ఘమ్।
తగ్గామ ఛ్ఛేత్తసీమా విఝుత్తి దిట్ఠాసుహావేఇ॥ (మహిలుదు) (2–68)


సంస్కృతచ్ఛాయ:

అస్తుతావన్మ నోహరం ప్రియాయాముఖదర్శనమతి మహార్ఘమ్।
తద్గ్రామక్షేత్ర సీమాపి ఝుటితిదృష్టాసుఖయతి॥

తాను తడిసినా ఫరవాలేదు

ఆ.వె॥ **తరుణి తడియుగాని, ధవునిరాక తెలుపు**
గోడమీదనున్న గుర్తుపైన
చేతులడ్డుపెట్టి చెరిగిపోనీయదు
జోరువాన గాలిహోరులోన॥

– గొప్పగాలివాన కురుస్తోంది. పతి దూరదేశానికి వెళ్ళాడు. వెళ్తూ, వెళ్తూ తాను ఎప్పుడు వచ్చేదీ గోడపై గుర్తుగా వ్రాసివెళ్ళాడు. ఇంటికప్పుకు ఏర్పడిన కన్నంలోంచి వర్షం గోడవారగా జారుతోంది. పతిరాకను తెలిపే ఆ గుర్తెక్కడ చెరిగిపోతుందోనని ఆమె నిలువెల్లా తడుస్తున్నా చేతులడ్డుపెట్టి ఆగుర్తును మాత్రం రక్షించుకుందట. ఎంత గాఢమైన అనురాగం. మనసు ద్రవించడం లేదూ!



వివరణ:

ఎప్పుడో రెండు వేల ఏళ్ళనాడు గడియారాలు, కాలెండర్లు అందుబాటులో లేనప్పుడు కొండగుర్తులే గతి. అందునా చదువురాని పల్లెజనులకు పంచాంగం కూడా తెలియదు. అందువల్ల గోడమీద గుర్తులు, గులకరాళ్ళు లెక్కపెట్టుకోవడం వంటివే నాడు కాలాన్ని గుర్తించే సాధనాలు. ఇప్పటికీ పల్లెటూళ్ళల్లో పెద్దవాళ్ళు నీడను బట్టి టైం ఎంతైందో చెపుతారు. ఈ గాథ ఆ అమాయక పల్లెపడుచు దీనస్థితినీ, నాటి కాలగణనూ తెలియజేస్తుంది.

ప్రాకృతమూలం:

జంఝావా ఉత్తిణి అఘర వివరపలోట్టసలిలధారాహిం।
కుడ్డలిహిఓహి అహం రక్ఖఇ అజ్జా కరఅలేహిం॥ (జయసేనుడు) (2–70)

సంస్కృతచ్ఛాయ:

ఝంజావాతోత్తృణీకృత గృహవివరప్రపతత్సలిల ధారాభిః।
కుడ్యలిఖితావధి దివసం రక్షత్యార్యాకరతలైః ॥

ఏ దేవతవు నాయనా నువ్వు?

తే.గీ॥ **కర్ణభూషలుగా నొప్పు, కలువపూల**
నవపరాగ మామెకు, నయనములబడగ
ఊదునెపమున, ముద్దాడు "ఓయి! ఘనుడ!
నీవనిమిషుల యందున నెవరు చెపుమ?

–ఆమె చెవులకున్న కలువపూవుల పుప్పొడి కన్నులలోపడగా ఊదే నెపంతో ఆమెను ముద్దాడుతున్న ప్రియుణ్ణి "నీవు సామాన్యుడవుకాదు. ఏ దేవతాస్వరూపం నాయనా నువ్వు" అంటూ చమత్కరిస్తున్నాడు వారిని గమనించిన ఒకడు.



వివరణ:

'గాథాసప్తశతి' లోని అనేక గాథల్లో స్త్రీలు చెవులకు కలువపూవుల్ని అలంకరణ కోసం ధరించడం ప్రస్తావించబడింది. అంటే నాడు అది చాలా సామాన్యమైన విషయమన్నమాట. ఈ గాథలో నాయిక కంట్లో పడ్డ పుప్పొడిని ఊదే నెపంతో లాఘవంగా ముద్దాడుతున్న యువకుడ్ని 'ఏ దేవతవు నాయనా నువ్వు?' అని అడగడం సహజసుందరంగా ఉంది. పైగా తెలుగుదనం ఉట్టిపడే 'నువ్వు సామాన్యుడివి కాదురోయ్!' అనే ధ్వని ఈ గాథలో ప్రతిధ్వనిస్తోంది.

ప్రాకృతమూలం:

వాఏరిఏణ భరిఅం అచ్ఛిం కణ్ణ ఊర ఉప్పలర ఏణ।
ఫుక్కంతో అవిఇణ్హం చుంబంతో కోసి దేవణం॥ (పాలితుడు) (2–76)

సంస్కృతచ్ఛాయ:

వాతేరితేన భృతమక్షి కర్ణపూరోత్పలరజసా।
ఫూత్కుర్వన్నవితృష్ణం చుంబంకో ఉసి దేవానామ్॥

సన్నబడుతున్న వన్నెలాడి

ఆ.వె॥ **నీదు మనములోన నెలతలు మెండుగా**
నిలచియుండిరనుట తెలిసితెలిసి
హృదయసీమలోన నిసుమంతచోటుకై
సన్నబడుచునుండె వన్నెలాడి॥

– నీ హృదయంలో అనేకమంది స్త్రీలు క్రిక్కిరిసి ఉన్నారని తెలిసి కూడా ఆమె నీ హృదయంలో స్థానంకోసం మరింతగా సన్నబడుతోందని' ఒక వన్నెకాడితో దూతిక పలుకుతోంది.



వివరణ:

బరువు తగ్గడాలు, డైటింగులు వంటివి నాడే ఉన్నాయేమో!ననిపిస్తోంది ఈ గాథ చదువుతూంటే. నాయిక, నాయకుడి మనస్సులో చోటు సంపాదించడానికి ప్రయత్నపూర్వకంగా సన్నబడుతోందని చెప్పడం ఎంత చమత్కారం.

ప్రాకృతమూలం:

మహిలాసహస్సభరిఏ తుహ హిఅఏ సుఅహసా అమాఅంతీ।
ది అహం అణణ్ణకమ్మా అంగం తణుఅంపి తనుఏఇ॥ (హాలుడు) (2–82)

సంస్కృతచ్ఛాయ:

మహిలాసహస్రభృతే తవహృదయే సుభగ సా అమాంతీ।
దివసమనన్య కర్మా అంగం అనుకమపి తనూకరోతి॥

అంతరంగంలో అదే చల్లదనం

ఆ.వె॥ **శీతవేళలోన చెరువులో నీరంబు**
లోనచల్లదనము, పైనవేడి
అటులె కృద్ధుడైన, అమలిన హృదయుండు
కోపి బయట, శాంతగుణియె హృదిని॥

– శరత్కాలంలో చెరువులో నీళ్ళు పైన వేడిగా ఉంటాయి. కానీ లోపల మాత్రం చల్లగానే ఉంటాయి. అట్లాగే సజ్జనులైనవారు ఎప్పుడైనా పైకి కోపంగా కనిపించినా లోపల మాత్రం శాంతంగానే ఉంటారని ఈ గాథ సారాంశం.



వివరణ:

ఉత్తములకు ప్రథమ కోపమేగాని దీర్ఘకోపముండదు అనే విషయాన్ని ప్రతిపాదిస్తుందీ గాథ. ఏదైనా సందర్భంలో ఎవరిమీదైనా కోప్పడవలసివస్తే, దాన్ని అంతటితో వదిలేయాలి గానీ, దాన్నే దీర్ఘకాలంపాటు మనసులో ఉంచుకోకూడదు. అలా మనసులో కోపం గూడు కట్టుకుంటే అది పగగా మారి ఎన్ని ప్రమాదాలకైనా దారితీయవచ్చు. అందుకే 'కోపాన్ని జయిస్తే లోకాన్ని జయించినట్లే'నంటారు. ఈ గాథ కూడా ఉత్తములైన వాళ్ళు ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటారని చెపుతుంది.

ప్రాకృతమూలం:

సరఏ మహద్ధదాణం అంతే సిసిరాఇం వాహిరు ష్ణాఇం।
జాఆఇంకువిఅ సజ్జణ హిఅఅసరిచ్ఛా ఇసలిలాఇం॥ (విగ్రహరాజు) (2-86)

సంస్కృతచ్ఛాయ:

శరది మహాహ్రదా నామంతః శిశిరాణి బహిరుష్ణాని।
జాతాని కుపిత సజ్జనహృదయసదృక్షాణి సలిలాని॥

వినబడలా...

తే.గీ॥ **హృదిని మధుభావ లహరులరేపు, నీదు**
ప్రియవచనముల మరిమరి వినగగోరి
వినబడుట లేదని నటించి, వెలది నాకు
చేతిసైగచేసి మరల చెప్పుమనును॥

– నాయకుడు తన ప్రేమను వెల్లడిస్తూ దూతిక చేత వర్తమానం పంపించాడు. ఆ వర్తమానాన్ని మళ్ళీ, మళ్ళీ వినాలనే తలంపుతో, తనకు వినపడనట్లుగా నటిస్తూ చేతిసైగ చేసి మళ్ళీ చెప్పమంటోందా దూతికను.



వివరణ:

ఈ నైజాన్ని మనం పొగడ్తల విషయంలో కూడా లోకంలో చూస్తూంటాం. 'ఇందాక సరిగా వినలేదు. మళ్ళా చెప్పు!' అని పొగడ్తలను మరలా మరలా చెప్పించుకోవడం మనకు అనుభవైక వేద్యమే! తన్ను పొగిడిన మాటల్ని మరొకరికి పదే పదే వినిపంచమని వేధించే వాళ్ళూ ఉంటారు. మంచి వార్తలను కూడా మళ్ళా మళ్ళా వినాలనుకోవడం మానవనైజం. అదే విషయాన్ని ఈ గాథ తెలియజేస్తుంది.

ప్రాకృతమూలం:

బహుసోవి కహిజ్జం తం తుహవ అణం మజ్ఝహత్థసందిట్ఠమ్।
ణ సుఅం త్తి జంపమాణా పుణరుత్తసఅంకుణఇఅజ్జా॥ (సురభివంశ్యుదు) (2–98)

సంస్కృతచ్ఛాయ:

బహుశోఽపి కథ్యమానం తవవచనం మమహస్తసందిష్టమ్।
నశ్రుతమితిజల్పంతీ పునరుక్త శతం కరోత్యార్యా॥

స్పందించే స్నేహం కావాలి

తే.గీ॥ స్పందనములేని గోడపై ప్రతిమలట్లు
చేతనైనట్టి సాయమ్ము సేయకుండ
కష్టమున మోముతప్పించు ఖలులగాక
కోమలహృదుల స్నేహమ్ము కోరవలయు॥

– గోడపై ఉన్న బొమ్మల్లాగా ఆపద సమయంలో స్నేహితుల కష్టాలను ఉపేక్షించి చూస్తూ, ముఖం తప్పించే వాళ్ళను గాక, మంచివాళ్ళ స్నేహాన్నే ఎల్లప్పుడూ కోరుకోవాలని నాయిక ప్రియుడికి ఉద్బోధిస్తోంది.



వివరణ:

'అక్కరకురాని చుట్టము' పద్యానికి ముందు రూపంలా కనిపిస్తోందీ గాథ. 'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ ఈజ్ ఎ ఫ్రెండ్ ఇన్ డీడ్' అన్న ఆంగ్ల వాక్య సారాంశాన్ని ఏనాడో చెప్పిన గాథ ఇది. కష్టాల్లో ముఖం తప్పించే స్నేహితుల్ని కాకుండా, నీ కోసం నలుగురు మంచి స్నేహితుల్ని ఎంచుకోమంటుందీగాథ.

ప్రాకృతమూలం:

తం మిత్తం కాఅవ్వం జం కిర వసణమ్మి దేసఆలమ్మి।
అలిహి అభిత్తి వాఉల్లఅం వణ పరమ్ము హం ఠా ఇ ॥ (పాలితుడు) (3–17)

సంస్కృతచ్ఛాయ:

తన్మిత్రం కర్తవ్యం యత్కిలవ్యసనే దేశకాలేషు।
ఆలిఖిత భిత్తి పుత్తలకమివన పరాన్ముఖం తిష్ఠతి॥

బేలచూపుల జాలిగాథ

ఆ.వె॥ నీప్రయాణవేళ, నెమ్మనమ్మునకుంది
పంజరమున నున్న పక్షివోలె
తడికకంతనుండి తడికళ్ళతోజూచు
కాంత బేలచూపు, కనుము కనుము॥

– "నీవు ప్రయాణమై పరదేశానికి వెళుతూ ఉంటే, నీ భార్య ఎంత బేలగా తడిసిన కళ్ళతో, తడిక కంతలలోంచి చూచి బాధపడుతోందో చూడు!" అని దూతిక నాయకుడితో ఆర్ద్రంగా చెపుతోంది.



వివరణ:

ఇది ఒక జాలిగాథ. భర్త విదేశానికి వెళుతుంటే బేలగా చూస్తూ ఉండిపోయిన నిస్సహాయురాలి దైన్యాన్ని వర్ణించాడీ గాథలో. నాడు ఇళ్ళల్లో గోడలకు బదులు వెదురు తడికలు వాడేవారు. ఆ తడికలకు చిన్న చిన్న రంధ్రాలుండేవి. ఆ తడిక కంతలలోంచి తడిసిన కళ్ళతో వీడ్కోలు పలికిన వనిత గాథ ఇది.

ప్రాకృతమూలం:

ఎక్కేక్కభవ ఇవేరణ వివరంతర దిణ్ణతరలణ అణాఏ।
త ఇ బో లంతే బాలఅ! పంజరసఉణాఇఅం తీఏ॥ (అరికేసరి) (3–20)

సంస్కృతచ్ఛాయ:

ఏకైకవృతివేష్టనవివరాంతరదత్తతరళనయనయా।
త్వయివ్యతిక్రాంతే బాలక। పంజరశకునాయితంతయా॥

తెచ్చి పెట్టుకున్న జాణతనం

ఆ.వె॥ **అట్లు చూతువేమి? అరమోడ్పుకనులతో**
నీవు జాణవంచు నెంచునేమొ!
ప్రక్క చూపుగాక, స్వచ్ఛంబుగా జూడ
ముగ్ధవీవనంచు మురియువాడు॥

– "ఓ చెలీ! ఏమిటలా సగం మూసిన కన్నులతో చూస్తున్నావు! నిన్ను అతడు అన్నీ తెలిసిన జాణగా భావిస్తాడేమో! సహజంగా స్వచ్ఛంగా సూటిగా నీవు చూసినట్లయితే అతడు నిన్ను అమాయకురాలిగా భావిస్తాడు. అమితంగా ప్రేమిస్తాడు" అని నాయికకు హితోపదేశం చేస్తోంది దూతిక.



వివరణ:

వంకర చూపులు, వంకరమాటలు ఎప్పుడూ ప్రమాదకరమే! స్వచ్ఛమైన మనస్సు, నిజాయితీగల మాటలు, నిర్మలమైన చూపు, ఎవరిని ఆకర్షించవు? తెచ్చి పెట్టుకున్న జాణతనాన్ని కట్టిపెట్టి నీవు నీవుగా ఉంటే బాగుంటుందని చెప్తోంది దూతిక.

ప్రాకృతమూలం:

ఆద్ధచ్ఛి పేచ్ఛిఅం మాకరేహి సాహావిఅంపలోఏహి।
సోవి సుదిట్ఠో హెూహి ఇ తుమంపి ముద్ధా కలిజ్జిహిసి॥ (మయరందుదు) (3–25)

సంస్కృతచ్ఛాయ:

అర్ధాక్షిప్రేక్షితం మాకురు స్వాభావికం ప్రలోకయ
సోపిసుదృష్టో భవిష్యతి త్వమపి ముగ్ధా కలిష్యసే॥

మధ్యముడే ఉత్తమం

తే.గీ॥ **దుష్టమిత్రునిజూచుట దుఃఖకరము**
సుహృదయుడగు సన్మిత్రుని జూడకున్న
నదియు, హృదయాబ్జమునకు సన్తాపకరము
చూడ! మధ్యము స్నేహమే సుఖ కరమ్ము॥

– 'దుష్టుడైన మిత్రుడు కనపడ్డా దుఃఖమే – సజ్జనుడైన మిత్రుడు కనపడకపోయినా దుఃఖమే. అందువల్ల మధ్యమునితో స్నేహమే సుఖకరమని' నాయిక తనప్రియసఖితో చెపుతోంది.



వివరణ :

దుష్టుడైన మిత్రుడు కలిస్తే ఏ ఉపద్రవం తెస్తాడోనని భయం. 'ఇలాంటి వాడు నీ మిత్రుడా!' అని ఎవరైనా అంటారేమో!నని జంకు. మరీ మంచివాడైన మిత్రుడైతే, అతడు కనపడకపోతే దుఃఖం వస్తుంది. కారణం అతని సౌజన్యం, సౌభ్రాతృత్వం. కాబట్టి మీరు చెడ్డవారినీ కాకుండా, మరీ మంచివారినీ కాకుండా మధ్యములనే ఎంచుకోమంటుందీ గాథ. మంచితనానికి కొలమానం లేదుకదా! అందువల్ల మంచివాళ్ళందరినీ మిత్రులుగా చేసుకుంటే పోలా!

ప్రాకృతమూలం :

తామజ్ఝియోవ్విఅవరం దుజ్జణసుఅణోహిదోహివిణకజ్జం।
జహదిట్ఠో తవఇ ఖలో తహే అసుఅణో అఈసంతో॥ (హాలుడు) (3–24)

సంస్కృతచ్ఛాయ :

తన్మధ్యమ ఏవవరం దుర్జన సుజనాభ్యాం ద్వాభ్యామపినకార్యమ్।
యథాదృష్టస్తాప యతి ఖలస్తదైవసుజనో ఽ దృశ్యమానః॥

గోదావరి వరద - ఈతసరదా

తే.గీ॥ వాని ఎదలోని గాఢమౌ వలపుతలపు
సహజసిద్ధముకాని నాసాహసమ్ము
రాత్రి కురిసిన వర్షధారలకు తెలియు
కదముత్రొక్కు గోదావరీ నదికి తెలియు॥

– నాయిక తన చెలికత్తెతో ఇలా అంటోంది "రాత్రికురిసిన జోరువానలో, మహోగ్రమైన గోదావరీ వరద ప్రవాహానికి ఎదురీది మరీ వాణ్ణి కలుసుకోవడానికి వెళ్ళాను. నా మీద వాడికి గల గాఢమైన ప్రేమ, అసాధారణమైన నా సాహసం – ఎడతెరిపి లేకుండా కురిసిన కుంభవృష్టికి తెలుసు, మహోగ్రంగా కదంతొక్కుతూ ప్రవహించిన గోదావరీనదికి మాత్రమే తెలుసు".



వివరణ:

మామూలుగానే గోదావరిని ఈదడం కష్టం. అందునా నిండు వర్షాకాలంలో మహోగ్రంగా ప్రవహించే గోదావరినదిని ఈది ఆవలఒడ్డుకు చేరిన మహిళామణిని అభినందించకుండా ఉండలేం. ప్రేమ గుడ్డిదని అంటారు. కానీ, ప్రేమ సాహసవంతమైనది కూడా! ఈ గాథ చదువుతూంటే 'సాహసం సేయరా! డింభకా! రాకుమారి లభిస్తుంది' అనగానే నిప్పుల్లో దూకిన తోటరాముడు (పాతాళభైరవి చిత్రం) మనకు జ్ఞప్తికి రాకమానదు. ప్రేమ అర్థవంతమై, న్యాయబద్ధమైనప్పుడు తప్పకుండా సఫలమవుతుంది.

ప్రాకృతమూలం:

తస్సఅ సోహగ్గగుణం అమహిలాసరిసం చసాహసం మజ్ఝ।
జాణ ఇ గోలాఊరో వాసాత్తోద్ధరత్తో అ॥ (మకరధ్వజుడు) (3–31)

సంస్కృతచ్ఛాయ:

తస్యచ సౌభాగ్యగుణమహిళా సదృశంచసాహసంమమ।
జానాతి గోదాపూరో వర్షారాత్రార్ధరాత్రశ్చ॥

గతస్మృతులు

తే.గీ॥ **వన్నె చిన్నెలు చిందించు వయసుపోయె**
ప్రేమపంచిన పూపొదరిండ్లు పోయె
సతతహితులౌ, పరమసఖీతతియుబోయె
హృదినిపదిలముగ, మధురస్మృతులె మిగిలె॥

– ఒక వృద్ధస్త్రీ తన గత సౌందర్య వైభవాన్నీ, పూలపొదరిండ్లు, ఇష్టసఖులు, పరువము గతించిన వైనాన్నీ నవయువతులకు వివరిస్తూ కేవలం మధురస్మృతులే మిగిలాయని విచారిస్తోంది.



వివరణ:

'మేం ఆ రోజుల్లో' అంటూ పెద్దలు వినిపించే పడక్కుర్చీ కబుర్లులాంటి గాథ ఇది. 'ఆనాటి తీపిగుర్తులేవీ' అని మెమరీస్‌ను నెమరేసుకోవడం ప్రతిమనిషీ చేసేపనే. పండ్లూడిపోయిన తాతయ్య 'ఆ రోజుల్లో చెరకుగడలనూ, రేగుపండ్లనూ నోటితోనే నమిలేవాడినని' చెప్తూండడం మనం చూస్తూనే ఉంటాం. అదే కోవలో పోయినవాటిని తలచుకొని, మధురస్మృతులను నెమరేసుకుంటున్న మామ్మగారి గాథ ఇది. వారి జీవితానుభవాలలో పిన్నలకు ఉపకరించే వాటిని చెప్పడం సముచితమేమో!

ప్రాకృతమూలం:

తేవోలి ఆ వ అస్సా తాణకుడంగాణ ధాను ఆసేసా।
అమ్హోవిగఅవ ఆ ఓ మూలుచ్ఛే అంగఅం పేమ్మం॥ (నిరువముడు) (3-32)

సంస్కృతచ్ఛాయ:

తేవ్యతిక్రాంతా వయస్కాస్తే షాంకుడంగనాః స్థాణవఃశేషా।
వయమపి గతవయస్యామూలోచ్ఛేద్యం గతంప్రేమ॥

అసమాన సౌందర్యం

ఆ.వె॥ ఆమె మేనినెచట, అవలోకనము సేయ
కన్నులచటెనిలచు కారణమున
పొలతి సొగసును, పరిపూర్ణముగ గనిన
పురుషుడెవడు గలడు? భూమిపైన॥

– ఈ గాథలో నాయకుడు నాయిక సౌందర్యాన్ని అతిశయోక్తి గా వర్ణిస్తున్నాడు. ''ఆమె అతిలోకసౌందర్యరాశి. ఆమె సర్వాంగాలూ సౌందర్యసంశోభితాలే. ఆమెను మొదట ఎవడు ఎచట చూస్తాడో, అచ్చటినుండి చూపు మరల్చుకోలేడు. అందువల్ల ఆమె ఇతర అవయవసౌందర్యాన్ని అతడు చూడలేడు. అందువల్ల ఆమె సౌందర్యాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా చూచిన మానవ మాత్రుడెవడున్నాడు, కనుక!"



వివరణ:

నాయిక అతిలోకసౌందర్యరాశి అని చెప్పడానికి ఎంత గొప్పధ్వనిని నిక్షిప్తం చేశాడు గాథాకారుడు. ఆమె యొక్క ఏఅవయవాన్ని చూస్తే అక్కడే చూపు నిలిచిపోతుందని చెప్పడం గొప్ప టెక్నిక్. అందుకే ప్రాకృతసాహిత్యం రసభరితము, ధ్వనిమహితము ఐనదని కీ.శే॥పుట్టపర్తి నారాయణాచార్యులవారంటారు. వారిమాట అక్షరసత్యం.

ప్రాకృతమూలం:

జస్స జహం విఅ పఢమం తిస్సా అంగమ్మి ణివడి ఆ దిట్ఠీ।
తస్సతహిం చే అఠీఅ సవ్వంగం కేణ విణదిట్ఠమ్॥ (అర్ధరాయడు) (3-34)

సంస్కృతచ్ఛాయ:

యస్యయత్రైవ ప్రథమం తస్యా అంగే నిపతితాదృష్టిః!
తస్య తత్రైవ స్థితా సర్వాంగం కేనాపి నదృష్టమ్॥

పిడికిలిలో నీరు

తే.గీ॥ కనగ చిరకాల మెడబాటు కలుగుకతన
ఒకరి నొకరు చూచుకొనక యున్న యంత
ప్రేమ ఎంతైన, ప్రేయసీప్రియుల మధ్య
నిలచునే? పిడికిటనున్న, నీటివోలె॥ (3-36)

– "అబ్బాయీ! మనసుల్లో ఎంతప్రేమ ఉన్నా ఎక్కువ కాలంపాటు మీరు ఒకర్నొకరు చూసుకోకుండా ఉండడం మంచిదికాదు. ఎందుచేతంటే! ప్రేమ పిడికిలిలో ఉన్న నీళ్ళలాగా క్రమంగా మాయమవుతుంది" అని ప్రియురాలికి చిరకాలం దూరంగా ఉన్న నాయకుణ్ణి వృద్ధ దూతిక హెచ్చరిస్తోంది.



వివరణ:

'ఆషాఢం' లాగా అప్పుడప్పుడూ ఎడబాటు అవసరమేగానీ, సంవత్సరాలకు తరబడి భార్యభర్తలు దూరంగా ఉండడం మంచికాదని ఈ గాథలోని సందేశం. అలా దూరంగా ఉంటే ఒకర్నొకరు మర్చిపోయే ప్రమాదం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. దీర్ఘకాలికమైన ఎడబాటువల్ల మగవాళ్ళ సన్యాసులుగా (సన్నాసికాదు) మారిన సందర్భాలూ ఉన్నాయి. ఏదన్నా పనిమీద విదేశానికి వెళ్ళినా సతిని వెంట తీసుకెళ్ళడమో, వెంటనే రావడమో మంచిది.

ప్రాకృతమూలం:

అద్దం సణేణ పుత్తఅ! సుట్ఠు విణేహాణు బంధఘడి ఆ ఇం।
హత్థ ఉడపాణి ఆఇంవకాలేణ గలంతి పేమ్మాఇం॥ (వహరసుడు) (3-36)

సంస్కృతచ్ఛాయ:

ఆదర్శనేన పుత్రక! సుష్ఠపిస్నేహానుబంధఘటితాని।
హస్తపుట పానీయానీవ కాలేన గలంతిప్రేమాణి॥

లేఖ వ్రాసేదెట్లా?

తే.గీ॥ ప్రేమలేఖ వ్రాయగనెంచ ప్రియతమునకు
వాని తలపులతో చేయి, వణకసాగె
'స్వస్తి' యనుమాట, సైతము వ్రాయలేక
పోయితినిక లేఖను పూర్తిసేయుటెట్లు॥

– "ప్రియుడికి ప్రేమలేఖ వ్రాద్దామని కూర్చున్నాను. వాని తలపులతో చేయి వణకసాగింది. చెమటలు పట్టసాగాయి. లేఖిని పట్టు కోల్పోతోంది. తొలుత క్షేమం' అనే సమాచారం తెలిపే 'స్వస్తి' అనే మాటను కూడా పూర్తి చేయలేక పోయినాను. ఇంక లేఖను పూర్తి చేయగలనా సఖీ!" అంటూ అనుంగు చెలికత్తెతో తన విరహ బాధను తెలియజేసిందా నాయిక.



వివరణ:

'ప్రేమలేఖ' వ్రాయడం ఒక కళ. దాన్ని అందుకున్నవాళ్ళు అనేకసార్లు చదివి ఆనందించడం గొప్ప అనుభూతి. అసలిప్పుడు లేఖ లెక్కడివి. మాటలు దాటి ఏమోజీల యుగంలోకి ప్రవేశించాం. అన్ని భావాల వ్యక్తీకరణకూ యువత ఎమోజీల మీదే ఆధారపడుతోంది. రాను రాను మాటల ప్రమేయం తగ్గి మళ్ళీ సైగలు వస్తాయేమో!

ప్రాకృతమూలం:

వేవిరసిణ్ణ కరంగులిపరిగ్గహక్ఖసి అలేహణీ మగ్గే।
సోత్థివ్విఅ ణ సమప్పఇ పిఅసహి లేహమ్మికిం లిహిమో॥ (అంధుడు) (3–44)

సంస్కృతచ్ఛాయః

వేపన శీలా స్విన్నకరాంగులి పరిగ్రహస్ఖలిత లేఖనీ మార్గే।
స్వస్త్యేవన సమాప్యతే ప్రియసఖి లేఖే కిం లిఖామః॥

దైవబలం కావాలి

ఆ.వె॥ **వట్టి ఇసుకగోడ పదిలంబుగానట్లు**
కమలధవునియొక్క కరుణలేక
పురుషయత్నమెంత పూర్ణంబు గానున్న
చక్కబడునె పనులు సత్వరముగ ॥

– 'షడ్విధం మానవయత్నం సప్తమం దైవచింతనం' అనికదా! ఆర్యోక్తి. మనిషి తను చేపట్టిన పనులలో కృతకృత్యుడవ్వాలంటే దైవానుగ్రహం కూడా తోడవ్వాలి. అలా లేకుంటే అది ఇసుకతో కట్టిన గోడే అవుతుంది. వట్టి ఇసుకతో కట్టిన గోడ నిలువదు కదా! 'మనిషి ఎంత కష్టపడితే ఏంలాభం? దైవం అనుకూలించకపోతే' అనే భావం నాటి సమాజంలో (క్రీ.శ. 1వ శతాబ్దం) కూడా ఉందన్నమాట.



వివరణ:

అవినీతిపరుడైన కాంట్రాక్టరు వట్టి ఇసుకతోనే నిర్మాణాలు లాగించేస్తుంటాడు. అవి మూణ్ణాళ్ళముచ్చటే. నిర్మాణం పటిష్టంగా ఉండాలంటే మాత్రం సిమెంటు కలపవలసిందే. దైవబలం అనే సిమెంటు ఎంత ఎక్కువగా ఉంటే పనులు అంత త్వరితంగా ఫలవంతమవుతాయి. 'దైవం మానుషరూపేణ' అని దేవుడు స్వయంగా 'ఇన్‌వాల్వ్' కాకపోవచ్చు. కానీ మనకు ఉపకరించే వాళ్ళరూపంలో దేవుడే సహకరిస్తుంటాడు. అందువల్ల మనకు ఉపకారం చేసిన వాళ్ళను దైవంగా భావించి వారికి ప్రత్యుపకారం చేయవచ్చు. కానీ అపకారం మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ తలపెట్టకూడదు.

ప్రాకృతమూలం:

దేవ్వమ్మి పరాహుత్తే పత్తిఅఘుడిఅం వివిహడఇణరాణం।
కజ్జం వాలు అవరణం వ్వకహవి బంధం విఅణఏఇ ॥ (అంధుడు) (3–45)

సంస్కృతచ్ఛాయ:

దైవే పరాన్ముఖే ప్రతీహి ఘటితమపి విఘటతే నరాణాం ।
కార్యం వాలుకావరణ ఇవకథమపి బంధమేవ నదదాతి॥

కాఠిన్యమెందుకు?

తే.గీ॥ **కరగిపోయిన పరువమ్ము మరలిరాదు**
కాలమంతయు నొకరీతి గడువబోదు
ప్రాణములు శాశ్వతంబుగ, బరగబోవు
ఇంత కఠినత్వము, జనుల కెందుకొరకు?

– ఏదో మాట పట్టింపువల్ల ఎడముఖం, పెడముఖంగా ఉన్న భార్యాభర్తలకు దూతిక హితబోధ చేస్తూ – "యౌవనం తిరిగిరాదు. రోజులన్నీ ఒకరకంగా ఉండవు, ప్రాణాలు శాశ్వతం కావు. ఎందుకు? ఇంతటి కఠినత్వం" అంటూ ఉన్నన్నాళ్ళూ హాయిగా, సుఖంగా ఉండమని చెపుతోంది.



వివరణ:

జీవితం చాలా చిన్నది. ఆ చిన్న జీవితంలోనే పంతాలు, పట్టింపులు, పగలు, ప్రతీకారాలు. కొంతమంది పంతాలతోనే జీవితమంతా గడిపేసిన వాళ్ళూ ఉన్నారు. తను పిలుస్తాడని ఆమె, ఆమే వస్తుందని అతడు వృద్ధులయ్యే దాకా ఎదురుచూచిన జంటలు కోకొల్లలు. తీరా వృద్ధాప్యం సమీపించాక వగచి ప్రయోజనమేముంది? కఠినత్వం భార్యాభర్తల విషయంలో అసలు పనికిరాదు. ఎవరో ఒకరు ముందు ఒకమెట్టు దిగితే అవతలివారు రెండు మెట్లు దిగుతారు. జీవితం ఆనందమయమౌతుంది. లేకుంటే అంధకార బంధురమౌతుంది.

ప్రాకృతమూలం:

జివిఅం అసాసఅం విఅణ ణిఅత్తఇ జొవ్వణం అతిక్కంతం।
దిఅహా దిఅహేహిం సమాణహొంతికి ణిఠ్ఠురోలో ఓ॥ (హాలుడు) (3–47)

సంస్కృతచ్ఛాయ:

జీవితమశాశ్వతమేవ నివర్తితే యౌవన మతిక్రాంతమ్।
దివసా దివసైః సమానభవంతి కి నిష్ఠురో లోకః॥

పనికిరానివి

ఆ.వె॥ సుగుణ గరిమలేని సుందరరూపమ్ము
పరుల చేతిలోని సిరులమూట
ధర్మదృష్టిలేని దండియౌజ్ఞానమ్ము
పనికిరాని హితుడు వలదు వలదు॥

– హాలుడు స్వయంగా చెప్పిన నీతిగాథ ఇది. గుణంలేని అందం వల్ల ఉపయోగంలేదు. పైగా సమాజానికి నష్టం కూడా! చెంత కాకుండా ఎక్కడెక్కడో ఉంచబడిన ధనం వల్ల ఏమిటి ఉపయోగం? ధర్మదృష్టిలేని విజ్ఞానం వల్ల వినాశనమే! ఉదాహరణ రావణాసురుడే! కష్టంలో ఉపయోగపడకుండా ముఖం చాటేసే మిత్రుడు ఉంటే ఏం? లేకుంటే ఏం? – అంటున్నాడు గాథాకారుడు.



వివరణ:

బాహ్యసౌందర్యం కన్నా, అంతః సౌందర్యమే గొప్పది. ఉత్తమమైన సంస్కారం గల వాళ్ళు లోకానికి చాలా అందంగా కనిపిస్తారు. తనదికాని ధనంవల్ల అదనపుబరువేగానీ ప్రయోజనం శూన్యం. విజ్ఞానం కచ్చితంగా విజ్ఞుడి దగ్గరే ఉండాలి. అందుకే పూర్వకాలంలో దివ్యాస్త్రాలు ఉత్తముల దగ్గర ఉంటే లోక కల్యాణానికి ఉపయోగపడ్డాయి. అదే దుర్మార్గుల దగ్గర ఉంటే హింసకు, జనక్షయానికి దారితీసాయి. ఈ విషయాల్ని నాడే గుర్తించిన హాలభూపాలునకు జోహార్లు.

ప్రాకృతమూలం:

సో అత్థో జోహత్థేతం మిత్తం జంణిరం తరం వసణే
తం రూఅం జత్థ గుణా తం విణ్ణాణం జహింధమ్మో॥ (హాలుడు) (3–51)

సంస్కృతచ్ఛాయ:

సోర్థో యోహస్తే తన్మిత్రం యన్నిరంతరం వ్యసనే
తద్రూపం యత్రగుణాస్తద్విజ్ఞానం యత్రధర్మః॥

అక్రమసంపాదన అధములపాలు

ఆ.వె॥ అధములైనవారి అక్రమార్జనమును
అధములైనవారె అనుభవింత్రు
పృథ్వియందు చూడ, వేపపండ్లనెపుడు
కాకితినునుగాని, ఘనుడు తినడు॥

– "లోకంలో చెడ్డవాళ్ళు అన్యాయంగా ఆర్జించిన ధనాన్ని చెడ్డవాళ్ళే తింటారు. అది ఎలాగంటే ఎంత పండినవైనా వేపపండ్లను కాకులు మాత్రమే తింటాయి'' అని అన్యాయంగా ధనం ఆర్జించవద్దని నాయిక నాయకుడికి హితోపదేశం చేస్తోంది.



వివరణ:

పురుషార్థములు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ధర్మాన్ని ముందు చెప్పడంలో ఉద్దేశం – ధర్మబద్ధంగా అర్థాన్ని సంపాదించమని 'అన్యాయార్జితం విత్తం, దశవర్షాణి, అథవా ద్వాదశ వర్షాణి, సమూలం వినశ్యతి' అని పెద్దలు చెపుతారు. అంటే అన్యాయంగా ఆర్జించిన ధనం పది లేక పన్నెండు సంవత్సరాలలో సమూలంగా (ఇంతకు ముందున్న దానితో సహా) నశిస్తుందని అర్థం. అధర్మబద్ధంగా సంపాదించిన సొమ్ముకు అధములే వారసులౌతారని ఈ గాథ ప్రతిపాదిస్తుంది. వారసులు అధములు, నీచులు కాకూడనుకుంటే ధర్మబద్ధంగా ధనం సంపాదించాలని అంతరార్థం.

ప్రాకృతమూలం:

ఉప్పాఇ అదవ్వాణం విఖలాణం కో భా అణం ఖలో చ్చే అ।
పక్కా ఇవిణిం బ ఫలా ఇ ణవరం కాఏహి ఖజ్జంతి॥ (పాలితుడు) (3–48)

సంస్కృతచ్ఛాయ:

ఉత్పాదిత ద్రవ్యాణామపి ఖలానాం కోభాజనం ఖలఏవ।
పక్వాన్యపి నింబఫలాని కేవలం కాకైః ఖాద్యంతే॥

పెట్టిననాడు పెళ్ళికూడు...

ఆ.వె॥ **పెట్టుచున్నవరకు, పెన్నిధిగా బిల్చి**
ఇంద్రుడనుట, నిండు చంద్రుడనుట
పెట్టలేనివేళ, పెనుతిట్లు తిట్టుట
ఈ జగాన ఖలుల నైజమగును॥

– 'పెట్టిననాడు పెళ్ళికూడు, పెట్టనినాడు పిండాకూడు' అన్నది తెలుగుజాతీయం. అదే ఈ గాథలో ప్రతిపాదించబడింది. నీచులైనవాళ్ళు పెట్టినన్నాళ్ళే మంచిగా పొగుడుతారు, పెట్టనినాడు తీవ్రంగా తిడతారు. ఇదే లోకనైజం అంటున్నాడు జయరాముడు.



వివరణ:

'ఎప్పుడు సంపదగల్గిన / అప్పుడు బంధువులు వత్తురది ఎట్లన్నన్ / తెప్పలుగ చెరువు నిండిన / కప్పలు పదివేలు జేరుగదరా! సుమతీ!' అని బద్దెన అంటాడు. సంపద ఉన్నంతవరకు బంధాలు, బాంధవ్యాలు బలంగా ఉంటాయి. పరపతి, సంపద లేనప్పుడు అతడు మా బంధువని ఎవరు చెప్పుకుంటారు? అలా చెప్పుకోవాలంటే శ్రీకృష్ణుని కున్నంత గొప్ప మనసుండాలి. కుచేలుడు అంటేనే చెడ్డబట్టలు ధరించినవాడనిఅర్థం. అలాంటి వాణ్ణి తన స్నేహితునిగా పరిచయం చేసి అతిథి మర్యాద చేసిన శ్రీకృష్ణుడే మనకు ఆదర్శం. రాజైన వేళ ద్రోణుని 'నీతో నాకు స్నేహమేంటి?' అని ప్రశ్నించిన ద్రుపదుడూ మన పురాణాల్లో ఉన్నాడన్న సంగతినీ మరువకూడదు. ధనం ఉన్నా లేకున్నా, మనసున్న వారితో స్నేహమే మాననీయం.

ప్రాకృతమూలం:

అ ఉ లీ ణో దోముహ ఓ తా మహురో భోఅణం ముహేజావ
మురఓ వ్వ ఖలో జిణ్ణమ్మి భో అణే విరస మారస ఇ॥ (3–53)

సంస్కృతచ్ఛాయ:

అకులీనో ద్విముఖస్తావ న్మధురో భోజనం ముఖేయావత్।
మురజ ఇవఖలో జీరే భోజనే విరసమారసతి॥

చేయరానిది చేయకు

తే.గీ॥ **చేయవలసినదానిని చేయకుంట**
చేయకూడనిదానిని చేయుచుంట
అనెడు రెండు పనులెపుడు, కనకశైల
మంత వానిని సైతము, అధము సేయు.

– చేయవలసిన దానిని చేయకుండా ఉండడం, చేయకూడనిదానిని చేయడం, అనే రెండు పనులే – కొండంత మనిషిని సైతం అల్పునిగా చేస్తాయి అని మిత్రుడికి హితోపదేశం చేస్తున్నాడో నాగరికుడు.



వివరణ:

'మనిషి చేయవలసిందేమిటి? – ధర్మంగా ఉండడం, కర్తవ్యాన్ని నిర్వహించడం. చేయకూడనివేమిటి? – పరస్త్రీలను, పరులధనాన్ని అపేక్షించడం, హింసకు పాల్పడటం. తమ్ముని కుమారులకు ఇవ్వవలసిన రాజ్యభాగాన్ని ఇవ్వకపోవడం, దుర్యోధనుణ్ణి నియంత్రించకపోవడం వల్ల ధృతరాష్ట్రుడు ఎంతగా దిగజారాడో మనకు తెలిసిందే. పరస్త్రీని ఆశించిన రావణుడి సంగతీ మనకు తెలుసు. అహల్యను ఆశించి శాపగ్రస్తుడైన ఇంద్రుని వృత్తాంతమూ మనకు తెలుసు. అలాగే చేయకూడని పనులు చేయడం వల్ల సమాజంలో అత్యున్నత శిఖరాలపై ఉన్న పెద్దలు కూడా అధఃపాతాళానికి పడిపోయిన విషయం మనకు తెలియంది కాదు.

ప్రాకృతమూలం:

లహుఅంతిలహుం పురిసంపవ్వ అమేత్తం పిదోవి కజ్జాఇం ।
ణివ్వరణ మణివ్వూఢే జం అణివ్వరణమ్॥ (గోవిందస్వామి) (3–55)

సంస్కృతచ్ఛాయ:

లఘుయతో లఘు పురుషం పర్వత మాత్రమపిద్వే అపికార్యే।
నిర్వరణ మనిర్వ్యూఢే నిర్వ్యూఢేయచ్చ నిర్వరణమ్॥

సుజనమైత్రి - శిలాక్షరం

ఆ.వె॥ **దుష్టజనులమైత్రి, తోయమ్ముపై వ్రాత**
పగిది, అనయము క్షణ భంగురమ్ము
శిష్ట జనులమైత్రి శిలపైన చెక్కిన
అక్షరమ్మువోలె, అక్షరమ్ము ॥

– సుజనులతో మైత్రి రాతిమీద వ్రాతలాగా శాశ్వతంగానూ, దుర్జనులతో మైత్రి నీటిమీది వ్రాతలాగా క్షణికంగానూ ఉంటాయని మరో హితోపదేశం.

వివరణ:



మైత్రికి కృష్ణార్జులనులనే చెపుతారు. వారిమైత్రి లోకోప కారకమైంది. మానవాళికి భగవద్గీతను ప్రసాదించింది. అందువల్ల గొప్పవారితో స్నేహం శిలాక్షరంగా శాశ్వతంగా నిలచి ఉంటుంది. ఆ మాటకొస్తే కర్ణ, దుర్యోధనుల మధ్య స్నేహం కూడా అంత తేలికైందేమీ కాదు. కానీ వారి స్నేహం దుష్టచతుష్టయం. (దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని) లో భాగంగా లోకంలో ప్రచారం పొందింది. దుష్టులతో స్నేహం స్వార్థంతో కూడి ఉంటుంది. ఉదాహరణకు కర్ణ, దుర్యోధనుల స్నేహంలో తనకు ఆర్థికంగా, రాజకీయంగా అండగా ఉంటాడని కర్ణునికి దుర్యోధనునిపై నమ్మకం. అర్జునుని నిలువరించే యోధుడు కర్ణుడేనని దుర్యోధనుడికి నమ్మం. అందువల్ల వారి స్నేహంలో స్వార్థం పాలే ఎక్కువ. అందుకని మంచివాళ్ళతో స్నేహమే మంచిదని గాథాకారుని తీర్పు.

ప్రాకృతమూలం:

కీరంతీవ్వి అ ణాసఇ ఉఅఏరేహవ్వ ఖలఅణే మేత్తీ।
సా ఉణ సుఅణమ్మి కఆ అణహాపాహాణరేహవ్వ॥ (సరళుడు) (3-72)

సంస్కృతచ్ఛాయ:

క్రియమాణైవ నశ్యత్యుదకే రేఖేవ ఖలజనేమైత్రీ।
సాపునః సుజనేకృతా అనఘా పాషాణరేఖేవ ॥

మళ్ళీ ప్రయాణమా!

తే.గీ॥ **నీదు తలపులతో నన్ను నేను మరువ**
చిక్కుబడినట్టి జడయైన చక్కబడక
మునుపె, కఠినాత్మ! పరదేశమునకు నేగ
యోచనంబు మదిని, సేయుచుంటివేల?

– "ఓయీ! కఠినాత్ముడా! నిన్నగాక మొన్ననే కదా! దూరదేశాన్నుంచి వచ్చావు. సరియైన పోషణ లేక మెలిదిరిగి చిక్కుబడిన శిరోజాలు ఇంకా జడకు కూడా రావడం లేదు. అప్పుడే మళ్ళీ ప్రయాణమంటూ తయారవుతున్నావేమిటి?'' అంటూ నాయిక నిష్ఠూరాలాడుతోంది.



వివరణ:

తరచూ ప్రయాణాలంటూ ఊళ్ళు పట్టుకు తిరిగేవాళ్ళ ఇళ్ళల్లో కనిపించే దృశ్యం ఈ గాథ. ఎప్పుడూ ఇంటిపట్టున ఉండకుండా క్యాంపులంటూ తిరిగేవాళ్ళను భార్యలిలాగే నిలదీస్తారు మరి. కాని పాపం ఆ పతిదేవుని అవస్థనూ గమనించాలి. ఊళ్ళు తిరిగే ఉద్యోగమైతే అతడేం చేయగలడు. ఉన్నంతలో అవగాహనతో సర్దుకుపోవడమే సరైన మార్గం.

ప్రాకృతమూలం:

అవ్వో దుక్కర ఆర అపుణో వితంతి కరేసిగమణస్య।
అజ్జ విణ హెూంతిసరలావేణిఅతరంగిణో చి ఉరా॥ (సరళుదు) (3-73)

సంస్కృతచ్ఛాయ:

అహెూ! దుష్కరకారక పునరపి చింతాం కరోషి గమనస్య।
అద్యపి నభవంతి సరలా వేణ్యాస్తరంగిణా శ్చికురాః॥

తరుణి రోదన - ప్రియుని భావన

తే.గీ॥ జవ్వని నయనముల నుండి జాలువారు
బాష్పములఁజూడ, చెక్కిటన్ ప్రతిఫలించు
చంద్రబింబములోని మచ్చను మరి మరి
క్షాళనము సేయు రీతిగా కానిపించు॥

– "ఆమె కన్నుల నుండి జాలువారే బాష్పధారలు, అద్దముల వంటి ఆమె చెక్కిళ్ళపై ప్రతిఫలించే చంద్రబింబంలోని మచ్చను కడుగుతూన్నట్టుగా ఉంది" అని రోషంతో బాష్పపూరితనయనాలతో నున్న నాయికను జూచి చమత్కరిస్తున్నాడు నాయకుడు.



వివరణ:

ఇది గొప్ప అందమైన ఊహ. నాయిక రోదనవేళ - నాయకుడి భావనాహేల. ఆమె కన్నుల నుండి ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. అవి ఆమె చెక్కిళ్ళ మీదుగా జారుతున్నాయి. ఆ జారుతున్న కన్నీళ్ళు ఆమె చెంపపై ప్రతిఫలించే చంద్రునిలోని మచ్చను కడుగుతున్నట్టుగా భావిస్తున్నాడు నాయకుడు. అంతగా ఏడుస్తున్న నాయికను ఓదార్చకుండా, చంద్రుడు, మచ్చ అంటూ భావనాలోకంలో విహరిస్తున్న నాయకుణ్ణి ఎలా అర్థం చేసుకోవాలి. సందర్భశుద్ధి లేని భావనాబలం శోభనివ్వదు.

ప్రాకృతమూలం:

ధు అఇవ్వ మఅ కలంకం కవోలపడి అస్సమాణిణీ ఉ అహ।
అణవర అవాహ జలభరి అణ అణ కలసేహిం చందస్స॥ (విషమరాజు) (3-80)

సంస్కృతచ్ఛాయ:

ధావతీవ మృగకలంకం కపోలపతితస్య మానినీ పశ్యత ।
అనవరత బాష్ప జలభృత నయనకలశాభ్యాం చంద్రస్య॥

సుజనుడు - వినయశీలుడు

తే.గీ॥ **ఫలభరములైన తరువులు వంగినటుల**
వినయముగనుండు, సుజనుండు ధనము గలుగ
కలిమిపోయినన్ తలఎత్తి నిలచియుండు
ఫలరహితవేళ వృక్షాగ్ర భాగమట్లు॥

– ఇది మరొక నీతిగాథ – సజ్జనులు ధనం కలిగినప్పుడు ఫలభరితములైన వృక్షాల్లాగా వినయంగా వంగి ఉంటారు. అదే ధనం లేనప్పుడు దైన్యం పొందకుండా, ధైర్యంగా పండ్లులేని చెట్టులాగా నిటారుగా నిలచి ఉంటారు.



వివరణ:

చెడ్డవాడు తన చెడ్డపనులకు కారణాలను అన్వేషించినట్లు, మంచివాడు తన మంచితనానికి కారణాలను వెతుక్కోడు. ఏ పరిస్థితుల్లో నయినా మంచివాడు ఉన్నతంగానే ఆలోచిస్తాడు. ఉత్తమంగానే ప్రవర్తిస్తాడు అని ఈ గాథ తెలుపుతుంది. ఉత్తముడు డబ్బున్నప్పుడు మనుపటికన్నా వినయంగా సత్కార్యాలకు డబ్బును వెచ్చిస్తూ ఫలవృక్షంలాగా ప్రవర్తిస్తాడట. అదే డబ్బుల్లేనప్పుడు కూడా ఎవరినీ దేబిరించకుండా, ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిచ్చి సంతృప్తిగా జీవిస్తాడట. "ధనమును, విద్యయువంశం / బును, దుర్మతులకు మదం బొనరించును, స / జ్జనులైనవారి కడకువ / యును, వినయము నివియ తెచ్చునుర్వీనాథా!" అంటాడు విదురుడు మహాభారతంలో. అందువల్ల ధనం కన్నా గుణం ప్రధానం.

ప్రాకృతమూలం:

ఫలసంపత్తీ అ సమోణ ఆఇ తుంగాఇ ఫలవిపత్తి ఏ ।
హిఅఆఇ సుపురిసాణం మహాతరూణంవ సిహరాఇం॥ (కువలయుడు) (3–82)

సంస్కృతచ్ఛాయ:

ఫల సంపత్యా సమవతానితుంగాని ఫల విపత్యా।
హృదయాని సుపురుషాణాం మహాతరూణామివ శిఖరాణి॥

మానధనుని మనము హిమనగమే!

ఆ.వె॥ **అరుణుడస్తమించు తరుణమందున గూడ**

ఊర్ధ్వ గతిని కాంతి నొసగుచుండు

అటులె కష్టమందు నైన, మానధనుని

హృదయసీమ తుంగహిమనగంబు॥

– 'సూర్యుడు అస్తాద్రిని చేరుతున్న సమయంలో కూడా కాంతిని పైకే విరజిమ్ముతూ ఉంటాడు. అట్లే మానధనుడైనవాడు కష్టసమయంలో కూడా ఉన్నతంగానే ఉంటాడని' నాయకుని గొప్పతనాన్ని నాయికతో చెపుతోంది దూతిక.



వివరణ:

అనేకమంది వీరయోధుల గాథలు, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల కథలు, ఈ గాథను చదువుతూంటే గుర్తుకురావడం లేదూ! 'వందేమాతం!' అంటూ ఉరికంబాన్నెక్కిన భరతమాత ముద్దుబిడ్డలు, లాఠీదెబ్బలు తింటూ కూడా త్రివర్ణపతాకను క్రిందపడనీయని ధీరోదాత్తులు ఈ గాథకు ఉదాహరణలే! కష్టాలను సహించే ఈ లక్షణాన్నే 'దమము' అంటారు. కరిగిపోతూ కూడా కొవ్వొత్తి వెలుగునిస్తుంది. మంచిగంధపు చెక్క కాలుతూ కూడా సుగంధాన్నే వెదజల్లుతుంది. అలాగే ఉత్తములు కష్టాల్లో కూడా పరోపకారానికే ప్రాధాన్యతనిస్తారు.

ప్రాకృతమూలం:

తుంగోచ్చిఅ హోఇ మణో మణంసిణో అంతిమాసు విదసాసు ।
అత్థమణమ్మి విరఇణో కిరణా ఉద్ధం చి అ పురంతి॥ (మాతృరాజు) (3–84)

సంస్కృతచ్ఛాయ:

తుంగమేవ భవతి మనో మనస్వినాం ఉతి మాస్వపి దశాసు।
అస్తమనే ఉపి రవేః కిరణా ఊర్ధ్వమేవ స్ఫురంతి॥

నన్ను పట్టుకో...

తే.గీ॥ **క్షురకునింగాంచి, కొమరుండు పరుగులెత్త**
పంతమూనియు వానిని పట్టితేగ
కొప్పుముడివీడి రొప్పుచు, కొంగుజార
చూడు! మాచేడె పరుగిడుచున్నదదిగొ॥

– ఇదో హాస్యరస సన్నివేశం. పిల్లలు సహజంగా తలంటికీ, తలపనికీ ఒక పట్టాన రారు. వారిని తల్లులో, తండ్రులో పట్టుకొచ్చి బలవంతంగా క్షురకునిముందు కూర్చోబెడుతూ ఉంటారు. ఈ గాథలో ఒక పిల్లవాడు క్షురకుని ముందు కూర్చోవడానికి భయపడి పరిగెత్తుతూ ఉంటే, వాడి వెనక అతని తల్లి 'కొప్పువీడినా, కొంగు జారినా పట్టించుకోకుండా పరుగెడుతోంది చూడు' అని ఇద్దరు మగువలు చెప్పుకుంటున్నారు.



వివరణ:

నాడైనా, నేడైనా పిల్లలు పిల్లలే! 'నయమున పాలుంద్రావరు' అనేది ఉండనే ఉంది కదా! నాటి దృశ్యం అదైతే, 'స్కూలుకు పోనని మారం చేసే కొడుకును బుజ్జగిస్తూ, బ్రతిమలాడుతున్న తల్లి', 'సెల్‌ఫోన్ కోసం, టీ.వి. రిమోట్ కోసం అమితంగా అల్లరి చేసే చిట్టితల్లి' – ఇవే నేటి దృశ్యాలు.

ప్రాకృతమూలం:

ధావఇ విఅలి అధమ్మిల్ల సిచ అసంజమణవావడ కరగ్గా!
చందిలభ అవివలా అంతడింభ పరిమగ్గిణీ ఘరిణీ॥ (మాతృరాజు) (3–91)

సంస్కృతచ్ఛాయ:

ధావతి విగలిత ధమ్మిల్ల సిచయ సంయమన వ్యాపృతకరాగ్రా।
చందిలభయవిపలాయ మానడింభపరిమార్గిణీగృహిణీ॥

లెక్కపెట్టడం ఎలా?

ఆ.వె॥ **కాళ్ళు చేతులకును గల్గిన వ్రేళ్ళతో**
నీదురాక కొరకు నెంచుచుంటి
ఇంక వేనితోడ నికపైన లెక్కింతు
ననియు, పొరలిపొరలి వనిత ఏడ్చె॥

'నీవెప్పుడొస్తావా! అని చేతులకు కాళ్ళకు గలిగిన వ్రేళ్ళతో లెక్కిస్తూ వచ్చాను. ఈ రోజుతో అవి కూడా అయిపోయాయి. ఇంక వేటితో లెక్కించాలి!' ఇకనైనా తొందరగా రమ్మని ప్రవాసంలో ఉన్న ప్రియునికి దూత ద్వారా సందేశం పంపిస్తోంది నాయిక ఈ గాథలో.



వివరణ:

ప్రయాణ, ప్రసారసాధనాలు లేనిరోజుల్లో, ఎప్పుడు వస్తాడో తెలియని మగని కోసం కాళ్ళు చేతులకున్న వ్రేళ్ళను లెక్కపెట్టుకోవడం కాక మరేంచేయగలరు మగువలు. సందేశాలు పంపడానికి వీరేమీ సంపన్నులు కాదే! పరమసామాన్యులు. అందువల్ల అశక్తురాలైన ఆ వనిత చేసేదేమీ లేక ఏడ్చిందని చెపుతున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం:

హత్థేసు అపాఏసు అ అంగులి గణణాఇ అఇగఆది అహా।
ఏ ణ్హిం ఉణకేణ గణిజ్జ ఉత్తి భణేఉ రూ అ ఇ ముద్ధా॥ (పాలితుడు) (4-7)

సంస్కృతచ్ఛాయ:

హస్తయోశ్చ పాదయోశ్చాంగులి గణనయాతిగతా దివసాః।
ఇదానీం పునఃకేన గణ్యతామితి భణిత్వా రోదితిముగ్ధా॥

బుద్ధంశరణం గచ్ఛామి

తే.గీ॥ **శుకముఖాగ్రభాగంబుల సొంపు మీర**
పుడమిరాలిన మోదుగు పూవులవిగొ!
బుద్ధదేవు పదములకు మ్రొక్కుచున్న
భిక్షు సంఘములట్టుల వెలయుచుండె ॥

– "బుద్ధదేవుని పాదాలకు మ్రొక్కుతూ ఉన్న కాషాయాంబరధారులైన బౌద్ధ భిక్షువుల్లాగా, చెట్టునుంచి రాలిపరచుకొని ఉన్న చిలకముక్కు రంగులోని ఎఱ్ఱని మోదుగుపూలు ప్రకాశిస్తూ ఉన్నాయి చూడు!" అని ప్రియునితో అంటోంది ప్రేయసి.



వివరణ:

క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటికి భారతీయ సమాజంలో బౌద్ధమత విస్తృతిని ఈ గాథ సూచిస్తుంది. ఎఱ్ఱని కాషాయ వస్త్రాలు ధరించడం, నుదుటిపై గుండ్రంగా ఎఱ్ఱని కుంకుమ బొట్టుపెట్టుకోవడం నున్నని గుండుతో ఉండడం – ఇవి బౌద్ధ భిక్షువుల లక్షణాలు. ఎఱ్ఱని మోదుగుపూలను బౌద్ధ భిక్షువులతో పోల్చడం సహజసుందరం. మోదుగుపూలను మళ్ళీ చిలుకముక్కులతో పోల్చడం మరింత సుందరం. ఉపమానానికి ఉపమానం వేయడం, ఈ గాథలోని చమత్కారం.

ప్రాకృతమూలం:

కీర ముహి సచ్ఛహేహి రేహ ఇ వసుహా పలాస కుసుమేహిమ్।
బుద్ధస్స చలణ వందణపడి ఏహివ బిక్ఖుసంఘేహిం॥ (సూరనుడు) (4–8)

సంస్కృతచ్ఛాయ:

కీరముఖ సదృక్షైః రాజతే వసుధా పలాశకుసుమైః।
బుద్ధస్య చరణవందనపతి తైరివ భిక్షు సంఘైః ॥

గంధం పన్నీరైంది

తే.గీ॥ **గంధ చూర్ణము చేదాల్చి, కలికి యొకతె**
హోలియని వానిపైజల్ల నురుకుచుండ
చిత్తహరుజూచి, చేతులు చెమ్మగిల్ల
గంధపంకమున్ ప్రియునిపై కలయజల్లె॥

– అది హోళీసరంభం. ప్రియునిపై చల్లడానికని గంధపు పొడిని చేతిలో తీసుకొని బయలుదేరింది. తీరా ప్రియుడు కనిపించేనరికి సిగ్గుతో చేతులు చెమ్మగిల్లాయి. గంధపుపొడి, గంధపుపూతగా మారింది. దానినే కళ్ళు మూసుకొని ఆమె ప్రియునిపై చల్లింది.



వివరణ:

అతిశయోక్తికి అంతులేదనడానికి ఈ గాథ ఉదాహరణ. గంధపుపొడి నాయిక చేతుల్లోని చెమటతో తడిసి, ప్రియునిమీద చల్లేంత బురదగా మారిందని చెప్పడం అతిశయోక్తి కాక మరేమిటి. నాయిక మనస్సులో జనించిన వలపుతలపు చిరుచెమటకు కారణమవడం స్వభావసిద్ధం. అది గంధపుపంకంగా మారడం ధ్వని.

ప్రాకృతమూలం:

ఘేత్తూణ చుణ్ణ ముట్ఠిం హరిసూససిఆఏ వేపమాణా ఏ
భిసిణేమిత్తి పి అఅమం హత్థే గంధోదఅం జాఅం ॥ (కాంతఫరుడు) (4–12)

సంస్కృతచ్ఛాయ:

గృహీత్వా చూర్ణముష్టిం హర్షోత్సుకితాయా వేపమానాయాః ।
అవకిరామీతి ప్రియతమా హస్తే గంధోదకం జాతం॥

దాచడం ఎలా?

తే.గీ॥ **మనసుదోచిన చెలికాడు కనపడంగ**
చేతులన్ నాదుకనుల మూసితిని గాని
పూచిన కదంబవృక్షంబు వోలెనున్న
తనువు పైగల పులకల దాచగలనె॥

– "ఏమిటో! వాడు కనపడగానే నాకు ఎక్కడ లేని సిగ్గూ ఆవరిస్తుంది. అప్రయత్నంగా రెండు చేతులతో కన్నులు మూసుకుంటాను. కళ్ళయితే మూసుకున్నాను గానీ, పూచిన కడిమి చెట్టులాగా తనువంతా ఉన్న పులకలనెట్లు దాచగలనే చెలీ!" అని దూతికతో నాయిక చెపుతోంది.



వివరణ:

మనసులో కలిగిన భావాలు ముఖంపై ప్రతిఫలిస్తాయి. తనువంతా ఆవరిస్తాయి. సంతోషము, దుఃఖము, ఉత్సాహము, ఉద్వేగము దాస్తే దాగేవి కావు. ఎంత దాచాలనుకున్నా దుఃఖంలో ఉన్నవాడినవ్వు వెఱ్ఱి నవ్వే అవుతుంది. ఎంత గంభీర వదనుడైనా సంతోషంతో ఉంటే ముఖం వెలిగిపోతూంటుంది. అందువల్ల అంతరంగం దాస్తే దాగేది కాదు. ఈ గాథలోని భావం తదనంతరకాలంలో అమరుకుడనే సంస్కృత కవి కావ్యంలోనూ కనిపిస్తుంది.

ప్రాకృతమూలం:

అచ్ఛీఇతా థ ఇస్సం దోహి విహత్థేహి వి తస్సిం దిట్ఠే।
అంగం కలంబకుసుమం వపుల ఇఅం కహణు ఢక్కిస్సం॥ (సస్సీహుదు) (4–14)

సంస్కృతచ్ఛాయ:

అక్షిణీ తావత్ స్థగయిష్యామి ద్వాభ్యామపి హస్తాభ్యాం తస్మిన్‌దృష్టే।
అంగం కదంబ కుసుమమివపులకితం కథంనుచ్ఛాదయిష్యామి॥

నిధికోసం వేట

తే.గీ॥ **కలిసికొనెడు చోటు కనరాక, మదిలోన**
కలతచెందినట్టి నెలత చూడు।
వెదకుచుండెనన్ని వెదురు పొదలలోన
నిధులమూట కొరకు నెమకినట్లు॥

– ఒక ప్రేమికుల జంట ఫలానాచోట కలుసుకుందామనుకున్నారు. ఆమె వచ్చి, సంకేతస్థలాన్ని మరచిపోయి ప్రియునికోసం అన్ని వెదురు పొదల్లోనూ వెదకుతోందట. ఆమె వెతుకులాట చూస్తుంటే ఏదో పోగొట్టుకున్న నిధి కోసం వెతుకుతున్నట్టుగా ఉందని చమత్కరిస్తున్నాడు గాథాకారుడు.



వివరణ:

వెతుక్కునేవాడికి కలవరంగా ఉన్నా చూచేవాడికి మాత్రం ఆ ఆరాటం సరదాగా ఉంటుంది. నేటి పార్కుల్లో ఈ దృశ్యం సర్వసాధారణం. ఈ చాటుమాట ఆరాటాలు చేటు చేస్తాయనేది మాత్రం చేదు నిజం.

ప్రాకృతమూలం:

అహసా తహిం తహింవ్వి అ వాణీరవణమ్మి చుక్క సంకే ఆ
తుహదంసణం విమగ్గఇ పబ్భట్ఠణ ఠాణంవ ॥

సంస్కృతమూలం:

అథ సా తత్ర తత్రైవ వానీరవనే విస్మృత సంకేతా
తవ దర్శనం విమార్గతి ప్రభ్రష్టనిధానస్థాన మివ ॥

సజ్జనుడు సజ్జనుడే!

ఆ.వె॥ గ్రహణవేళనైన రజనీశుబింబమ్ము
అమృతకిరణములనె అందజేయు
అటులె సజ్జనుండు అమితకష్టముననుు
ప్రల్లదంబు లెపుడు పలుకబోడు॥

– 'రాహువు నోటబడిన గ్రహణ సమయంలో కూడా చంద్రుడు చల్లని అమృతమయమైన కిరణాలనే వెలువరిస్తాడు. అట్లే ఎన్నికష్టాల్లో ఉన్నా, ఎంత కోపం వచ్చినా మంచివాడు చెడ్డమాటలు మాట్లాడడు' అని ఈ గాథకు అర్థం.

వివరణ:



అసలు వరుషంగా మాట్లాడడమనేది సప్తవ్యసనాలలో ఒకటిగా 'వాక్పారుష్యము' అనే రూపంలో పరిగణించబడింది. కఠినంగా మాట్లాడడం 'పాపం' అని అనంతామాత్యుని భోజరాజీయం కూడా తెలుపుతుంది. ఒంటికి తగిలిన గాయం కొంతకాలానికి మాయమౌతుందికానీ, సూటిపోటి మాటల వల్ల మనసుకు గాయమైతే మాత్రం మానటం కష్టం. అవి ఎప్పుడూ ములుకుల్లా గుచ్చుతూనే ఉంటాయి. అందువల్ల మాట్లాడేటప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించి మాట్లాడడం మంచిది. 'పూర్వభాషీచరాఘవ' అని శ్రీరామునికీ, మధురభాషణుడిగా హనుమంతుడికీ లోకంలో ప్రఖ్యాతి ఉంది.

ప్రాకృతమూలం:

దృఢరోసకలు సిఅస్స విసు అణస్సముహాహి విప్పి అంకంత్తో
రాహుముహమ్మి విసిసిణో కిరణా అమఅం విఅ ముఅంతి॥ (అవంతివమ్మ) (4–19)

సంస్కృతచ్ఛాయ:

దృఢరోషకలుషిత స్యాపి సుజనస్య ముఖాదప్రియం కుతః
రాహుముఖే ఽ పి శశినః కిరణా అమృతమేవ ముంచంతి॥

రహస్యం శాశ్వతం

ఆ.వె.॥ **మంచివాని యొక్క మనసులోనున్నట్టి**

ఏరహస్యములును, నెన్నడైన

వెలికిరావు, తుదకు కలహంబుగల్గినన్

కాలిపోవునవియు, కట్టెతోడ ॥

– ఇది ఒక నీతిగాథ. "సజ్జనుడైన వాడితో స్నేహం చేస్తూ చెప్పుకున్న ఎలాంటి పరమరహస్యాలయినా వానితోనే నశిస్తాయిగానీ, ఎన్నడూ బయటకురావు తుదకు కలహం కలిగిన సందర్భంలో కూడా!' అని నాయకుడు చెపుతున్నాడు.



వివరణ:

ఏదైనా రహస్యం స్నేహితులు మనతో చెప్పుకున్నారంటే అది మన మీద నమ్మకంతోనే. అలా చెప్పుకోవడం వల్ల వారి మనసులోని బాధకొంత తగ్గి తేలికపడుతుందని భావన. అలా తెలిసిన రహస్యాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పకూడదు. అందుకే మంచిస్నేహితుడు 'మనలోని మంచిని పదిమంది ముందూ చెపుతాడు. చెడును మాత్రం చెవిలో చెపుతాడు' అని ఆర్యోక్తి. రహస్య గోపనం కూడా స్నేహానికి అతిముఖ్యమైన అర్హత.

ప్రాకృతమూలం:

కలహంతరే వి అవిణగ్గ ఆఇం హి అఅమ్మి జరమువగఆ ఇం।

సుఅణకఆఇరహస్సాఇం డహఇ ఆఉక్ఖఏ అగ్గీ॥ (హాలుడు) (4–21)

సంస్కృతచ్ఛాయ:

కలహంతరే ఽ ప్యవినిర్గతాని హృదయే జరాముపగతాని।

సుజన శ్రుతాని రహస్యాని దహత్యాయుఃక్షయే ఽ గ్నిః॥

తెలిసిందిగా!

తే.గీ॥ **కనులని యొకండు కలువలేయని యొకండు**
పలుక దొడగిరి హోళికాపర్వమందు
ముదిత ప్రియుగాంచి కన్నులు మూసికొనగ
తెలిసెగా! చెవుల!గలవి కలువలనియు॥

– అది కాముని పున్నమి హోళీ మహోత్సవం. ఒక సౌందర్యరాశి చెవులకు కలువపూవుల నలంకరించుకొని రాజవీధిలో వయ్యారంగా నడుచుకుంటూ వెళుతోంది. చూస్తున్న వాళ్ళెవ్వరూ ఆమె కనులకూ, కలువలకూ భేదాన్ని గుర్తించలేకపోయారు. కానీ ఆమెకు తన ప్రియుడు ఎదురురాగానే అప్రయత్నంగా ఆమె సిగ్గుతో కనులు మూసుకొంది. అప్పుడందరికీ అర్థమయ్యిందట. 'ఆమె చెవులకు కలవపూవులనలంకరించుకుందని' ఆమె కన్నులు కలువ పూవులంత అందంగా, కన్నులేవో, కలువలేవో తెలియలేనంత సుందరంగా ఉన్నాయని గాథాకారుడి చమత్కారం.



ప్రాకృతమూలం:

పి అదంసణ సుహర సముఉలి ఆఇఁజఇ సేణ హెూంతిఆ అణా ఇం
తాకేణ కణ్ణర ఇఅం లక్ఖిజ్జఇ కువలఅం తిస్సా॥ (వసంతసేనుడు) (4–23)

సంస్కృతచ్ఛాయ:

ప్రియదర్శన సుఖరసముకులితేయది తస్యాన భవతో నయనే
తదా కేన కర్ణరచితం లక్ష్యతే కువలయం తస్యాః॥

వెట్టివాని విలాసం

ఆ.వె॥ **లేతమావి పూత ప్రియముగా సిగదాల్చి**
వెట్టి వాడొకండు వెడలుచుండ
ముద్దుసఖియను గొనిపోవు చుండెననియు
వాని వెంబడించె, భ్రమరసమితి॥

– ఒక పామరుడు లేతమామిడిపూల గుత్తిని గోటితో గిల్లి తలలో ముడుచుకొనిపోతూ ఉండగా, తమ ఇష్టసఖిని వాడు బంధించి తీసుకొని వెళు తున్నాడనుకొని భ్రమపడి గండుతుమ్మెదలు వానిని వెంబడించాయట. మన పూర్వీకుల్లో పురుషులు కూడా పూలను ధరించే సంప్రదాయం ఉందని మనకు ఈ గాథవల్ల తెలుస్తోంది.



వివరణ:

సాధారణంగా మల్లెలు, చేమంతులు, కలువలు వంటివాటినే ఆడవాళ్ళుగానీ, మగవాళ్ళు గానీ (నాడు) ధరిస్తారు. ఎవరో వెట్టిబాగులవాడు తప్ప మామిడిపూతను ధరించడం ఉండదు. అలా ధరించిన వాడివెంట తుమ్మదలు పడటంలో ఆశ్చర్యం లేదు. 'తిక్కలాడు తిరుణాలకుపోతే గుడిమెట్లు ఎక్కనూ, దిగనే సరిపోయిందని' సామెత. అట్లాంటివాడి గాథే ఇది.

ప్రాకృతమూలం:

ణక్ఖక్ఖుడిఅం సహోఆరమంజరిం పామరస్స సీసమ్మి॥
బందిమ్మివ హీరంతీం భమరజు ఆణా అణుసరంతి॥ (మహారాయుడు) (4-31)

సంస్కృతచ్ఛాయ:

నఖోత్ఖండితాం సహకార మంజరీం పామరస్య శీర్షే।
బందీమివహ్రియమాణాం భ్రమరయువానోఽనుసరంతి।

కమలము-సూర్యుడు

ఆ.వె॥ వానిమీద నాకు, వలపు లేదందువు
వాని పేరు చెవిని బడినయంత
అర్కుని బొడగన్న అంభోరుహమువోలె
నివ్వటిల్లునేమి? నీదు ముఖము॥

– "వాడి మీద నాకు అసలు ప్రేమే లేదంటావే, గానీ వాడి పేరుచెప్తే చాలు, సూర్యుణ్ణి చూచిన కమలంలా నీ ముఖం వికసిస్తోంది. ఎందుచేతనే చెలీ?" అని నాయికను ప్రశ్నిస్తోంది సఖి.



వివరణ:

'ఔనంటే కాదనిలే / కాదంటే ఔననిలే / ఆడువారి మాటలకు అర్థాలే వేరులే' అంటాడో సినీకవి. అలా నాకు ప్రేమే లేదని బుకాయిస్తున్న నాయికను నిలదీస్తున్న దోస్తుల గాథే ఇది. 'వాడి మీద ప్రేమేలేకుంటే వాణ్ణి చూడగానే నీ ముఖంలో ఆ వెంరుపేమిటి?' అని నూటిగా ప్రశ్నిస్తున్నారువారు.

ప్రాకృతమూలం:

జ ఇ సోణ వల్ల హెూవ్వి అగోత్తగ్గ హణేణ తస్ససహికీస ।
హోయి ముహంతే రవి అరఫం సవ్విసదంవ తామరసమ్॥ (సుశీలుడు) (4-43)

సంస్కృతచ్ఛాయ:

యదిసనవల్లభ ఏవ గోత్రగ్రహణేన తస్యసఖి కిమితి।
భవతి ముఖం తవ రవికరస్పర్శ వికసితమివ తామరసమ్॥

ఇప్పుడు బాధపడితే ఏంలాభం?

ఆ.వె॥ **చెడ్డవారలైన చేడెల ముందర**
పురుషరత్నమంచు పొగడుకొంటి
నిన్ను, దూరమైతి నీప్రేమ ఝరినుండి
ఇపుడుతీరి వగవ, నేమిఫలము?

– "సత్ప్రవర్తనలేని ఆడవాళ్ళ ముందు నా భర్తను అదేపనిగా పొగుడుకున్నాను. వాళ్ళల్లో ఎవరో ఒకరు వాణ్ణి వల్లో వేసుకుని నాకు దూరం చేశారు. అంతా చేతులారా నేనే చేసుకున్నాను. ఇప్పుడు బాధపడి ఉపయోగమేముంది?" అని పతికి దూరమైన ఒక స్త్రీ అనుకొంటోంది.



వివరణ:

మగని లేనిపోని గొప్పల్ని అమ్మలక్కల ముందు చాటేవాళ్ళకు గుణపాఠంలాంటి గాథ ఇది. మగని జీతానికి సున్నా చేర్చి చెప్పడం, లేని కార్లను సృష్టించడం, కొంతమంది ఆడవాళ్ళు చేసేపని. ఇది వారి కొంప ముంచిన సందర్భాలు కోకొల్లలు. 'ఒకామె మా ఆయన ఐదు వేల రూపాయల చీరెను తన పలుకుబడితో రెండు వందలకే తెచ్చాడన్నదనుకోండి, విన్నవాళ్ళు మాకూ్కడా ఒకటి తెచ్చిపెట్టమన్నారనుకోండి. ఈమెకు గొంతులో పచ్చివెలక్కాయయే!' అందువల్ల ఇంటిగుట్టును పదిమందిలో చాటకపోవడం మంచిది.

ప్రాకృతమూలం:

వణ్ణం తీహిఀతుహగుణే బహుసో అమ్హేఁభిచ్చఈపుర ఓ।
బాలఅ సఅమేఅ కఓసి దుల్లహో కస్స కుప్పామో॥ (సంకరసత్తి) (4-50)

సంస్కృతచ్ఛాయ:

వర్ణయంతీ భిస్తవ గుణాన్ బహుశోఽస్మాభి రసతీపురతః।
బాలక స్వయమేవ కృతోసి దుర్లభః కస్మై కుప్యామః॥

జాగ్రత్త! అబ్బాయ్!

ఆ.వె॥ నీలకంఠుకొరకు నీరమ్ములే చాలు
వెదకుచుంటి వేమి? విరులకొరకు
ఎంతవారినైన, ఈగౌతమీతటుల్
చెరుపగలవటంద్రు, చిన్నవాడ!



– ఒక పెద్దావిడకు గోదావరి గట్టుమీద రోజూ ఒక నవయువకుడు, విద్యావంతుడు కనపడుతూ ఉండేవాడు. 'ఆమె ఏమిటి వెతుకుతున్నావ్? అని అడిగేది. 'దేవుడి పూజ కొరకు పూలు కోస్తున్నాను' అనేవాడతను. ఆ పెద్దావిడకు స్పష్టాస్పష్టంగా ఈ యువకుడు ప్రేమదారిలో ఉన్నాడేమో! అనిపించింది. అందుకే ఇలా అంది "అబ్బాయి! దేవుడైతే నీళ్ళతో కూడా తృప్తిపడతారంటారు కదా! అదే పనిగా పూల కోసం తిరుగకు, ఏ పూపొదరింట్లో ఏముంటుందో! ఎంత మంచివారినైనా ఈ గోదావరిగట్లు అంతకుదురుగా ఉండనియ్యవంటారు! జాగ్రత్త సుమా!" అని హెచ్చరించింది.

ప్రాకృతమూలం:

మా వచ్చ పుప్ఫలా విరదేవా ఉఅ అంజ లీహి cతూసంతి
గోఆఅరీఅ పుత్తఅ సీలుమ్మూలా ఇ c కూలాఇం॥ (రొందణుడు) 4–55)

సంస్కృతచ్ఛాయ:

మా వ్రజ పుష్పలవనశీల దేవా ఉదకాంజలిభిస్తుష్యంతి
గోదావర్యాః పుత్రకశీలోన్మూలాని కూలాని॥

ఆమె ముఖం - వింతపద్మం

తే.గీ॥ **పూర్ణశశి మించు పరిమళపూర్ణమైన**
ఆమె ముఖపద్మ మొకవిచిత్రాబ్జమనియు
భ్రమసి ఆసౌరభంబుల బడయనెంచి
గుములు గుములుగ మూగెను భ్రమరసమితి॥

– "చంద్రబింబాన్ని మించిన అందం గల ఆమె ముఖం పరిమళభరితమైన ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో ఒక వింత పద్మంలా భాసిస్తోంది. ఆ పరిమళాలను ఆస్వాదించడానికి తుమ్మెదలు గుంపులు గుంపులుగా ఆమె ముఖపద్మాన్ని చుట్టుముట్టాయి' అని నాయకి మీద నాయకునికి మరులు పెంచడానికి దూతిక ఉత్ప్రేక్షించి చెప్తోంది.



వివరణ:

సహజంగా అందమైన ఆడువారి ముఖాన్ని పద్మంతోనో, చంద్రబింబంతోనో పోల్చడం ఆనవాయితీ. కానీ రెండింటినీ చెప్పి అంతకు మించి ఆమె ముఖం సువాసనాభరితమైన పద్మం అని చెప్పడం ఈ గాథలోని విశేషం. బంగారానికి తావి అబ్బడం అంటే ఇదే. సౌందర్యానికి సౌశీల్యంతోడైతే మనిషికి అంతకన్నా మించిన పరిమళమే ముంటుంది. ఒకవ్యక్తి సౌందర్యం చూసిన వారికే తెలుస్తుంది. కానీ ఆ వ్యక్తి యొక్క ప్రతిభావిశేషాలు, గుణగరిష్ఠత ఖండాంతరాలు దాటి వ్యాపిస్తాయి. అదే మనిషి తాలూకా పరిమళం అంటే.

ప్రాకృతమూలం:

అహిలేంతి సురహిణీ ససిఅ పరిమలాబద్ధ మండలం భమరా।
అముణిఅ చందపరిహవం అపువ్వకమలం ముహంతిస్సా॥ (వసంతుడు) (4–66)

సంస్కృతచ్ఛాయ:

అభితీయంతే సురభినిః శ్వసిత పరిమలాబద్ధమండలం భ్రమరాః।
అజ్ఞాతచంద్రపరిభవ మపూర్వకమలం ముఖంతస్యాః॥

నీవుంటే క్షణాలే!

ఆ.వె॥ **నిన్నరాత్రి సగము నీవు వచ్చెదవంచు**
నీదు చెలికి గడచె నిమిషమట్లు
నీవు రానికతన నిబిడమౌ విరహాన
వత్సరంబువోలె పరగెసగము॥

– "ఆమె, నీవు వస్తావనే ఆశతో రాత్రి సగభాగాన్ని నిమిషంలా గడిపేసింది. అర్ధరాత్రి దాటేసరికి నీవు రావని తెలిసి విరహంతో బాధపడుతూ, ఆ సగం రాత్రినీ సంవత్సరంలా గడిపేసింది"

– అని నాయిక విరహవేదనను దూతిక నాయకునికి తెలియజేస్తోంది.



వివరణ:

'నీవు నా పక్కనుంటే హాయి / నీవు లేకుంటే చీకటిరేయి' అంటాడో సినీకవి. అంటే ఇష్టమైన వాళ్ళు వెంట ఉంటే రోజులు, సంవత్సరాలు క్షణాల్లా గడిచిపోతాయి. దీనికి ఉదాహరణ శ్రీరాముని పదునాలుగేళ్ళ అరణ్యవాసంలో పదమూడు సంవత్సరాలు హాయిగా గడచిపోయాయి. చివరి సంవత్సరంలోనే రావణుడు సీతను ఎత్తుకుపోవడం, రావణ సంహారం ఇత్యాది ఘటనలన్నీ జరిగాయి. అందువల్ల సీతమ్మ చెంతలేక పోవడం వల్ల శ్రీరామునికి ఆ వత్సరకాలం ఎలా గడిచిందో మనకు తెలియంది కాదు.

ప్రాకృతమూలం:

ఏహిసి తుమం త్తిణి మిసం వజగ్గిఅం జామిణీఅ పడమద్ధం ।
సేసం సంతావ పరవ్వసాఇవరిసంవవోలీణం ॥ (అల్లడు) (4–85)

సంస్కృతచ్ఛాయ:

ఏష్యసిత్వమితి నిమిషమివ జాగరితం యామిన్యాఃప్రథమార్ధమ్।
శేషం సంతాప పరవశాయా వర్షమివ వ్యతిక్రాంతమ్॥

పిండిమహాలక్ష్మి

ఆ.వె॥ పిండిదంచు రైతు పిల్లకు మేనెల్ల
పిండి యలముకొనగ, విహిత జలధి
మథనమున వెలసిన, మహలక్ష్మి గానెంచి
కన్నులార్పకుండ కనిరి జనులు॥

– ఒక రైతు పిల్ల బియ్యపు పిండి దంచుతోందట. పిండి ఆపాదమస్తకమూ పడడం వల్ల ఆ పిల్ల ఒళ్ళంతా తెల్లని రంగు వేసినట్లు మెరిసిపోతోందట. ఆ దృశ్యాన్ని చూచిన వారికి, పాలసముద్రాన్ని మధించే వేళలో జనించిన లక్ష్మీదేవిలా ఆపిల్ల అలరారుతోందని కన్నులార్పకుండా చూచారట. ఇది సురభివత్సుడు అనే గాథాకారుడి చమత్కార భరితమైన కథనం.



వివరణ:

క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటికే భారత, భాగవతగాథలు జన సామాన్యం మనసుల్లోకి ఎలా ఇంకిపోయాయో ఈ గాథ తెలియజేస్తుంది. ముద్దుగా బొద్దుగా అల్లరి చేసే చిన్న పిల్లలందరూ మనకళ్ళకు బాలకృష్ణులే. కళగా ఉన్న కన్నెపిల్లలందరూ మహాలక్ష్ములే. రోళ్లు, రోకళ్ళు తెలియని నేటికాలంలో 'మిక్సీలోంచి పిండి ఎలా ఎగిరిపడుతుంది, మమ్మీ!' అని పిల్లలు అడిగినా ఆశ్చర్యం లేదు. కానీ ఆడపిల్లలను మహాలక్ష్మి స్వరూపాలుగా భావించే నాటి సామాజిక జీవనం మళ్ళీరావాలని ఆకాంక్షిద్దాం.

ప్రాకృతమూలం:

పేచ్ఛంతి అణిమిసచ్ఛా పహిఆ హలి అస్సపిట్ఠ పండురి అం।
ధూ అం దుద్ధ సముద్దు త్తరం తలచ్ఛి వి అసఅష్ణో ॥(సురభి వత్సుడు) (4–88)


సంస్కృతచ్ఛాయ:

ప్రేక్షంతే ఽ నిమిషాక్షాః పధికాహలికస్య పిష్టపాండురితామ్।
దుహితరం దుగ్ధసముద్రోత్తర లక్ష్మీమివ సతృష్ణాః॥

కలనైనా కనపడు!

ఆ.వె॥ ప్రియుని కలలనైన ప్రియమార గాంచెదు
ఇంతి భాగ్యగరిమ నెంచదరమె
చెంతవాడులేక చేరదే ననునిద్ర
కలలవెట్లు? వానిగాంచుటెట్లు?

– విరహవేదన పడుతున్న ఒక కాంత తన సఖితో ఇలా అంటోంది. "నిద్రలోనైనా కలల్లో ప్రియుని చూడగలిగిన తరుణులదే భాగ్యం. కానీ వాడు నాకు చెంతలేనిదే కన్నులు మూతపడవు. నిద్రారాదు. ఇంక వాణ్ణి కలలోనైనా చూచేదెట్లాగే సఖీ!" అని బాధపడుతోందా నాయిక.



వివరణ:

విరహానికి పరాకాష్ఠ ఈ గాథ. కలలోనైనా నిన్ను చూద్దామనుకుంటే కనులు మూతపడడం లేదని కలత చెందే నెలత గాథ ఇది. 'కలనైనా నీ తలపే' అనీ పాడుకోలేని అభాగ్యసౌభాగ్యవతి ఆమె. ఆలుమగల మధ్య గాఢమైన అనురాగాన్ని ఈ గాథ ప్రతిపాదిస్తుంది.

ప్రాకృతమూలం:

ధణ్ణా తా మహిలాఓ జాదఇఅం సవిణఏ విపేచ్ఛంతి।
ణిహవ్విఅతేణవిణా ణఏఇ కాపేచ్ఛఏ సివిణం ॥ (మలయశేఖరుడు) (4-97)

సంస్కృతచ్ఛాయ:

ధన్యాస్తా మహిలా యాదయితం స్వప్నేపి ప్రేక్షంతే।
నిద్రైవతేన వినానైతి కాప్రేక్షతే స్వప్నామ్॥

ఎండవేడిమా! అదెక్కడ?

ఆ.వె॥ **ముద్దుగొలుపు ముదిత ముఖచంద్ర చంద్రికా**
శీతఝరులు, మదిని చెలగుచుండ
మాడ్చు మండుటెండ, మధ్యాహ్నవేళలో
వెడలు, పాంథునెట్లు వెతలు పెట్టు॥

– 'మనస్సులో ప్రియురాలి ముఖమనే చంద్రబింబం నుండి జాలువారే చల్లని ప్రవాహాలుండటం వల్ల ఆ బాటసారికి ఉష్ణతాపం తెలియడం లేదట' మండుటెండలో కులాసాగా వెళుతున్న ఒక బాటసారిని గూర్చిన చమత్కార భరితమైన గాథ ఇది.



వివరణ:

మనస్సులో సంతోషం ఆవరించి ఉన్నప్పుడు ఎండ, గాలి, చలి ఇవేవీ అనిపించవు. వాటి తీవ్రతా అనుభవంలోకి రాదు. అంతా మనసులోనే ఉందేమో! ననిపిస్తుంది. కొంతమంది చిన్నకష్టానికే బెంబేలెత్తిపోతారు. మరికొంతమంది బండెడు కష్టాలు ముసురుకున్నా తొణకరు, బెణకరు. కారణం వారు మానసికంగా బలవంతులవడమే.

ప్రాకృతమూలం:

మజ్ఝహ్ణ పత్థి అస్స విగిమ్హే పహి అస్స హరఇసంతావం।
హిఅఅ ట్ఠి అజా ఆముహమ అంకజోహ్ణ జలప్ప వహో॥

(మంగలకలసుదు) (4–99)

సంస్కృతచ్ఛాయ:

మధ్యాహ్న ప్రస్థిత స్యాపి గ్రీష్మే పథికస్య హరతి సంతాపం।
హృదయస్థిత జాయా ముఖమృగాంక జ్యోత్స్నా జలప్రవాహః॥

అశోకవృక్షపు ఆశ

తే.గీ॥ **ఇలను లలనల కుసుమకోమల కరముల**
కననశోకమా! రసికనికరము నీదు
ముగ్ధ పల్లవంబులతోడ పోల్చుచుండ
ఆకసంబును తాకగా, ఆశ ఏల?

– సహజంగా అశోకవృక్షం బాగా ఎత్తుగా ఎదిగి ఆకాశాన్ని ముద్దాడుతూ ఉన్నట్టు ఉంటుంది. ఆ విషయాన్నే గాథాకారుడు చమత్కరిస్తున్నాడిక్కడ. "ఓ అశోక వృక్షమా! భూమిపై లావణ్యవతుల చేతులను నీ చివురులతో పోలుస్తూ ఉంటే, ఆ అదృష్టానికి పొంగిపోక ఆకాశాన్ని తాకాలనే ఆశ నీకెందుకు?' అని ఒక సహజమైన విషయాన్ని చమత్కార ప్రపూరితం చేస్తున్నాడు కరిలుడు అనే గాథాకారుడు.



వివరణ:

ఈ గాథలోని చమత్కారాన్ని అలా ఉంచి ఆలోచిస్తే లోకంలో కొంతమంది తమకున్న నైపుణ్యాన్ని వినియోగించుకోకుండా అనవసరమైన వాటిలో ప్రావీణ్యం కోసం పాకులాడుతూ ఉంటారు. దానివల్ల ఉభయ భ్రష్టత్వమే సంప్రాప్తమౌతూ ఉంటుంది. భగవంతుడు ప్రతిమనిషికీ ఏదోఒక ప్రత్యేకతనిస్తాడు. దాన్ని గుర్తించి వినియోగించుకొని వృద్ధిలోకి రావడానికి ప్రయత్నించాలి. అంతేకానీ, లేనివాటికోసం ఆరాటపడుతూ ఉన్నవాటిని నిర్లక్ష్యం చేయడం అవివేకం.

ప్రాకృతమూలం:

ఏ ఏణచ్చి అ కంకేల్లి తుజ్ఝతంణత్థి జంణ పజ్జంత్తం ।
ఉవమిజ్జఇ జం తుహ పల్లవేణ పరకామిణీ హత్థో ॥ (కరిలుడు) (5–4)

సంస్కృతచ్ఛాయ:

ఏతేనైపకం కేల్లే తవ తన్నాస్తి యన్న పర్యాప్తమ్।
ఉపమీయతే యత్తవ పల్లవేన వరకామినీ హస్తః॥

అశోకమా! నీవశోకమవు

తే.గీ॥ **కననశోకమా! నీవశోకమవు, నిజము**
పడతి చరణాహతికి, సుంత బాధపడక
పల్లవింతువెల్ల హృదులు పల్లవింప
నీదు నిరుపమ రసికత నెన్నదరమె॥

– స్త్రీలు కాలితోతంతే అశోకవృక్షం కుసుమించి విగరబూస్తుందని లోకంలో నానుడి. కవిసమయం కూడా! ఇదే విషయాన్ని ధ్వనిగర్భితంగా చెపుతున్నాడు గాథాకారుడు. ''ఓ అశోకమా! నీవు నిజంగా అశోకానివే! కారణమేమంటే నీకు శోకం లేదు. స్త్రీలు నిన్ను కాలితో తన్నినా నీకు శోకం రాదు. పైగా సంతోషించి విరబూస్తావు. నిరుపమానమైన నీ రసికత ఎంతైనా మెచ్చదగింది కదా!'' అని చమత్కరిస్తున్నాడు.



వివరణ:

దీనినే సానుకూల దృక్పథం (పాజిటివ్ యాటిట్యూడ్) అంటారు. మొక్కల్లో కూడా ఈ లక్షణాన్ని నాడే గమనించిన గాథాకారునికి నమస్కరించకుండా ఉండలేం. బంతిని ఎంత బలంగా నేలకేసి కొడితే అంతగా పైకెగురుతుంది. అలా తనకు ఎదురవుతున్న కష్టాలను, సమస్యలను అవకాశాలుగా మలచుకొని అభివృద్ధి పథంలో నడవాలని అశోకవృక్షం మనకు నేర్పే పాఠం.

ప్రాకృతమూలం:

రసిఅవిఅడ్ఢ విలాసిఅసమఅణ్ణఅసచ్చఅం అసోఓసి।
వరజు అయి చలణ కమలాహఓ విజం విఅససిసఅహ్ణమ్॥ (బ్రహ్మచారి) (5–5)

సంస్కృతచ్ఛాయ:

రసిక విదగ్ధ విలాసిన్సమయజ్ఞ సత్యమశోకోసి।
వరయువతి చరణకమలాహతోపి యద్వికససి సతృష్ణమ్॥

ఇప్పుడే ఇలా ఉంటే...

తే.గీ॥ **గ్రామణితనయ నవయువక హృదయాల**
ముగ్ధగానె, మోహంబులో ముంచుచుండె
విషపుచెట్టువోలె పెరిగిపెరిగి, ముందు
ముందు, ఈ బాల ఏకొంప ముంచగలదొ!

– గ్రామాధికారి కుమార్తెను గూర్చి "ఈమె ఇంత చిన్న వయస్సులోనే తన తళుకు బెళుకులతో గ్రామంలోని యువకులందరినీ మోహంలో ముంచుతోంది. ఈమె గనుక పెరిగి పెద్దదై ప్రౌఢగా మారితే ఏ ప్రమాదం కొని తెస్తుందో!'' అని జనం పలువిధాలుగా అనుకుంటున్నారని భోజయుడనే గాథాకారుదు చెపుతున్నాడు.



వివరణ:

కొందరు చిన్నతనంలోనే ముదురు మాటలు, వయసుకు మించిన పనులు చేయడం సమాజంలో చూస్తుంటాం. అది పెంపకంలో లోపం కావచ్చు, లేదా పరిసరాల ప్రభావమూ కావచ్చు. పెద్దలు సకాలంలో గుర్తించి వీరిని సరైన మార్గంలో పెట్టకపోతే వీరి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. వీరి వల్ల మరికొందరి జీవితాలూ ప్రమాదంలోపడే అవకాశముంది.

ప్రాకృతమూలం:

ఎత్తా ఇచ్చి అ మోహం జణేఇ బాలత్తణే వివట్టంతీ।
గామణి ధూ ఆ విసకందలివ్వ వడ్ఢీఆ కాహిఇ అణత్థమ్॥ (భోజకుడు) (5–10)

సంస్కృతచ్ఛాయ:

ఏతావత్యేవ మోహం జనయతి బాలత్వే ఉపి వర్తమానా।
గ్రామణీదుహితా విషకందళీవవర్ధితా కరిష్యత్యనర్థమ్॥

చక్రిపాదమునకు శరణమనుడు

ఆ.వె॥ ఆ సురేంద్రుగావ, అసురేంద్రయాచించి
ఆకసంబునందు 'అడుగు' గొల్చి
చుక్కలనెడు పూలc చక్కగా నతిగొన్న
చక్రిపాదమునకు శరణమనుడు॥

– ఇది ఒక భాగవత సంబంధమైన గాథ. వామనావతార ఘట్టం, ఇంద్రుణ్ణి రక్షించడానికి వామనుడై బలిని మూడుడగుల నేల యాచించి భూవ్యాకాశాలను తన పాదాలతో కొలిచాడు హరి. ఆకాశాన్ని కొలిచే వేళ, హరిపాదమును కనుగొని, తన తండ్రి పాదము గానెరింగి, బ్రహ్మ తనకమండలంలోని జలంతో కడగడం మనకందరకూ తెలిసిందే! ఆ సమయంలో ఆకాశంలోని చుక్కలనే పూలతో కూడా



శ్రీహరి పాదం పూజింపబడిందని ఈ గాథలోని చమత్కారం. అట్టి మహత్తరమైన హరిపాదమునకు వినమ్రులై నమస్కరించమని చెపుతున్నాడు గాథాకారుడు.

ఈ గాథను చదువుతూంటే పోతన గారి 'ఇంతింతై వటుడింతై' అన్న పద్యమూ, అన్నమాచార్యులవారి 'బ్రహ్మకడిగిన పాదము' అనే కీర్తనా గుర్తురాక మానవు.

ప్రాకృతమూలం:

అపహుప్పంతం మహిమండలమ్మి ణహసంఠి అంచిరం హరిణో
తారాపుప్ఫప్ప అరంచి అం వతఇఅంపఅంణమహ॥ (ఉయహియుడు) (5–11)

సంస్కృతచ్ఛాయ:

అప్రభవన్ మహోమండలే నభస్సంస్థితం చిరంహరేః॥
తారాపుష్పప్రకరాంచిత మివతృతీయం పదం నమత॥

గోప గోపీ విలాసహేల

ఆ.వె॥ **"నల్లవాడు వాడు, తెల్లని వెలుగీవు**
కలసి రాత్రివేళ, మెలగుచుండ
జనులకనుల కెపుడు, కనుపింపదాతండు
అల్లరౌదు వీవె, అనియె గోపి॥

– "అసలే కృష్ణుడు నల్లనివాడు. నీవు మెరుపుతీగలా తెల్లగా ఉంటావు. ఇద్దరూ కలసి రాత్రిపూట తిరగడం ఎవరు చూచినా, నీవే కనిపిస్తావు కానీ, వాడు చీకట్లో కలసిపోయి కనపడడు. అందువల్ల నీవే అల్లరౌతావు. కాబట్టి ఆ చిలిపి గోపాలునితో జాగ్రత్తగా ఉండమని" ఒక గోపకాంత మరొక గోపికతో చెపుతోంది.



వివరణ:

బాలకృష్ణుని లీలావిలాసం ఈ గాథలో వర్ణించబడింది. ఇందులో గొప్ప విశేషమేమిటంటే – నాయకుణ్ణి నల్లనివాడని మాత్రమే సూచించాడు గాథాకారుదు. ప్రసిద్ధమైన నల్లవాడు శ్రీకృష్ణుడే కదా! ఇంకా ఈ గాథాసప్తసతిలోని 2వ శతకంలో 12వ గాథ ప్రత్యక్షంగా శ్రీకృష్ణుణ్ణే ప్రస్తావిస్తుందికూడా!

ప్రాకృతమూలం:

చోరిఅర అసద్ధాలుఇ మాపుత్తి బ్భమసు అంధఆరమ్మి
అహి అఅరం లక్ఖి జ్జసి తమభరిఏదీవసీహవ్వ॥ (బమ్హయంతుడు) (5–15)

సంస్కృతచ్ఛాయ:

చౌర్యరతశ్రద్ధాశీలే మాపుత్రి భ్రమరాంధకారే
అధికతరం లక్ష్యసే తమోభృతే దీపశిఖేవ ॥

హృదయాధిరాజు-రేరాజు

ఆ.వె॥ **కరములెపుడు మోదకరములై వర్తిల్లు**
కళలవెన్నొ మిగుల కలుగువాడు.
అందనట్టివాడు, అందమ్ముగలవాడు
రాజువాడు, హృదికి రాజువాడు॥

– ఇది ఒక అందమైన గాథ. రేరాజైన చంద్రుణ్ణీ తన మనసుకు రాజైన ప్రియుణ్ణీ ఏకకాలంలో వర్ణిస్తోంది నాయిక. వర్ణించే పదాలు ఇద్దరికీ వర్తించే విధంగా ఉన్నాయి. కరములు అంటే కిరణములు అని అర్థం. చేతులు అని మరో అర్థం. ప్రియుని పరంగా వాని కరస్పర్శ ఆనందకరమనీ, చంద్రునిపరంగా కళలు కల్గిన వాడనీ, ప్రియుడు కళలో నిష్ణాతుడనీ అర్థం. చాలాదూరంలో ఉన్నాడు కనక చంద్రుణ్ణెవరూ అందుకోలేరనీ, తన ప్రియుణ్ణి కూడా ఉన్నతుడు కనుక ఎవరూ అందుకోలేరనీ అర్థం. అంటే చంద్రుడికీ, తన ప్రియుడికీ అభేదాన్ని కల్పిస్తోంది నాయిక ఈ గాథలో.



ప్రాకృతమూలం:

దీసంతో ణఅణ సుహొూ ణివ్వు ఇజణఓ కరేహిం విఛివంతో।
అబ్భత్థి ఓణలబ్భఇ చందో వ్వపిఓ కలానిలఓ ॥ (రాజరసికుడు) (5-21)

సంస్కృతచ్ఛాయ:

దృశ్యమానో నయనసుఖో నిర్వృతిజననః కరాభ్యామపి స్పృశన్।
అభ్యర్థితో నలభ్యతే చంద్ర ఇవప్రియఃకలానిలయః॥

అప్పుడప్పుడూ తప్పదు

ఆ.వె॥ **రత్న ఖచితమైన, రమ్యహారమునైన**
పడతి ప్రక్కనుంచు, పడకగదిని
ఎంత ఘనునికైన హీనత తప్పదు
సమయమహిమ వలన, స్థలము వలన॥

– ఎంత సుగుణవంతులైనా కాలమహిమ వల్ల అప్పుడప్పుడూ పలుచనవుతూ ఉంటారు. అది ఎలాగంటే ఎంత రత్నాలు, వజ్రాలు పొదిగిన హారాన్నయినా ప్రేయసి ఏకాంతంలో తీసి ప్రక్కన పెడుతుంది కదా!

వివరణ:



సమయం సందర్భం లేకుండా మాట్లాడే వారి విషయంలోనూ సమయం కాని సమయంలో 'తగుదునమ్మా!' అని తయారయ్యే వారి విషయంలోనూ ఈ గాథ అన్వయం. వర్షాకాలంలో కురిసే వానకే గౌరవం. కారణం అది అప్పుడు అవసరం కాబట్టి. అదే వర్షం పంటకోతలప్పుడు వస్తే స్వాగతం పలికేవారుండరు సరికదా! ఇప్పుడెందుకొచ్చిందో ఈ వాన అని విసుక్కుంటారు. అందువల్ల ఎంత మంచి మిత్రునితోనైనా సమయాసమయ వివేచనతో ప్రవర్తించమని ఈ గాథ నీతి చెబుతుంది.

ప్రాకృతమూలం:

ఖిప్పఇ హారో థణమండలాహి తరుణీ అ రమణ పరిరంభే।
అంచిఅ గుణా విగుణినో లహంతి లహు అత్తణం కాలే॥ (మకరందుడు) (5–29)

సంస్కృతచ్ఛాయ:

క్షిప్యతే హారః స్తనమండలాత్తరుణీభీ రమణపరిరంభే।
అర్చిత గుణా అపిగుణినోలభంతే లఘుత్వం కాలేన॥

అగ్ని-మన్మథాగ్ని

తే.గీ॥ **అగ్నివేరు, కనగ మన్మథాగ్నివేరు**
సరసహృదులందు ప్రేమాగ్ని సతతమందు
రసవిహీన జనుని అంతరంగమందు
మన్మథాగ్ని క్షణములోనె మాయమౌను॥

– ఒక నాయిక తన చెలితో చెపుతోంది. తన ప్రియుడు అరసికుడనీ, అతనికి హృదయంలో తనపై ప్రేమాగ్ని క్షణంలో ఆరిపోతోందనీ, అతడే కనుక సరసుడైతే మన్మథాగ్ని అతని మనస్సులో నిరంతరం ప్రజ్వలిస్తుండేదనీ బాధపడుతూ చెపుతోంది.



వివరణ:

భార్యభర్తల మధ్య ప్రేమలు చిరకాలం కొనసాగాలంటే సున్నితమైన భావనలు, పరస్పరానురాగం అనేవి అతిముఖ్యమైన అంశాలు. ప్రేమలేని సంసారం, నిస్సారంగా ఉప్పులేని పప్పులా చప్పగా సాగుతుంది.

ప్రాకృతమూలం:

అణ్ణో కోఽపి సుహోవో మమ్మహసి హిణో హలా హఆసస్స।
విజ్ఝాఇ నీరసాణాం హిఅఏ సరసాణం ఝుత్తి పజ్జలఇ ॥ (రామదేవుడు) (5–30)

సంస్కృతచ్ఛాయ:

అన్యః కోపి స్వభావో మన్మథ శిఖినో హలా హతాశస్య।
నిర్వాతి నీరసానాం హృదయే సరసానాం ఝటితి ప్రజ్వలతి॥

అదేబాణంతో...

ఆ.వె॥ **ఎట్టి శరముతోడ కొట్టినావో నన్ను**
అట్టిశరముతోడ కొట్టుమతని
మార! శ్రీరమా కుమార! పూజింతును
జన్మ జన్మములకు జ్ఞప్తిగలిగి॥



– "ఓ మన్మధా! నీ బాణాలతో నన్నే ఎందుకు కొడుతున్నావు. ఏ బాణంతో అయితే నన్ను కొట్టావో, అదే బాణంతో నా ప్రియుణ్ణి కూడా కొట్టు. అప్పుడు వాడికి నా విరహ బాధేమిటో తెలిసి వస్తుంది. అట్లా చేశావనుకో! వచ్చే జన్మలో కూడా నిన్నే పూజిస్తాను. అంటే జన్మజన్మలకూ నిన్నే పూజిస్తూ ఉంటాను'' అంటోంది నాయిక.

ప్రాకృతమూలం:

జమ్మంతరేవి చలణం జీఏణ ఖుమఅణతుజ్జ అచ్చిస్సం।
జఇతం పి తేణబాణేణ విజ్ఝసే జేణ హంవిజ్ఝా॥ (ముగ్ధుడు) (5-41)

సంస్కృతచ్ఛాయ:

జన్మాంతరేఽపి చరణౌ జీవేన ఖలు మదన తవార్చయిష్యామి।
యదితమపి తేన బాణేన విధ్యసి యేనాహం విద్ధా॥

విరహబాధ

తే.గీ॥ **శౌరితో గూడి భీముడు, కౌరవేయు**
మర్దనము సేయుగతి, మధుమాసవేళ
దక్షిణానిల మక్షీణ కక్షబూని
బాధపెట్టుచునున్నది, పాంథతతిని॥

– అసలే మధుమాసం. ఆపైన మలయానిలంచల్లగా వీస్తోంది. అంతకుమించి వ్యాపారార్థులై దూరదేశాన ఉండడం వల్ల కలుగుతున్న సతీ విరహబాధ. ఆ బాధ ఎలా ఉందంటే శ్రీకృష్ణుని నేతృత్వంలో భీముడు, దుర్యోధనుని మర్దించినప్పుడు అతనికి కలిగిన బాధకన్నా ఎక్కువగా ఉందట.



వివరణ:

ప్రియురాలు చెంత ఉన్నప్పుడు ఆనందహేతువులైనవే, వియోగసమయంలో విషాదహేతువులౌతాయి. వసంత ఋతువు, మలయానిలం ఎప్పుడూ ఆహ్లాదకరములే కదా! కానీ విరహంలో ఇవన్నీ శత్రు సదృశాలౌతాయని, మహాభారత కథతో పోల్చిమరీ చెపుతున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం:

కరుణా హెూవ్వి అ పహి ఓదూమిజ్జఇ మహవస్సమిలిఏణ।
భీమేణ జహిఢి ఆయే దాహిణ వాఏణ ఛిప్పంతో॥ (5-43)

సంస్కృతచ్ఛాయ:

కురునాథ ఇవపథికోదూయతే మాధవస్యమిలితేన ।
భీమేనయథేచ్ఛయా దక్షిణవాతేన స్పృశ్యమానః॥

సదాశివుడు - శాలివాహనుడు

ఆ.వె॥ **కామితములదీర్ప, కష్టంబులను బాప**
కలిమి బలిమి జవము గలుగువారు
శాలివాహనుండు, సర్వేశ్వరుండును
గాక, అన్యులెవరు గలరు ధరణి.

– ఇది నాటి సమాజంలో శాలివాహనుడిపై ఉన్న ప్రజాభిప్రాయం. 'ఆ రాజు దేవుడి లాంటివాడు' – అంటారే అదే అభిప్రాయం క్రీ.శ. 1వశతాబ్దంలో శాలివాహనుడిపై ఉందన్నమాట. ఇతడు పరమశివునిలా ఏదడిగినా ఇస్తాడనీ, కష్టాల నుంచి గట్టెక్కిస్తాడనే ప్రజాభిప్రాయానికి ప్రబలసాక్ష్యం ఈ గాథ.



(ఈ గాథను చదువుతూంటే మొఘల్ పాదుషా షాజహాన్ ఆస్థానంలో విలసిల్లిన క్రీ.శ. 17వ శతాబ్దానికి చెందిన జగన్నాథ పండితరాయలవారి క్రింది శ్లోకం గుర్తుకురావడం లేదూ!

శ్లో॥ **ఢిల్లీశ్వరోవా జగదీశ్వరోవా**
మనోరథం పూరయితుం సమర్థః
అనేన కేనాపి నృపేనదత్తం
శాకాయవాస్యాత్ లవణాయవాస్యాత్॥

– కోరికలు తీర్చాలంటే ఢిల్లీ పాదుషా అయినా అయి ఉండాలి లేదా సాక్షాత్తు పరమేశ్వరుడైనా కావాలి. వేరొకరాజు ఇచ్చేది ఏదయినా ఏ కూరకో, ఉప్పుకో సరిపోయేదే అవుతుంది.)

ప్రాకృతమూలం:

ఆవణ్ణాఇం కులాఇందోవ్విఅజాణన్తి ఉణ్ణఇంణేఉం।
గోరిఅహి అఅదఇఓ అహవాసాలాహణణరిన్దో॥ (పృధ్వీనాథుడు) (5–67)

సంస్కృతచ్ఛాయ:

ఆపన్నాని కులాని ద్వావేవ జానీత ఉన్నతిం నేతుమ్।
గౌర్యా హృదయదయితోఽథవా శాలివాహన నరేన్ద్రః॥

ఎంతవారలైన కాంతదాసులే!

ఆ.వె॥ **నీరజాక్షి! కనగ, నీదు కనుబొమల**
విల్లునుండి బయలు వెడలుచున్న
వాలుచూపులనెడు, బాణాలు తగిలియు
బ్రతికి బయటపడిన వాడెవండు?

– "అందమైన కన్నులు గల ఓ అమ్మాయీ! నీ కనుబొమలు అనే విల్లు నుండి వెలువడుతున్న వాలుచూపుల బాణాలు తగిలి బ్రతికి బట్టకట్టిన వాడెవడు?" అని అందమైన నాయిక వాడి చూపులను వర్ణిస్తున్నాడు గాథాకారుడు. 'చంపేసేంత అందం' అంటారే! అదే ఈ గాథలోని విశేషం.



వివరణ:

'ఆడదాని ఓరచూపులో, ఈ జగాన ఓడిపోని ధీరుడెవ్వడో!' అంటాడో సినీకవి. 'ఇంతులు తారసిల్లు వరకే' నంటాడు 'చింతామణి' నాటకకర్త కాళ్ళకూరి నారాయణరావుగారు. 'ఎంతవారలైనా కాంతదాసులే' అంటాడు త్యాగరాజస్వామి వారు. ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా కామం ధర్మబద్ధమైతే ఆమోదయోగ్యమూ, ఆనందకరమూ అవుతుంది. లేదంటే రావణ, కీచకులకు పట్టిన గతేపడుతుంది.

ప్రాకృతమూలం:

మారేసి కం ణ ముద్ధే ఇమేణ పేరంతరత్త విసమేణ।
భులఆచావ విణిగ్గ అతిక్ఖ అరద్ధచ్ఛిభల్లేణ॥ (శ్రీమాధవుడు) (6–4)

సంస్కృతచ్ఛాయ:

మారయసి కం న ముగ్ధే అనేన పర్యంతరక్త విషమేణ
భ్రూలతా చాప వినిర్గత తీక్ష్ణతరార్ధాక్షిభల్లేన ॥

భాగ్యశాలి

ఆ.వె॥ **ఆలుబిడ్డలెపుడు అనుకూలముగనున్న**
వాడె, చూడ! పరమభాగ్యశాలి
అట్లు లేనివాడు అవనీధవుండైన
కడుదరిద్రుడనుట, కటికనిజము॥

– అనుకూలంగా ఉన్న భార్యబిడ్డలున్నవాడే లోకంలో అదృష్టవంతుడు, ధనవంతుడు. అలాకాకుండా నిరంతరం జగడమాడే భార్య, సమస్యలతో సతమతమయ్యే సంసారమున్నవాడు ఎంత ఐశ్వర్యమున్నా, తుదకు రాజాధిరాజే ఐనా వాడు కటికపేదవాడితో సమానం, అని ఈ గాథాకారుడి భావం.



వివరణ:

వేమన 'ఇంటిలోని పోరు ఇంతింత కాదయా' అంటాడు. అంటే ఇంటిలో పోరు ఇంత అని చెప్పడానికి వీల్లేదని అర్థం. ఎవరికైనా బయట ఒత్తిళ్ళ నుంచి ఉపశమనం ఇంటి వద్దే లభించాలి. కానీ ఇంటిలోనే ఒత్తిడి ఉంటే ఆ మనిషికిక మనశ్శాంతి కరవే. కాలం వెంట పరుగులు పెడుతున్న నేటి తరుణంలో భార్యభర్తలు ఎక్కువ, తక్కువల చర్చ జోలికి పోకుండా సమన్వయంతో ఇంటిని 'ఆనందనిలయం' చేసుకోవాలి. సమాజాన్ని ఆనందబంధురం గావించాలి.

ప్రాకృతమూలం:

సాహిణపి అఅమో దుగ్గ ఓ విమణ్ణఇ కఅత్థమప్పాణమ్।
పిఅరహిఓ ఉణపుహవింవిపావి ఉణ దుగ్గఓచ్చేఅ॥ (ఈశ్వరుడు) (6–15)

సంస్కృతచ్ఛాయ:

స్వాధీన ప్రియతమో దుర్గతోపి మన్యతో కృతార్థ మాత్మానమ్।
ప్రియరహితః పునః పృథివీ మపి ప్రాప్యదుర్గత ఏవ॥

ఏనుగు ఏనుగే

తే.గీ॥ **మేనిపై ధూళిమెండుగా మెలగుగాక!**
పంక సంకరస్థితిలోన పరగుగాక!
గడ్డిపోచలు దేహాన కలుగుగాక!
తానె చాటగలదు కరి తనదు ఘనత॥

– ఏనుగు గొప్పతనాన్ని తెలిపేగాథ ఇది. 'చచ్చినా, బ్రతికినా ఏనుగు ఏనుగే' అనే సామెతకు సాదృశ్యరూపం ఈ గాథ. ఏనుగు ఒంటినిండా దుమ్ముకొట్టుకొని ఉండనీ, బురదపూసుకుని ఉండనీ, గడ్డిపోచలు ఒళ్ళంతా అంటుకొని ఉండనీ గాక! ఏనుగు యొక్క ఘనతను ఒకరు చెప్పక్కర్లేదు. ఏనుగు తన ఘనతను తానే చాటుకొనగలదని ఈ గాథ సారాంశం.

వివరణ:

ఏనుగు భూమి మీద చరించే జంతువులలో అతిపెద్దది. అందుకే ఏనుగును గజేంద్రుడు అంటారు. ఏనుగు ఐశ్వర్యానికి ప్రతీక కూడా. అందుకే ఏనుగును శ్రీ మహాలక్ష్మికి ఇరువైపులా చిత్రిస్తారు. ఇంటి గుమ్మాలకు ఏనుగు బొమ్మలుంచుతారు. ఏనుగును ఎట్టి పరిస్థితుల్లోనూ కించపరచకూడదు. అసలు ఈ గాథలోని అంతరార్థమేమిటంటే – గొప్పవాళ్ళు, విద్వాంసులు, ఉత్తములు పరిస్థితుల వల్ల గడ్డం మాసిపోయి, చిరిగిన బట్టలతో కనిపించినా వారి గొప్పతనానికి అణుమాత్రం కూడా లోపం రాదని, వారిని సమాజమూ తక్కువ చేసి చూడకూడదని.

ప్రాకృతమూలం:

ధూలిమఇలో విపంకం కిఓ వితణరఇఅదేహ భరణోవి॥
తహవిగఇన్దో గరు అత్తణేణ ఢక్కంసముచ్వహ ఇ॥ (6–26)

సంస్కృతచ్ఛాయ:

ధూలిమలినోఽపిపంకాంకితోఽపి తృణరచిత దేహభరణోఽపి।
తథాపిగజేన్ద్రో గురుకత్వేన ఢక్కాం సముద్వహతి॥

అన్నిటా నీ రూపే

ఆ.వె॥ **నిఖిల జగమునందు నీ చిత్రపటముల**
వ్రేలగట్టి రనగ వేల్పులెవరొ
అన్ని దిక్కులందు అగుపించు నీరూపు
నాదునేత్రములకు ననవరతము ॥

– 'ప్రియా! ఎటుచూస్తే అటు నువ్వే కనిపిస్తున్నావు. నీ చిత్రపటాలను భూమిపై అన్ని దిక్కులయందు వ్రేలగట్టినారా ఏమి?' అని ప్రశ్నిస్తోంది నాయిక.



వివరణ:

'కనులు మూసినా నీవాయె, కనులు తెరిచినా నీవాయె' అన్న స్థితే ప్రతి ప్రేమికుల జంటకూ ఉంటుంది. 'ఎదుటా నీవే, ఎదలోనా నీవే' అన్నట్టూ ఉంటుంది. ఈ గాథలో నాయికకు ఎటు చూస్తే అటు నాయకుని రూపమే కనిపిస్తోందట. ఆమె చమత్కారంగా 'నీ చిత్రపటాలేమైనా అన్ని చోట్లా వ్రేలగట్టారా ఏమి?' అని అమాయకంగా అడుగుతోంది. భాగవతోత్తములైన వారికి విశ్వమంతా విష్ణుమయమైనట్లు, ప్రేమికులకు జగమంతా ప్రేమమయమే!

ప్రాకృతమూలం:

జం జం పులఏమి దిసంపుర ఓ లిహిఅవ్వదీససేతత్తో।
తుహపడిమాపడి వాడిం వహఇవ్వ స అలం దిసాచక్రం॥ (6–30)

సంస్కృతచ్ఛాయ:

యాం యాం ప్రలోకయామి దిశం పురతో లిఖితఏవదృశ్యతేతత్ర।
తవప్రతిమా పరిపాటీం వహతీవ సకలం దిశాచక్రమ్॥

చెంత లేకుంటే చింతే

ఆ.వె.॥ మధురసౌరభములు, మంగళవాద్యముల్
భక్ష్య భోజ్యతతులు, పానకములు
కంటగింపులాయె, కాంతకు హోళిలో
చెంత ప్రియుడు లేని చింత చేత॥

– హోళీ పండుగ జరుగుతోంది. మంగళవాయిద్యాలు అందంగా మ్రోగుతున్నాయి. సుగంధపరిమళాలెల్లడలా వెదజల్లబడుతున్నాయి. తినడానికి రుచికరమైన పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. ఇవేవీ ఆమెకు ఆనందం కలిగించడం లేదు. కారణమేమిటంటే ప్రియుడు చెంత లేకపోవడమే.

వివరణ:



ఇష్టమైన మగడు తోడుంటే అడవి కూడా నందనోద్యానవనమే. ఆతోడు లేకుంటే ఆకాశహర్మ్యమైనా అడవితో సమానం. పండుగ మనసుకు రావాలి. క్రొత్త బట్టలు, పిండివంటలు ఇవేవీ పండుగను రప్పించలేవు. ఆత్మీయతలు, అనుబంధాలు మెండుగా ఉన్న ఇంట్లోనే పండుగ. అవన్నీ ఉన్న రోజే నిజమైన పండుగ. అదేవిషయాన్ని ఈ గాథ ప్రతిపాదిస్తుంది.

ప్రాకృతమూలం:

ఉప్పహపహా విహజణో పవిజిమ్భిఅకలఅలో పహఆతూరో।
అవ్వోసో చ్ఛేఅక్ఖణో తేణవిణా గామడాహోవ్వ॥ (6-35)

సంస్కృతచ్ఛాయ:

ఉత్పథ ప్రధావిత జనః ప్రవిజృంభిత కలకలః ప్రహతతూర్యః।
దుఃఖం స ఏవ క్షణస్తేన వినాగ్రామ దాహ ఇవ॥

వాననీళ్ళు - కన్నీళ్ళు

ఆ.వె॥ **ఆమె ఇంటిలోని అవనీతలంబెల్ల**
తడియుచుండె వర్షధారతోడ
కొంతమిగిలెనేని గుడిసెయందు, అదియు
తడియు, నామె బాష్పధారతోడ॥ (6-40)

– పాపం అది ఒక పేదరాలిగుడిసె.



గుడిసె కప్పుకు అన్నీ రంధ్రాలే. పతి ఇంటలేదు. వర్షం వచ్చింది. ఇంటి కప్పు రంధ్రాల్లోంచి వర్షం ధారగా ఇంటిలోని నేలను తడిపేస్తోంది. భర్త దగ్గర లేకపోవడం వల్ల ఆమె కళ్ళూ వర్షిస్తున్నాయి. వర్షం తడపకుండా మిగిలిన నేలేమైనా ఉంటే, దాన్ని కూడా ఆమె అశ్రు ధార తడిపేస్తోంది.

వివరణ:

కష్టాల్లో పతి దగ్గర లేకపోవడం ఏ సతికైనా దస్సహమే! దుర్భరమే! అందునా జోరున వానకురుస్తున్నప్పుడు, చిల్లుల ఇంట్లో ఒంటిరిగా ఉంటే ఏ సతికైనా కన్నీళ్ళే వస్తాయి. దాన్ని కరుణరసాత్మకంగా చిత్రించాడు గాథాకారుడు. ఆమె ఇల్లు మొత్తం తడిసిపోయిందని ధ్వని పూర్వకంగా చెప్పడం ఈ గాథలోని విశేషం.

ప్రాకృతమూలం:

పహి అవహు వివరంతరగలి అజలోల్లే ఘరే అణోల్లంపి।
ఉద్దేసం అవిర అవాహ సలిలణి వహేణ ఉల్లేఇ ॥ (స్పందనుడు) (6-40)

సంస్కృతచ్ఛాయ:

పథిక వధూర్వివరాంతరగలిత జలార్ద్రే గృహేనార్ద్రమపి।
ఉద్దేశమవిరత బాష్ప సలిల నివహేనార్ద్ర యతి॥

స్థిరచిత్తునితత్వం

ఆ.వె॥ **చెరకుగడకు గాని, స్థిరచిత్తునకు గాని**
నలిగిపోవు బాధకలుగుగాక!
ఒకటి మధురరసము నొసగు, మరియొకండు
మధురభాషణంబు మానబోడు॥

ఈ చెరకు గడను పీల్చి పిప్పి చేసినా కూడా మధురమైన రసాన్నే ఇస్తుంది. అలాగే ఉత్తములైన వాళ్ళకు బాధకలిగినా కూడా కఠినంగా, అప్రియంగా మాట్లాడకుండా తమ సహజమైన రీతిలో మధురంగానే మాట్లాడతారు.



వివరణ:

ఉత్తములైన వాళ్ళకు బాధకలిగితే మౌనంగా భరిస్తారు కానీ నిందించడం గానీ, దూషించడం గానీ చేయరు. అని ఈ గాథ ప్రతిపాదిస్తుంది. అంటేఉత్తములకు ఎప్పుడూ బాధకలిగించకూడదన్న మాట. వాళ్ళు గోవుల్లాంటివాళ్ళు. మౌనంగా బాధపడే గోవులనూ, ఉత్తములనూ హింసించడం వల్ల లోకానికి మేలు జరుగదు సరికదా! కీడు ముంచుకు వస్తుంది.

ప్రాకృతమూలం:

జీహాఇ కుణంతిపిఅంభవంతి హిఅఅమ్మిణివ్వ ఇంకా ఉం।
పీడి జ్జంతా విరసం జణంతి ఉచ్చూ కులీణా అ॥

సంస్కృతచ్ఛాయ:

జహ్వాయాం కుర్వంతి ప్రియం భవంతి హృదయే నిర్వృతింకర్తుం।
పీడ్యమానా అపిరసం జనయింతీ క్షవః కులీనాశ్చ॥

మన్మథప్రతాపం

ఆ.వె॥ **మావిచిగురు కనగ, మధుమాసవేళలో**
మరిమరి విహరించు మన్మథుండు
విరహుల ప్రవహించి పెకలించి నట్టిదౌ
బల్లెమట్లు అరుణ వర్ణమందె॥

– నవ వసంతవేళ కుంకుమవర్ణంతో ఉన్న మావి చిగురు ఎలా ఉందంటే, విరహబాధాతప్తులైన వాళ్ళను మన్మథుడు తన బల్లెంతో పొడిచి పెలికితీయగా దానికి నెత్తురంటితే ఎలా ఉంటుందో, అలాఉందట.



వివరణ:

ఈ గాథలో ఒక సహజనమైన విషయాన్ని ఉత్ప్రేక్షిస్తున్నాడు గాథాకారుడు. సహజంగా మావిచిగురు ఎర్రగా ఉంటుంది. అంత ఎర్రగా ఉండటానికి కారణం మన్మథుడట. మన్మథుడు తన బల్లెంతో విరహంతో ఉన్నవాళ్ళను కొడితే... అది దిగబడిపోతే... దాన్ని పెకలిస్తే... ఎంత రక్తవర్ణశోభితమౌతుందో ఊహించుకోమంటున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం:

ణవ పల్లవం విసణ్ణా పహిఆ పేచ్ఛన్తి చూ అరుక్ఖస్స ।
కామస్స లోహి ఉప్పంగరాఇఅం హ త్థ భల్లంవ॥ (6-85)

సంస్కృతచ్ఛాయ:

నవపల్లవం విషణ్ణాః పధికాః పశ్యన్తి చూతవృక్షస్య।
కామస్య లోహిత సమూహరాజితం హస్తభల్లమివ॥


చిక్కుకున్న లేడికూన

ఆ.వె॥ **కానలోనమండు కార్చిచ్చునుగనియు**
అరుణవర్ణశోభ నలరుచున్న
పూచినెగడునట్టి మోదుగుచెట్లంచు
భ్రమసి లేడి కూన వదలిరాదు॥

– అడవిలో కార్చిచ్చు ఎఱ్ఱగా మండుతోంది. కానీ అమాయకమైన లేడిమాత్రం ఆ ఎఱ్ఱదనాన్ని పూచిన ఎఱ్ఱని మోదుగుపూలుగా భావించి ఇవతలికి రావడం లేదట. పాపం ఆ అమాయకపు లేడికి ఏమౌంతుందోనని ఆందోళనపడుతున్నాడు గాథాకారుడు.

వివరణ:

భ్రమ ఎప్పుడూ ప్రమాదహేతువే. ఎండమావుల్ని సరస్సులుగా భావించి పరుగెత్తే లేళ్ళను కావ్యాల్లో చూడవచ్చు. అందుకే ఎండమావుల్ని మృగతృష్ణలు అంటారు. మనిషి కూడా ప్రమాదం వస్తుందని తెలుసుకోలేక అనేక వ్యసనాల్లో కూరుకుపోతుంటాడు. వ్యవసాలు మనిషిని ఆపదల్లో పడవేస్తాయి. అమాయక లేడిలాగా వాటిల్లో చిక్కుకున్న మనిషి మాడిమసైపోతాడు. తస్మాత్ జాగ్రత్త!



ప్రాకృతమూలం:

తమ్మిరపసరి అహు అవహజాలాలి పలీవిఏ వణాహోఏ ।
కింసు అవణన్తి కలిఊణ ముద్ధహరిణో ణణిక్కమఇ॥ (సారుదు) (6–88)

సంస్కృతచ్ఛాయ:

తామ్రవర్ణ ప్రసృతహుతవహ జ్వాలావలిప్రదీపితే వనాభోగే।
కింశుకవనమితి కలయిత్వా ముగ్ధహరిణో నని ష్క్రామతి॥

పూలు కొనుటకా? సొగసుకనుటకా?

తే.గీ॥ **యౌవనారంభ సంరంభయైన, రంభ**
బోలు, కులుకుతళుకుల పూబోడి యొకతె
పూవులమ్ముచుండ జనులు మూగినారు
కొనుటకొరకా! ఆమెసొగసు కనుటకొరకా!

(మూలగాథలోని విషయాన్ని కొద్దిగా నేటి నాగరికతకు అనుగుణంగా మార్చడం జరిగింది)



– దారినపోయే బాటసారికి ఒకదృశ్యం కంటబడింది. అందమైన అమ్మాయి ఒకతె పూవులమ్ముకొంటోంది. చుట్టు ఎందరో పురుషులు మూగి ఉన్నారు. వీరంతా 'పూలు కొనడానికా! లేక ఆమెను చూడడానికా!' అని చమత్కరిస్తున్నాడు గాథాకారుడు.

ప్రాకృతమూలం :

మాలారీ ఏ వేల్లహల బహుమూలావలోఅణసఅహ్ణో।
ఆలిఅంపి భమఇ కుసుమగ్ఘ పుచ్ఛిరో పంసులజుఅణో। (శాలివాహనుడు) (6–98)

సంస్కృతచ్ఛాయ :

మాలాకార్యాః సుందరబాహుమూలావలోకన సతృష్ణః।
అలీకమపి భ్రమతి కుసుమార్ఘప్రశ్నశీలః పాంసులయువా॥

నేను ఇష్టం కాకుంటే...

ఆ.వె॥ **ఏమిసేయ నీకు ఇష్టంబు కాదేని**

అట్లు సేయకుండు టగునుగాని

హృదిని అసలునేనె ఇష్టంబుకాకున్న

ఏమిసేయగలను? ఏదిదారి?

– "ఏమేం చేస్తే నీకు ఇష్టం కాకుండా ఉంటుందో వానిని చేయకుండా ఉండి నీకు అనుకూలంగా వర్తించగలను గానీ, అసలు నేనే నీకు ఇష్టం లేకపోతే నేనేం చేయగలను?" అంటోంది పరాన్ముఖుడైన నాయకునితో నాయిక.



వివరణ:

స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఉదయించడానికి పెద్దగా కారణాలేం ఉండక్కర్లేదు. అది అత్యంత సహజంగా చెట్టుకు పూవు పూసినంత సుకుమారంగా జనిస్తుంది. దాన్ని అర్థం చేసుకోకుండా ఏకపక్ష ప్రేమను కొనసాగిస్తే దుష్పరిణామాలే సంభవిస్తాయి. అవసరార్థ ప్రేమలు, వ్యాపారాత్మక ప్రేమల గురించి ఆలోచించకపోవడమే మంచిది.

ప్రాకృతమూలం:

జం జం తేణ సుహాఅఇ తంతంణకరేమి జంమమాఅత్తం।

అహఅం చిఅజం సుహామి సుహఅ తం కిం మమా అత్తం॥

(మేఘచంద్రుదు) (7–15)

సంస్కృతచ్ఛాయ:

యద్యత్తేన సుఖాయతే తత్తన్న కరోమియన్మమాయత్తమ్।

అహమేవ యన్నసుఖాయే సుభగ తత్కిం మమాయత్తమ్॥

సొంతంగా బ్రతుకు

ఆ.వె॥ **నా కుమారుడనని, నా గొప్ప చేతనే**
సుతుడ! వ్యర్థముగను, బ్రతుకబోకు
జగతిలోన నాకు, నగుబాటు తేబోకు
మనియె, గ్రామపెద్ద అంత్యమందు॥

– "నాకుమారుడనని చెప్పుకుంటూ పనీపాటా లేకుండా వ్యర్థంగా బ్రతుకబోకు. నాకు చెడ్డపేరు తేబోకు. యుక్తంగా ప్రవర్తించి మంచిపేరు తెచ్చుకొమ్మని "తన పుత్రునికి అంత్యకాలంలో హితబోధ చేస్తున్నాడు గ్రామపెద్ద.

వివరణ:



వారసత్వం కన్నా, జవసత్వం మిన్న అని పదే పదే అంటూంటారు మన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు గారు. ఆ మాట అక్షరసత్యం. తాతలు సంపాదించిన ఆస్తిపాస్తులను, పేరు ప్రతిష్ఠలను అనుభవిస్తూ పండితపుత్రులుగా జీవించేవారి కీ గాథ ఒక గుణపాఠం. స్వయంగా సంపాదించి సాధించుకున్న సిరిసంపదలు, గౌరవమే మనసుకు సంతృప్తినిస్తాయి. 'ఉత్తమం స్వార్జితం విత్తం, మధ్యం పితురార్జితం' (స్వయంగా సంపాదించుకున్న ధనమే ఉత్తం, పిత్రార్జితమైన ధనం మధ్యమం) అని మనకు తెలిసిందే కదా!

ప్రాకృతమూలం:

అప్పాహేఇ మరంతో పుత్తం పల్లీ వఈ పఅత్తేణ ।
మహణామేణ జహతుమం ణలజ్జసే తహ కరేజ్జాసు॥

సంస్కృతచ్ఛాయ:

శిక్షయతి మ్రియ మాణః పుత్రం పల్లీపతిః ప్రయత్నేన
మమనామ్నా యథాత్వన లజ్జసేతహకరేజ్జాసు॥

గిరిజన పదములు

ఆ.వె॥ **విరులనలరు తరులు, విమలమైన ఝరులు**
కదలిపోవు కరులు, గండశిలలు
వలచి నాట్యమాడు, వనమయూరమ్ములు
గిరిజనులకు నందకరములెపుడు॥

– ఈ గాథ ఒక అందమైన ప్రకృతివర్ణన. విరిసిన పూలతో అందంగా ఉన్న కదంబవృక్షాలు, కడిగిన ముత్యాల్లా మెరుస్తున్న గండశిలలూ, ఆనందంతో నర్తన చేస్తున్న సుందరవనమయూరాలూ, గలగల పారే సెలఏళ్ళూ – కొండప్రాంతాలలో నివసించేవారిని నిత్యోత్సాహం కలిగిస్తాయని ఈ గాథ సారాంశం. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉన్నవాళ్ళు చిరకాలం జీవించడంలో ఆశ్చర్యం లేదు. చైనాలో ఒక కొండప్రాంతం ఉందట. ఆ ప్రాంతంలోనే ఎక్కువమంది శతాధికవృద్ధులున్నారట. కారణమేమిటా, అని ఆరాతీస్తే కొండ ఎక్కిదిగడం వల్ల వ్యాయామం, స్వచ్ఛమైన గాలి వారి చిరాయువుకు హేతువులని తేలింది. అందువల్ల ప్రకృతితో మమేకమై జీవిస్తే ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటామన్నమాట.

ప్రాకృతమూలం:

పప్ఫుల్ల ఘణకలంబా ణిద్ధో అసిలా అలా ముఇ అమోరా।
పసరంతో జ్ఝరముహలా ఓసాహంతే గిరిగ్గామా॥ (7-36)

సంస్కృతచ్ఛాయ:

ప్రోత్ఫుల్ల ఘనకదంబా నిర్ధౌత శిలాతలా ముదితమయూరాః।
ప్రసరన్నిర్ఝర ముఖరా ఉత్సాహయంతి గిరిగ్రామాః॥

పెళ్ళివేళ

ఆ.వె॥ **ముగ్ధమోహనముగ ముత్తైదువులు పాడు**
పెండ్లిపాట కోరివినగననగ
వరుని పేరు విన్నవధువుకు మేనెల్ల
పులకరించె, సిగ్గుపలుకరించె॥

– ఒక అమ్మాయికి పెండ్లి కుదిరింది. పెండ్లికూతుర్ని చేస్తున్నారు. ముత్తైదువులు పెండ్లిపాటలు పాడుతున్నారు. ఆ పాటల్లో వరుని గోత్రనామాలు వినిపించాయి. అవి విన్న వధువుకు మేనెల్లా పులకలు పొటమరించాయి. పులకలు కూడా పెండ్లి పాటలు వినడానికి వచ్చాయా అన్నట్లున్నాయని చమత్కరిస్తున్నాడు గాథాకారుడు. ఇప్పుడే ఇంత పులకరింతలు, పలవరింతలు గాఉన్న ఈ వధూవరుల దాంపత్యం ముమ్ముందు మరెంత మధురంగా సాగుతుందోనని చర్చించుకుంటున్నారట పెండ్లికి వచ్చిన అమ్మలక్కలు.



ప్రాకృతమూలం:

గిజ్జన్తే మంగలగాఇఆ ఆహివరగోత్త దిణ్ణ అణ్ణా ఏ।
సోఉం పణిగ్గ ఓ ఉఅహ హొూన్తవహు ఆఇరోమంచే॥ (7-41)

సంస్కృతచ్ఛాయ:

గీయమానే మంగలగాయికాభివరగోత్త దత్త కర్ణాయాః
శ్రోతుమివ నిగతః పశ్యతభవిష్యద్వధూకాయారోమాంచః॥

భానుమూర్తీ! నీకు వందనం

ఆ.వె॥ **అవని కింపు గూర్చు అరుణకిరణుడవు**
నభముదాల్చినట్టి నగవు నీవు
రాత్రి మరొకచోట రాజిల్లువాడవు
భానుమూర్తి! నీకు వందనమ్ము॥

– ఇది ఒక సూర్యస్తుతి. "చూచేవారికి ఆనందం కలిగించేవాడవు, ఉదయసంధ్యలో ఎర్రని కిరణాలు గల్గినవాడవు, రాత్రిపూట వేరొకచోటకు వెళ్ళి ప్రకాశించేవాడవు, ఆకాశమునకు ఆభరణమైనవాడవు అయిన ఓ దినపతీ! సూర్యదేవా! నీకు నమస్కారము"



వివరణ:

సూర్యుడు ప్రత్యక్షదైవం. సూర్య ఆరాధన మన జీవన విధానంలో అనాదిగా ఉన్నదే. యుద్ధరంగంలో శ్రీరాముడు సైతం అగస్త్యమహర్షి సూచనతో సూర్యుని ఆరాధించాడు. అలా లోకానికి అందించబడినదే అపురూపమైన ఆదిత్య హృదయం. ఆదిత్యహృదయం పఠించడం వల్ల ఆరోగ్యం సమకూరుతుందని అనాదిగా మన విశ్వాసం.

ప్రాకృతమూలం:

పచ్చూసాగఅ రంజి అదేహ పి ఆలోఅ లోఅణాణంద।
అణ్ణత్త ఖివి అసవ్వరి ణహ భూసణ దిణవఇ ణమోదే॥ (7–53)

సంస్కృతచ్ఛాయ:

ప్రత్యూషాగత రక్తదేహ ప్రియాలోకలోచనానంద।
అన్యత్ర క్షపిత శర్వరీక నభోభూషణ దినపతే నమస్తే॥

సహజమైన ఎఱ్ఱదనం

ఆ.వె॥ ఎఱ్ఱమట్టి త్రవ్వి ఇంట చెట్లకు పోసి
చేతులెఱ్ఱబడగ చెఱుపనెంచి
రుద్దిరుద్ది కడుగు ముద్దియన్ పతియనె
పల్లవంబులెట్లు తెల్లనౌను॥

– "వెఱ్ఱిదానా! చేతికి అంటుకున్న ఎఱ్ఱరంగు పోలేదని ఎందుకు పదే పదే కడుగుతున్నావు. అంటిన రంగు ఎప్పుడో పోయింది. ఇప్పుడు కనిపించే ఎఱ్ఱదనం లేత పగడపు రంగులో సహజంగా మెరిసిపోయే నీ అరచేతుల అందం" అన్నాడు నాయిక అమాయకత్వానికి నవ్వుకుంటూ నాయకుడు.



ఆమె చేతులకు ఎందుకు ఎర్రరంగు అంటుకుందో మూలగాథలో చెప్పబడలేదు. కానీ ఎర్రమట్టితో పని చేయడం వల్ల అయి ఉంటుందని పెద్దలు తిరుమలరామచంద్రగారు తమ 'ప్రాచీనాంధ్ర గాథలు' గ్రంథంలో ఊహించారు. వారి ఊహ సమంజసంగా ఉండడం వల్ల నేనూ దాన్నే స్వీకరించాను. నాయిక అరచేతులు మామిడి చివుళ్ళలా పగడపు కాంతితో ఎఱ్ఱగా మెరిసిపోతున్నాయని చెప్పడం ఈగాథలోని చమత్కారం.

ప్రాకృతమూలం:

ముద్దే అపత్తి అన్తీ పవాల అంకుర అవణ్ణ లోహి అఏ।
ణిద్ధో అధాఉరాఏ కీస సహత్థే పుణోధు అసి॥ (7–78)

సంస్కృతచ్ఛాయ:

ముగ్ధే ఉ ప్రత్యన్తీ ప్రవాలాంకుర వర్ణలోహితౌ।
నిర్ధౌత ధాతురాగౌ కిమితి స్వహస్తౌ పునర్ధావయసి॥

శరత్కాల మేఘాలు

తే.గీ॥ **జలధరంబులు శారదసమయమందు**
వర్షధారలు కురిపించి వట్టిపోయి
ఉప్పుకొండలవలె దూదికుప్పలవలె
వెలయుచుండెను ఆకాశవీధిలోన॥

– శరత్కాలంలో మేఘాలు నీరులేకపోవడం వల్ల తెల్లగా ఉప్పుకొండల్లాగా, ఏకిన దూదికుప్పల్లాగా ఉన్నాయని వర్ణిస్తున్నాడు గాథాకారుడు.



వివరణ:

వర్షఋతువులో మేఘాలు నల్లగా కదలిపోయే ఏనుగుల్లాగా ఉంటాయి. అదే శరదృతువు వచ్చేసరికి మేఘాల్లో నీరుండదు కనుక అవి తెల్లగా మారిపోతాయి. అప్పుడు ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మబ్బులు వెండికొండల్లాగా మెరుస్తూ ఉంటాయి. ఆస్వాదించేవారికి ఏ ఋతువులోనైనా ప్రకృతి అందంగానే కనిపిస్తుంది.

ప్రాకృతమూలం:

ఉ అ సింధవ పవ్వ అసచ్ఛ హోఇధు అతూలపుంజసరిసాఇం।
సోహంతి సుఅణు ముక్కో అఆఇం సరఏసి అబ్భాఇం॥ (7–79)

సంస్కృతచ్ఛాయ:

పశ్యసైంధవ పర్వత సదృక్షాణి ధుతతూలపుంజ సదృశాని।
శోభంతే సుతను ముక్తోదకాని శరది సితాభ్రాణి॥

మధురోహలు

తే.గీ॥ **అతడు పరదేశవాసియై అరుగుదెంచి**
వేయికనులతోడ సతిని వెదకుచుండ
చెట్టు చాటున గలగల చెవిని బడగ
అతని హృదయాన మధురోహ లలముకొనియె॥



– కొత్త అల్లుడు చాలా కాలం తరువాత అత్తవారింటికి వచ్చాడు. అతని కళ్ళు భార్యకోసం అదేపనిగా వెతుకుతున్నాయి. ఎంతకూ ఆమె కనపడదే! పెరట్లో ఉన్న చెట్టుచాటు నుంచి గాజుల గలగల మాత్రం అతని చెవినిబడింది. ఆమె అక్కడ స్నానం చేస్తోందని గ్రహించి, అతని మదిలో మధురోహలు ముసురుకున్నాయి.

ప్రాకృతమూలం:

అవరణ్హాగ అజమా ఉఅస్సవిఉణేఇ హే హణుక్కంఠం।
వహూ ఆఇ ఘరపలోహరమజ్జణ పిసుణోవలఅసద్దో॥ (7-83)

సంస్కృతచ్ఛాయ:

అపరాహ్ణాగత జామాతుర్ద్విగుణయతి మోహనోత్కంఠాం।
వధ్వా గృహపశ్చాద్భాగ మజ్జనపిశునో వలయశబ్దః॥

ఆ.వె॥ **చంద్రవదన! నీవు చంద్రగ్రహణవేళ**
ఆరుబయట నిదుర నందబోకు
సరగున వదనంబు చంద్ర బింబమనియు
పాపి రాహువునిను పట్టునేమొ॥

– "ఓ అమ్మాయీ! చంద్రగ్రహణ సమయంలో ఆరు బయట నీవు పడుకోబోకు. ఎందుకంటే, చంద్రబింబమనుకొని రాహువు నీ ముఖాన్ని పట్టుకుంటాడేమో!" నని చమత్కరిస్తున్నాడు నాయకుడు. నాయిక ముఖం అందమైన చంద్రబింబంలా ఉందనీ, చంద్రునికీ, ఆమె ముఖానికీ అభేదం కల్పించి మరీ చెపుతున్నాడు నాయకుడు.

తే.గీ॥ **అతివ నదిలోన జలకమ్ములాడువేళ**
ఆమె అరమోడ్పు కన్నుల నరసినట్టి
చెలులు తీరాన గూర్చొని తలచిరిట్లు
నీటిలోపల చెలికాడు నిలచెనేమొ?

– నదిలోపల జలకాలాడుతున్న నెచ్చెలి ముఖకవళికలను గమనించిన ఆమె చెలులు, నీటి అడుగున ఆమె ప్రియుడున్నాడేమోనని భావించారు.

తే.గీ॥ **వచ్చు నవసతిని గని సపత్నులనిరి**
మగడు నీమీద కురిపించు మరులఝురులు
శాశ్వతంబనుకోకు, ఈ సంబరంబు
వలపుబులుపులు మరొకతె వచ్చువరకె॥

– బహుపత్నీత్వం గల నాటిరోజుల్లో, ఒకనికి పెళ్ళైంది. క్రొత్త పెళ్ళాం వచ్చింది. ఆమె మీద మగడు విపరీతంగా ప్రేమ కురిపిస్తున్నాడు. అది చూచిన ఆమె సపత్నులు 'ఈ ప్రేమ శాశ్వతమనుకోబోకు. మరొకతె పెళ్ళాంగా వచ్చేవరకే నీకీ వైభోగమని' చెప్పారట.

ఆ.వె॥ **జనపచేనిని పతి జారుడగుట ఁజూచి**
ఉలకకుండ మగువ పలుకకుండ
అల్లుకొన్నయట్టి ఆనపపాదును
అంటకత్తిరించె అతనిముందు॥

– భర్త పరస్త్రీల వైపు చూస్తున్నాడనే విషయం ఆమెకు తెలిసింది. సున్నితంగా చెప్పడం కోసం ఇంట్లో అల్లుకున్న సొరపాదును ఆమె కత్తిరించి వేసిందట. తేడా వస్తే నీకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించిందన్న మాట ఆ వీరనారి.

తే.గీ॥ **మంచెమీద నిలచి మంజుమంజులముగ**
వడిసెలనుద్రిప్పు కుసుమాంగి వరుసజూచి
"భరతనాట్యాన ఇదియొక భంగిమేమొ?
బాగు బాగని మెచ్చెను" పాంథుడొకడు॥

– ఒక బాటసారి దారిన వెళుతున్నాడు. ఒక అమ్మాయి వయ్యారంగా మంచె మీద నించొని వడిసెలను సుతారంగా త్రిప్పుతూ పిట్టలను తోలుతోంది. అది చూచి "భరతనాట్యంలో ఇది ఒక భంగిమేమోననుకొని ఆమెను అభినందించాడట" – ఆ బాటసారి.

తే.గీ॥ **మనిషి కనరాని ఎత్తుకు, జనపచేను**
ఎదిగి, కనువిందుసేయంగ, ఏదుపంది
వచ్చి త్రొక్కి వ్రక్కలు చేసి, పాడుసేయ
కన్నె వెక్కివెక్కియు నేడ్చె, కాపుకన్న॥

– జనప చేను బాగా ఎదిగి వచ్చింది కానీ అడవిపందివచ్చి చేలోబడి పాడుచేసింది. దీనికి రైతుకన్నా అతని కూతురు ఎక్కువగా బాధపడిందట. ఈ గాథలో ధ్వని ఏమిటంటే – జనపచేను ఆ రైతు కూతురికి తన ప్రియుణ్ణి కలుసుకునే సంకేతస్థలం.

హరనమః పార్వతీపతయే!

ఆ.వె॥ **అర్ఘ్యమిచ్చువేళ హస్తయుగ్మంబునన్**
పార్వతివదనంబు ప్రతిఫలింప
మంత్రములను పలుకమరచి, మైమరిచిన
నాగభూషణునకు నతులనిందు॥

– అర్ఘ్యమిద్దామని పరమేశ్వరుడు దోసిట్లోకి జలాన్ని తీసుకున్నాడు. ఆయన అర్ధనారీశ్వరుడు కాబట్టి జలంలో పార్వతీదేవి ముఖపద్మం ప్రతిఫలించింది. అంత పరమేశ్వరుడు మైమరచిపోయి మంత్రాలను ఉచ్ఛరించడం మాని కేవలం పెదవులను మాత్రమే కదిలించాడట. అట్టి పరవశుడైన పరమేశ్వరునకు నమస్సులు. అని ఈ గాథ యొక్క భావం. జగత్తునకు మాతాపితరులైన పార్వతీపరమేశ్వరులు మనకందరికీ శుభములనొసగు గాక!



ప్రాకృతమూలం:

సంఝాగహిఅజలంజలి పడిమాసం కంతగోరిముహకమలమ్।
అలిఅంచి అ పురి ఓట్ఠం విఅలి అమంతం హరంణమహ॥ (7–100)

సంస్కృతచ్ఛాయ:

సంధ్యాగృహీత జలాంజలిప్రతిమాసంక్రాంత గౌరీముఖకమలమ్।
అలీకమేవ స్ఫురితోష్ఠం విగలితమంత్రం హరంనమత॥